అపరాధ పరిశోధన

రూ. 5.50 జూన్ '84



Blank Page

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. మూడు ఆత్మల కథ—పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ
14. కనకయ్యగారి దత్తుడు—శ్యాంబాబు
44. చేతులు మారిన చప్పట్లు—పి. అరుణ
55. విషజంతువు—కాశీభట్ల భానుమూర్తి
74. పోస్టుమాన్ హత్య—చంద్రశేఖర అజాద్
85. టక్కరి పులి—కె.వి. రమణ
95. ఎంత మోసం—బి. రాజేశ్వరి
110. గరళకాయుడు—ఎమ్. వి. వి. సత్యనారాయణ
141. సన్నని మీసాలు—ప్రతాప రవిశంకర్
153. సీటు క్రింద శవం—భమిడిపాటి భాస్కరరావు
171. కాంచన శిఖరం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. నెత్తురు చిమ్మిన నెచ్చెలి—చంద్రశేఖర అజాద్
54. నాలుగు హత్యలు—బొమ్మిడి అచ్చారావు
95. అందమైన యువతి—టెంపోరావ్
134. పోస్టు బాక్సు—బి. రాజేశ్వరి
164. కళ్యాణ దుర్గం (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!

మాటు ఉత్తుల కథ

షాద్మాను రాజేంద్రప్రసాద్ వర్మ

అర్ధరాత్రి....

స్మశానం నిద్రమత్తులో జోగుతున్నది. అక్కడున్న నిశ్శబ్దాన్ని చీల్చుకొని కీచురాళ్ళు అరుస్తున్నాయి. వుండి వుండి నక్కలు బాకాలూదుతున్నాయి. గుడ్లగూబలు వికృ

తంగా ఏడుస్తున్నాయి.

అక్కడక్కడ చితులు మండుతున్నాయి.

మంటల వలన వస్తున్న పొగలు చీకటిలో మెరుస్తున్నాయి. అక్కడక్కడ పడివున్న పుర్రెలు పకపకిలిస్తున్నట్లు అసహ్యంగా వున్నాయి. వాతావణం భయంకరంగా వుంది.

స్మశానం నడిబొడ్డులో మర్రిచెట్టు. దాని ఊడలు విరబూసుకున్న ఆడదాని జడల్లా వున్నాయి. అప్పుడు అక్కడ ఆ మర్రిచెట్టు మీద మూడు ఆత్మలు కూర్చుని వున్నాయి.

ఇరవైనాలుగు గంటల తేడాలో చనిపోయిన ముగ్గురు మనుష్యుల ఆత్మలు అవి. అవి తమెందుకు చనిపోయాయో, ఆత్మలుగా ఎలా మారాయో చెప్పుకుంటున్నాయి.

ఒకటవ ఆత్మ చెప్పిన కథ

నేనొక స్త్రీని.

నేను ఇంటికి పెద్దదానిని కావటం వలన ఇంటిలో అందరి బాధ్యతా నామీదే పడింది. తమ్ముడి చదువు, చెల్లెలి చదువు నేనే చెప్పించవలసిన పరిస్థితి ఎదురు కావటం వలన ఉద్యోగం చేయవలసిన అవసరం వచ్చింది.

నేను చేసిన ప్రయత్నాలకి ఎక్కడ ఎలాంటి చిన్న ఉద్యోగమైనా దొరకలేదు.

ఎక్కడికి వెళ్ళినా నిరాశ ఎదురైంది. నాకీ జీవితంలో ఉద్యోగం దొరకదన్న నిర్ణయానికి వచ్చేసరికి ఒక ప్రయివేటు సంస్థలో ఉద్యోగ ప్రకటన చూశాను.

ఎందుకో నాలో ఆశ చిగురించింది. అప్లికేషన్ పెట్టాను. వెంటనే పిలుపు వచ్చింది. ఆ వూరిలోనే ఇంటర్వ్యూ అవటం వలన చాలా సంతోషం కలిగింది. ఇంటర్వ్యూ

రోజున కష్టాలు గట్టెక్కించబోతున్నందుకు దేవుడ్ని మన సారా పూజించాను.

ఉదయాన్నే ఆ కంపెనీకి బయలుదేరాను. అది దగ్గర గానే వుండటం వలన తొందరగా నేచేరుకోగలిగాను. కానీ అప్పటికే అక్కడ చాలామంది వచ్చారు. ఆ వచ్చినవారిలో ఆడవాళ్ళు చాలా తక్కువ మంది. వారిని చూస్తే అందరూ పెళ్ళయిన వారిలాగే వున్నారు. పెళ్ళయినవారు కూడా ఉద్యోగాలకి వస్తుంటే పెళ్ళికాని నాలాంటి దానికి ఉద్యోగాలు ఎలా దొరుకుతాయి అనిపించింది.

ఇంటర్వ్యూలో అందరినీ ఒకరి తరువాత ఒకరిని పిలిచారు. అయిపోయిన వారు వెళ్ళిపోతున్నారు. చివరగా నన్ను పిలిచారు.

భయంగా అడుగు పెట్టాను — ఆ గదిలోనికి. అక్కడ ముగ్గురు ఆఫీసర్లు కూర్చుని వున్నారు. ఇద్దరికి మధ్యలో వున్న వ్యక్తి నావైపు తదేకంగా చూస్తున్నాడు. అతను వారిద్దరి కంటే పెద్ద అధికారి కాబోలనని అనుకున్నాను.

వారు నన్ను అనేక రకాలైన ప్రశ్నలు అడిగారు. వాటికి తలాతోకా లేకపోయినా ఓపికగా అన్నింటికీ సమాధానాలు చెప్పాను.

ఆ మధ్యలో వున్న వ్యక్తికి నామీద సదభిప్రాయం కలిగినట్లుంది. విజిటింగ్ కార్డు నా చేతికి అందిస్తూ "సాయంత్రం ఒకసారి రండి .... ఉద్యోగం ఖాయం చేస్తాను" అన్నాడు.

మిగిలిన ఇద్దరూ నవ్వుతూ నావైపు చూశారు.

నాకు చాలా ఆనందం కలిగింది. భూమి మీద ఇంకా అటువంటి కరుణామూర్తులు వుండబట్టే ఈ లోకం ఇలా వుంది అనిపించింది. మెల్లగా అక్కడనుండి కదిలాను.

ఆ సాయంత్రం విజిటింగ్ కార్డులో అడ్రస్ వెతుక్కొని బయలుదేరాను. చాలా సేపు వెతికిన తరువాత సాయంత్రం సమయానికి ఆ ఇంటికి చేరాను.

ఇంటిని చూడగానే ధనవంతుల బంగళాలా తోచింది. మెల్లగా గేటు తెరిచాను. అంతలో నన్ను పిలిచిన వ్యక్తి ఎదురు వచ్చి "మీ కోసమే ఎదురు చూస్తున్నాను" అంటూ దగ్గరికి వచ్చి చేయి పట్టుకొని రూంలోనికి తీసుకువెళ్ళాడు.

నాకు కాస్త భయం కలిగింది. అంత పెద్ద ఇంటిలో ఎవరూ లేకపోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది. అదే విషయాన్ని ఆయన్ని అడిగాను. దానికి అతను "నా కింకా పెళ్ళికాలేదు" అన్నాడు.

అతను - ఎదురుగా వున్న సోఫాలో కూర్చోమని చెప్పి, ప్లాస్కులో వున్న కాఫీ ఒక కప్పుతో నా కందించి, అతనొక కప్పు తీసుకొని త్రాగడం మొదలుపెట్టాడు.

అతని అతి మర్యాద చూసి నాకు ఆశ్చర్యమేసింది. కాఫీత్రాగడం అయిన తరువాత—"మీకు ఉద్యోగం ఇస్తానన్నాను కదూ?" అన్నాడు.

అవునన్నట్లు చూశాను.

"మా కంపెనీలో ఖాళీలు చాలా తక్కువగా వున్నాయి. అయినా మీ క్వాలిఫికేషన్ చూసి మీ కివ్వాలనిపించింది" అంటూ నా శరీరం వైపు ఆశగా చూడసాగాడు.

నాకు ముచ్చెమటలు పోశాయి. బయటికి ఎంత తొందరగా వచ్చేద్దామా అనిపించింది - "నేను వెళ్తాను" అంటూ లేవబోయాను.

కానీ నన్ను లేవకుండా కూర్చోబెడుతూ "ఉద్యోగం వద్దా?" అన్నాడు వెకిలిగా.

"మీ వాలకం చూస్తుంటే భయమేస్తుంది!"

"నేనేం పులినా?"

"నా కంటికి అలాగే కనిపిస్తున్నారు" అని అందామనుకున్నాను. కానీ అనలేదు.

"నీకు ఉద్యోగం కావాలంటే నా కోరిక తీర్చు!" అంటూ మీదపడ్డాడు. నేను అదిరిపోయాను.

గింజుకున్నాను.... కొట్టాను ... రక్కాను. కానీ ఆ పశువు శాంతించలేదు. ఇంకా విజృంభించాడు. నేను నిస్సహాయంగా వుండిపోయాను.

చివరికి —

"రేపు వచ్చి ఉద్యోగంలో చేరు" అంటూ గేటువరకూ సాగనంపాడు.

నాకు శరీరం తూలిపోతున్నది. ఏదో లోకంలో వున్నట్లుగా అనిపించింది. ఎదురుగా అమ్మ, తమ్ముడు, చెల్లి 'ఉద్యోగం వచ్చిందా అక్కా!' అని అడుగుతున్నట్లుగా వుంది.

నా మనస్సు ముక్కలైంది. అటువంటి నీచుడి దగ్గర ఉద్యోగం చేస్తే, అతనికి అవసరం అయినప్పుడు ప్రతీసారీ చావాలి. ఈ పరిస్థితిలో ఇంట్లోవారికి నా ముఖం ఎలా చూపేది?

ఆ ప్రక్క నుయ్యి కనిపించింది. రాత్రి సమయం. ఎవరూ లేరు. సూటిగా గెంతేశాను. అంతే! ఆ తరువాత ఏమయ్యిందో తెలియదు. నా శవాన్ని నూతిలో నుండి తీసి ఇక్కడ స్థాపితం చేశారు—మావాళ్ళు.

"నా కథ ఇంతే" అది మొదటి ఆత్మ.

రెండవ ఆత్మ చెప్పిన కథ

నేను అతి పేద కుటుంబంలో పుట్టాను. చిన్నప్పుడే

తల్లిదండ్రులు పోవడంతో ఒంటరివాడినైనాను, నా తల్లి దండ్రులు నాకు ఇద్దరు చెల్లెళ్ళని వదలిపోయారు.

నేను కథలు రాస్తుంటాను. నా కథలను వివిధ పత్రికలు ప్రచురించాయి. సాహితీలోకంలో మంచి రచయితగా నాకు పేరుంది. నేను కథలు, నవలలు బాగా రాస్తానని అనేకమంది మెచ్చుకొనేవారు.

నేను నిరుద్యోగిని.

నా ప్రయత్నాలుకి ఫలితం దొరకడంలేదు. అందుకే నా కథలవలన వచ్చిన డబ్బులతో దినదిన గండంగా బ్రతుకుతున్నాను. ఎందుకంటే మన తెలుగు పత్రికల సంగతి అందరికీ తెలిసిందే. ప్రకటనల నుండి, అమ్మకాల నుండీ ఎంతో డబ్బు సంపాదిస్తాయి. ఏజంట్లుకు కూడా ఎక్కువ మొత్తంలో కమీషన్ అందిస్తాయి. కానీ రచయితల దగ్గరికి వచ్చేసరికి ఆ పక్షపాత వైఖరి ఎందుకో అర్థం కాదు.

ఒకసారి—

నేను పాల్గొన్న నవలలు పోటీలో ప్రథమ బహుమతి 10 వేలు ఇస్తున్నట్లు పత్రిక మేనేజ్‌మెంట్ నుండి వుత్తరం వచ్చింది. అందుకోసం ముందుగా వచ్చి కల్సుకోమన్నారు.

ఆ మరునాడు ఆఫీసుకి వెళ్ళాను.

ఎడిటర్ నన్ను అతని గదిలోనికి తీసుకువెళ్ళాడు.

"మా పత్రిక నిర్వహించిన నవలల పోటీలో మీకు బహుమతి ప్రకటించాము. మీ ఫోటో, పరిచయం అందులో వేస్తాము. దానివలన మీకు మరింత పేరువస్తుంది"అన్నాడు.

నేను ఏం మాట్లాడలేదు.

"మీరు ఓ సహాయం చెయ్యాలి. మీరు రచయితగా నాకు తెలుసును గాబట్టి మిమ్మల్ని పిల్చాను" అన్నాడు.

"చెప్పండి. తప్పక చేస్తాను!"

"అంతే చాలు...మీరు వెళ్ళండి. అవసరమైనప్పుడు చెబుతాను" అన్నాడు.

నేను ఇంటికి వచ్చేశాను.

పదివేలు బహుమతి తల్చుకోగానే నాకు చెల్లెళ్ళు గుర్తొచ్చారు. అప్పుడప్పుడు నేను మిగిల్చిన డబ్బులు కొన్ని వున్నాయి. ఇవి అవి కలిపి వారిని ఒక ఇంటివారిని చేస్తే ఆ తరువాత నా సంగతి చూసుకోవచ్చు. ఆ ఆలోచన రాగానే నా స్నేహితుడి దగ్గరికి వెళ్ళాను.

అతనితో ఇంతకు ముందే పెళ్ళిళ్ళ గురించి మాట్లాడి వుంచాను. అతనికి తెలిసిన ఇద్దరు యువకులున్నారు. వారిద్దరూ యోగ్యులు. ఉద్యోగాలలో వున్నారు. వారితో ఇంతకు ముందు కట్నం విషయంలో చిన్న విభేదం వచ్చింది. ఇప్పుడు నాదగ్గర డబ్బులున్నాయి. వారింతకు ముందే నా చెల్లెళ్ళను చూడటం వలన పెళ్ళి విషయాలు మాట్లాడాను.

మరో వారంలో కట్న కానుకలు నిర్ణయాలు జరిగాయి.

నాకు ఎంతో సంతోషం అనిపించింది. నేను పత్రికలిచ్చే పారితోషికాలు కూడబెట్టి ఎన్ని సంవత్సరాలకి పెళ్ళి చేయగలను? ఇలా బహుమతి రావటం నిజంగా అదృష్టమేమో అనుకున్నాను.

ఆ మరునాడు ఆ ఎడిటర్ని తిరిగి కలిశాను.

అతను చాలా బాగా మాట్లాడాడు. ఒక కాగితం మీద 10 వేలు ప్రథమ బహుమతి తీసుకున్నట్లు సంతకం చేయించాడు.

నా చేతికి ఎంత తొందరగా డబ్బు ఇచ్చేస్తే అంత తొందరగా పెళ్ళి ప్రయత్నాలలో దిగాలి.

"మీ నవల, మీరు పంపిన ఫోటో పరిచయాలతో

ప్రెస్‌కి వెళ్ళింది. రేపు వచ్చేస్తుంది. బహుమతి పొందిన అందరికి ప్రచురణ జరిగిన నెల తర్వాత బహుమతులు పంపడం ఆనవాయితీ. కానీ మీ విషయంలో ముందే ఇచ్చేద్దామనుకుంటున్నాను" ఆగాడు అతను.

నేను పొంగిపోయాను. అతని మంచితనానికి మెచ్చుకో కుండా వుండలేకపోయాను.

"మీరు హెల్ప్ చేస్తామన్నారు."

"అవును. గుర్తుందె చెప్పండి" అన్నాను.

"నేను స్కూటర్ ఒకటి కొందామనుకుంటున్నాను. ఏమంటారు?" అన్నాడు.

"కొనండి."

"అందుకే మిమ్మల్ని కోరుతున్నాను. ఈ బహుమతిని వదులుకోమని."

"ఏమిటి?....ఏమిటి మీరంటున్నది?"

"అవును. మా పత్రికలో ప్రతీ ప్రథమ బహుమతిలో తొమ్మిది వేలు నావే. ఇంతకు ముందు బహుమతిపొందిన రచయితలందరూ ఒప్పుకున్నారు. వారితో పదివేలిచ్చినట్లే రాయించుకున్నాను. రచయితలకు ప్రచారం కావాలి. దాని కోసం వారేమన్నా చేస్తారు. అసలు నేను మీకు బహుమతి ప్రకటించలేదనుకోండి. అప్పుడు మీకు పైసాకూడా రాదు కదా! ఏమంటారు?"

షాక్ కొట్టినట్లయింది.

ఓ నిమిషం ఏమీ మాట్లాడలేకపోయాను.

నా కళ్ళ ఎదురుగా పెళ్ళి బట్టలతో చెల్లిళ్ళు నిల్చుని కనబడ్డారు. వారిలో పెళ్ళికళ కనబడుతుంది. ఇంకో ప్రక్క కట్నం డబ్బులు ఇస్తేనే పెళ్ళికి ఒప్పుకుంటాం-అంటున్న పెళ్ళికొడుకులు కనబడ్డారు.

"నో" అంటూ గట్టిగా అరిచాను.

ఎడిటర్ వెంటనే మండిపడ్డారు. మీరెంత గట్టిగా అరిచినా ఈ సౌండ్ ప్రూఫ్ గదిలో ఏమీ పైకి వినబడదు. నేనిచ్చిన కాగితంమీద సంతకం పెట్టారు కదా? ఇదిగో ఈ వెయ్యి రూపాయిలు తీసుకొని వెళ్ళు" మర్యాదలేదు. నోట్లుకట్ట టేబిల్ మీద పెట్టాడు.

కోపం కట్టలు తెంచుకొంటున్నా నా పరిస్థితి వివరించాను. అయినా అతను కరగలేదు. "ఇంతలా బాధపడే కేసు ఈ నవలల పోటీ పెట్టిన దగ్గర నుండి ఇదే మొదటిది" అదోలాంటి నవ్వు నవ్వి — నా పోలసీ మారేది కాదు. మాట్లాడకుండా దయచేయండి. మీ పరిచయం వేసి మీకు కల్పిస్తున్న గుర్తింపును మరిచిపోతున్నారు" అన్నాడు.

నాకు కోపం లావాలా ఎగజిమ్మింది. జరగబోయే శుభ కార్యాలు వెక్కిరిస్తున్నట్లనిపించాయి. రూములో ఎవరూ లేరు. ఆవేశంతో అక్కడున్న పేపర్ వెయిట్ తీసుకొని ఆ ఎడిటర్ మొహంమీద బలంగాకొట్టాను. అంతే నా షాట్ కి దిమ్మతిరిగిపోయాడు తూలి క్రిందపడిపోయాడు. నాకు ముచ్చెమటలు పోశాయి దగ్గరికి వెళ్ళి చూశాను. ప్రాణం లేదు.

నేను ఎడిటర్ గదిలోనికి వెళ్ళటం చాలామంది చూశారు. ఎలాగైనా ఈ విషయం పోలీసులకి తెలిసిపోతుందనుకున్నాను. భయంతో వురితీసుకొని చనిపోయాను.

"ఆ విధంగా నేను ఆత్మగా మారాను. అదీ నా కథ" రెండవ ఆత్మ ముగించింది తన కథ.

మూడవ ఆత్మ చెప్పిన కథ

నేను నా కథ చెప్పదల్చుకొలేదు. మీ ఇద్దరి కథలూ నన్నెంతో కదిలించాయి. ప్రజలకి ఒక అవగాహన కలి

గించి, తిన్నయైన మార్గంలో నడిపించవలసి ఒకే ఒక వ్యక్తి వలన మీరిలా మారారు.

ఆ వ్యక్తి మరెవరో కాదు—నేనే.

అంతే!

మర్రిచెట్టుమీద కూర్చున్న మొదటి రెండు ఆత్మలు లేచాయి.

"ప్రజలకి దారి చూపించవలసిన ఎడిటర్ ఈ విధంగా ప్రవర్తించడం సహించలేం. పిండం కోసం ఆత్మ కొన్ని రోజులు ఆ ప్రాంతంలో వుంటుంది. కానీ నీలాంటి వారికి భూలోకంలో కాదు, ఇక్కడా స్థానం లేదు" రెండు ఆత్మలు అరుస్తున్నాయి.

ఎడిటర్ ఆత్మ వెనక్కి చూడకుండా పరుగు లంకించుకుంది. ఈ రెండు ఆత్మలకు తమ వెనక అనాధలుగ మిగిలిపోయిన తమవాళ్ళు గుర్తొచ్చారు. ఎడిటర్ ఆత్మను వెంట తరుముతూ పరుగెట్టాయి. □

పా (ప) ప్ మ్యూజిక్ !



శ్యాంబాబు

కనకయ్యగారి దత్తుడు

బ్లూ డెనిమ్ జీన్స్‌లో టక్ చేసిన లేతపసుపురంగు జపనీస్ షర్టు, మెడలో సన్నని బంగారు గొలుసు, నున్నగా గీసుకొన్న గడ్డం, సన్నటి పల్చటి పెదిమలమధ్య వెలుగుతోన్న ఇండియా కింగ్స్ సిగరెట్టు, సన్నని మీసం, కొద్దిగా

వంపుతేరిన పొడవాటి ముక్కు, రాత్రిళ్ళు ఎక్కువసేపు మేల్కొని వుండడంవల్ల కాస్త ఎరుపుకు తిరిగిన కళ్ళు, సన్నని కనుబొమలు, క్లింట్ ఈస్ట్ వుడ్ క్రాపింగ్.... నిలువుటద్దంలో నా రూపాన్ని చూసుకొని తృప్తిగా తలా డించుకొన్నాను....

డ్రెస్సింగ్ టేబిల్‌మీది 'స్ప్రింగ్‌ప్లవర్' బాడీ పెర్ ఫ్యూమ్ తీసి స్ప్రేచేసుకొన్నాను....చివరిసారిగా ఓసారి అద్దంలో నా రూపాన్ని తృప్తిగా చూసుకొని బయటికి నడి చాను....

క్రింద హాల్లో నాన్న ఫ్యాక్టరీ మేనేజరుతో ఏదో మాట్లాడుతున్నాడు. నేను వాళ్ళిద్దరినీ పట్టించుకోనట్లు బయ టికి నడిచాను. పోర్టికోలోని నా 'హోండా' ను ఓసారి టాంక్‌మీద హుషారుగా తట్టి స్టార్ట్‌చెయ్యబోతుంటే, వెనక నుండి నాన్న గొంతు వినబడింది.

రాత్రి ఎనిమిదిన్నరకు ఆ ఢిల్లీ డీలర్స్‌తో 'మనోరమా' లో డిన్నర్ వుంది....'' చెపుతున్నాడు నాన్న.

''ఎనిమిదింటి కల్లా ఇంటికి వస్తే ఇద్దరం కలిసి కార్లో వెళ్ళొచ్చు....లేకపోతే నువ్వు తిన్నగా హోటల్‌కి వచ్చినా సరే''—అంటున్నాడు....ఆ కంఠంలో మొదటి వాక్యానికీ నేనెక్కువ ప్రాధాన్యత నిస్తాను సుమా అనే హెచ్చరింపు వుంది....

టైము చూసుకొన్నాను .... అయిదున్నరయింది .... టైమెంతయినా నాకు సంబంధంలేదు....ఎలాగూ ఆ డిన్న ర్‌కి నేను వెళ్ళదలుచుకోలేదు....మన పథకంలో డిన్నర్‌కి వెళ్ళే సీన్‌లేదు.

''ఎనిమిదిన్నర కల్లా తిన్నగా 'మనోరమా' కే వస్తాను'' అన్నాను నేలచూపులు చూస్తూ....అప్పుడే ముసలాడ్ని

కంగారు పెట్టడంవలన నా కొరిగేదేమీ లేదు.

మోటార్‌సైకిల్ స్టార్ట్‌చేశాను....నాన్న కళ్ళు నా ప్రతి చర్యనీ అయిష్టంగా చూస్తున్నాయని తెలుసు....అందుకే ఆతనికా అయిష్టతనుండి త్వరలో విముక్తి కలిగించాలని నెలరోజుల క్రితం నిర్ణయించుకొన్నాను.

క్లచ్ నొక్కి గేర్ వేశాను....ఆక్సిలేటర్ రైజ్‌చేసి 'హోండా' ను ముందుకు వురికించాను. అలంకార్ బార్ అండ్ రెస్టారెంట్ వైపు మోటార్‌సైకిల్ దూసుకు పోసాగింది.

నా పేరు మహేశ్వర్....అయినా నన్నందరూ కనకయ్యగారి దత్తుడంటారు. కాస్త మర్యాదస్తులు మెహమాటస్తులు కనకయ్యగారి అబ్బాయంటారు....నాన్న....అంటే....నా పెంపుడు తండ్రిని ద్వేషించడానికి మొదటి కారణం అది. ప్రజలలా అనుకోవడానికి కారణం ఏదైనా....ఐ డోన్ట్ లైకిట్....నేను బాగా చిన్నప్పుడు, నా కసలు ఊహ తెలియనప్పుడు మా నాన్ననుండి ఈ నాన్న నన్ను దత్తు తీసుకొన్నాడు. అసలు నాన్న పెంపుడు నాన్నకు అన్నయ్య. అందువల్ల బంధువు లెవరికీ ఈ విషయంలో అభ్యంతరాలు లేవు. కాని అసూయమాత్రం వున్నట్లు ఊహ తెలిసింతరు వాత గ్రహించగలుగుతున్నాను.

ఆ అసూయవల్లే నేను కనకయ్యగారికీ సొంత కొడుకును కానని, ఆయన దయవల్ల దత్తత అయి ఆ ఆస్తి అంతా అనుభవిస్తున్నాననీ చాటుగా అనుకొనేవారు. నాకు మంచి రిఫరెన్స్ వచ్చినప్పుడల్లా 'కనకయ్యగారి దత్తుడు' అంటుండేవారు.

పెరిగిపెద్దయ్యేకొలదీ నా పెంపుడు తండ్రి కనకయ్యంటే అయిష్టం పుట్టటానికి చాలా కారణాలు కనిపించసాగాయి.

ఒకి అంటే పరమచిరాకు నాకు. అయినా నన్నెప్పుడూ స్కూలుకు పొమ్మనీ, పాఠాలు చదువుకోమని, అది చెయ్యమని ఇది చెయ్యమని ప్రాణాలు తీసేవారు నా పెంపుడు తలిదండ్రులు. నా అదృష్టవశాత్తు కనకయ్య భార్య నాకు ఆరేళ్ళప్పుడు టపా కట్టేయడం ఈ ముప్ఫైయేళ్ళ జీవితంలో మొట్టమొదటి అదృష్టం.

నా స్నేహితులన్నా, అలవాట్లన్నా గిట్టదు నాన్నకు...నేను సిగరెట్టు త్రాగుతున్నానని మొదటిసారి తెలుసుకొన్నప్పుడు స్వామి వివేకానందలా వారం రోజులు లెక్చరిచ్చాడు. పొగ త్రాగుటవలన కలిగేహాని, కాన్సర్, డబ్బునష్టం, పదిమందిలో కలిగే అప్రదిష్ట లాంటి పదజాలాన్ని విస్తృతంగా వుపయోగించి నాకు బ్రెయిన్ వాష్ చెయ్యాలని తెగ ప్రయత్నించాడు. మా నాన్న దివాళాకోరు ఆలోచనలమీద విపరీతమైన అసహ్యంతోబాటు, ఆ మనిషిని ఏడిపించడం కోసమైనా మరిన్ని సిగరెట్లు కాల్చాలని నిర్ణయం తీసుకొన్నాను.

అయితే; కనకయ్యమీద అసహ్యం, ద్వేషంగా మారడానికి ముఖ్య కారణాలు రెండు. మొదటిది అతని పిసినారితనం....డబ్బుకు, అతని జీవితానికి వున్న చిత్రమైన లంకె. ఎదిగిన కొడుకు అవసరాలు తీర్చలేని డబ్బున్న తండ్రి జన్మ వృధా అని నేనే నాలో నిర్ణయించుకొన్నాను. రెండవ కారణం డాలి.

డాలి.... పేరులోనే ప్రేమలూరే అద్భుత సౌందర్యరాశి. ఆమె నవయవ్వన సోయగాలను స్వంతం చేసుకోగల్గిన అదృష్టం నాకు కల్గడం మా నాన్న కిష్టంలేదు. అద్భుతమైన ఆమె అంగ సౌష్టవం ముందు దేవకాంతలైనా బలాదూర్. అలంకార్ బార్‌లో డిస్కో బాండ్ వాయిద్యానికి ఆమెచేసే

నాట్యం చూస్తే, నన్ను ప్రక్కకు నెట్టి మా నాన్నే ఆమెను పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడుతాడు. కాని ఏం లాభం ముసలాడికి మజాచేసే మన స్తత్వం లేదు నేను చేస్తే సహించలేడు. డాలీని పెళ్ళి చేసుకొంటానని చెప్పినప్పుడు ఆ క్షణంలోనే హార్టుఎటాక్ వచ్చి పోతాడేమో ననుకొన్నాను.

పోలేదు. పోతే పీడా పోయేది. కాని పర్నాడు లాయర్ను పిలిచి, నన్నుకూడా దగ్గర కూర్చోబెట్టుకొని, ఆస్థి కావాలో, డాలీ కావాలో తేల్చుకోమన్నాడు. ఎ వెరీ డిఫికెల్టు క్వశ్చన్. పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు వ్రాసె అలవాటు లేని నేను, ఏం చెప్పాలో కాసేపు తోచక, రెండూ కావాలనివున్నా, ఆ ఆన్సరు ఇవ్వడం అవివేకం అని నిర్ణయించుకొని ప్రస్థుతానికి ఆస్థి అప్టుచేసి డాలీని కోల్డ్ స్టోరేజిలో పెట్టాను.

అదే; నా పెంపుడు తండ్రి కనకయ్య చేసిన పొరపాటు వెల్! కొందరికి పొరపాట్లు సరిదిద్దుకొనే అవకాశాలు వస్తాయి. కాని కనకయ్యకా అవకాశం ఇవ్వదలచుకోలేను. అందుకే ఆరోజునుండీ సరైన పథకానికి రూపకల్పన ప్రారంభించాను.

సాయంత్రం ఏడున్నరవరకూ విస్కీ అండ్ సోడా త్రాగుతూ కూర్చున్నాను అలంకార్ బార్‌లో. అఫ్‌కోర్స్.... డాలీకూడా నాకు కంపెనీ ఇచ్చిందనుకోండి. ఏడున్నరకు డిన్నరు ఆర్డరిచ్చాను. నా పథకం సజావుగా సాగితే మళ్ళీ పూర్తి భోజనం చెయ్యడానికి వెంటనే వీలుకాకపోవచ్చు.

"అదేమిటి డియర్ అప్పుడే డిన్నర్ అందుకున్నావు?" అంది డాలీ ఆశ్చర్యంగా.

నా పథకంలో డాలీకి పాత్రలేదు. అంచేత ఆమెతో చెప్పలేదు. "సారీ డియర్! ఈరోజు ఎనిమిదింటికి వెళ్ళి

వాలిపో. మా నాన్న మనోరమాలో ఏదో పార్టీ అరేంజ్ చేశాడు" అన్నాను.

"ఓహ్ . అయితే నా డాన్స్ చూడవన్నమాట. కనీసం అక్కడ పార్టీ అయిన తరువాతన్నా రాకూడదా?" అంది డాలీ రోషంగా.

సహజంగా ప్రవర్తించడం అన్నివిధాలా శ్రేయస్కరం "వెల్... అలాగేలే!" అన్నాను నవ్వుతూ.

డాలీ పెదవులు కృతజ్ఞతగా నా చెవిని తాకాయి.

నా డిన్నర్ పూర్తవగానే డాలీ మేకప్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

ఎనిమిదవగానే డిస్కోబాండ్ వాళ్ళు మ్యూజిక్ మొదలు పెట్టారు. నేను మరో సిగరెట్ కాల్చి, బిల్లు చెల్లించి లేచి నిలబడ్డాను.

నా పథకం ప్రకారం 'హోండా' బార్‌లో వదిలివేయక తప్పదు. ఎనిమిదింటికి 'మనోరమాకు' వెళ్తానని చెప్పినట్లు డాలి సాక్ష్యం, సుమారుగా అదే సమయానికి బిల్లు చెల్లించినట్లుగా బేరర్ సాక్ష్యం వుంటాయి. ఆ తర్వాత నేను ఎటు వెళ్ళింది, ఎలా వెళ్ళిందీ ఎవరూ చెప్పలేరు.

చకచక నడవటం ప్రారంభించాను.

అలంకార్ బార్ నుండి టవున్లోకి సుమారు రెండు మైళ్ళ దూరం వుంటుంది. నేను నిర్ణయించుకున్న ప్రదేశం సుమారు నాలుగు మైళ్ళుంటుంది. నడవక తప్పదు. రిక్షా డ్రైవర్లు, ఆటోవాళ్ళు ఒంటరిగా ఎక్కే నాలాంటి వాళ్ళను అనుకోకుండా గుర్తుంచుకుంటారు.

టైమ్ చూసుకొన్నాను. ఎనిమిదిన్నర కావస్తోంది. వెల్! తొందరేంలేదు. మనోరమాలో డిన్నర్ ఇప్పుడిప్పుడే

ప్రారంభమవుతూ వుంటుంది. ముసలాడు ఇంటికొచ్చేప్ప టికి ఎలా లేదన్నా పదకొండు దాటుతుంది.

2

టీపాయ్‌ని, కుర్చీని కిటికీ దగ్గరకు జరిపాను.

మెక్‌డొవెల్ ప్రీమియం విస్కీ, గ్లాసులు, సోడాలు అన్నీ టేబిల్‌మీదకు చేర్చాను.

లైటు ఆర్పి కిటికీ కర్టెన్ ప్రక్కకు తొలగించి, తలుపులు తెరిచాను.

ఎదురుగా రోడ్డుకవతల మా ఇల్లు స్పష్టంగా కనబడు తోంది. పోర్‌లేన్ ట్రంక్‌రోడ్డు అవతల చక్కటి కాంపౌండ్ వాల్ మధ్యవున్న ముచ్చటైన రెండంతస్తుల భవనం. పోర్టికో, పైవరండా, కార్ గేరేజి స్పష్టంగా కనబడుతున్నాయి. ఈ సౌకర్యం కోసమే నేనీ అపార్ట్ మెంట్‌ను తీసుకొన్నది.

మా ఇంటికి తిన్నగా రోడ్డుకు అవతలవైపు రెండేళ్ళ క్రితం కట్టారు ఈ అపార్ట్‌మెంట్స్. అద్దె ఎక్కువవడం వల్ల తరచూ ఖాళీగా వుండేవి చాలా అపార్ట్‌మెంట్స్. ఇక ఇళ్ళ బ్రోకరు ద్వారా నెల క్రితం మారుపేరుతో అద్దెకు తీసుకొన్నాను. దాదాపు ముప్పై అపార్ట్‌మెంట్స్ ఉన్న భవంతి కావడంవలన, క్రిందవున్న షాపింగ్ కాంప్లెక్స్ వల్ల వచ్చిపోయే వాళ్ళను గమనించేవాళ్ళే వుండరు.

మెక్‌డోవల్ చప్పరిస్తూ, సిగరెట్ కాల్చుకొంటూ ఇంటి వైపే చూస్తూ కూర్చున్నాను.

పదకొండు, అయిదు నిమిషాలకు ముసలాడి కారు పోర్టికోలో ఆగింది. పనివాడు సీతయ్యను ఏదో అడిగి, కారును గేరేజీలోకి పోనిచ్చాడు. రెండు నిముషాల తర్వాత ఇంట్లోకి వెళ్ళాడు. సీతయ్య గారేజి తలుపులు మూసి,

ప్రహారీగోడకు వున్న ఇనుపగేటు మూసి తాళంపెట్టి ఇంట్లోకి వెళ్ళి పోర్టికోలో లైటు ఆర్పేశాడు.

మంచి రద్దీగా వుండే సెంటర్లోని అంతపెద్ద యింటికి కాపలాదారు అనవసరమని నాన్న ఉద్దేశ్యం. వెల్! ఆయన పిసినారితనమే ఇంతవరకూ వచ్చింది వ్యవహారాన్ని....

లేచి టెలిఫోన్ దగ్గరకి నడిచాను.

మౌత్‌పీస్ తీసి ప్రత్యేకంగా తయారుచేసిన స్క్రీన్ జల్లెడమీద వుంచాను. చాలా సింపుల్ ప్రిన్సిపుల్ వుంది. ఆ స్క్రీన్ తయారీలో ... చిన్న లోహపు రింగుల చట్రంలో బిగించిన సన్నటి పొరలాంటి జంతుచర్మం అది. చర్మానికి నేర్పుగా ఏర్పాటుచేసిన సన్నని చిల్లులుంటాయి. ఈ స్క్రీన్ అడ్డుంచుకొని మాట్లాడంవలన, గొంతు గమ్మత్తుగా మారిపోయి అవతల వినేవాళ్ళు గుర్తుపట్టలేరు. కొన్ని వస్తువులు పలకడం తేడా చూపిస్తే వాయిస్ ఎనలైజర్ కూడా మన అసలు కంఠంతో గురి పోల్చలేదు.

మా యింటి నంబరు డయల్ చేశాను. టెలిఫోన్ రింగవుతున్న ధ్వని వినబడింది.

ఆరోసారి మ్రోగుతున్నప్పుడు సీతయ్య టెలిఫోన్ తీశాడు. "అల్లో....ఎవరు మాట్లాడుతాంది?"—అంటున్నాడు.

"కనకయ్యగారు కావాలి!" అన్నాను.

"అయ్యగారు నిద్రపోతున్నారు. తమరెవరో చెపితే లేపుతాను...."

చిన్నగా నవ్వాను. "మీ అయ్యగార్కి రాత్రి ఒంటిగంటకు ముందు నిద్రపోయే అలవాటు లేదని తెలుసు లేవోయ్. నువ్వెళ్ళి లేపక్కరలేదు. ఎక్స్‌టెన్షన్ స్విచ్ నొక్కి ఆయనకి కనెక్షన్ ఇయ్యి".

సీతయ్య దంగైపోయి వుండాలి. "అయ్...." అని మాత్రం అని మేడపైన ఎక్స్‌టెన్షన్ కనెక్ట్ చేశాడు.

"ఎవరు?" ముసలాడి గొంతు.

వికృతంగా నవ్వాను. ఇష్టం లేకపోయినా" కనకయ్యా! నేను చెప్పబోయే విషయం జాగ్రత్తగా విను. నీ కొడుకు మహేశ్వర్‌ని కిడ్నాప్ చేశాం."

"వ్హాట్??"—కనకయ్య గొంతులో కంగారు....నా క్షేమం గురించి కాదు. తర్వాత అడగబోయే రేన్‌సమ్ గురించి అయ్యుంటుంది.

"వాడు ప్రాణాల్తో మళ్ళీ నీ కంట బడాలంటే రెండు లక్షలు కావాలి."

ఒక్క నిముషం ఫోన్లో నిశ్శబ్దం డబ్బు మాట వినగానే ముసలాడి గుండాగిపోయిందేమోనని అనుమానం వచ్చింది.

"విన్నావా?"....రెట్టించాను.

"ఊఁ" అన్నాడు కనకయ్య.

"ఈ విషయం గురించి పోలీసులకు రిపోర్ట్ చెయ్యడం గాని, ప్రయివేట్ డిటెక్టివ్‌ల సహాయం తీసుకోవడంగాని చేశావా....నీ కొడుకు శవం కూడా దొరకదు. జాగ్రత్త" ముందుగా మనసులో ఆలోచించి పెట్టుకున్న డైలాగ్స్ జాగ్రత్తగా చెప్పాను.

"ప్లీజ్ నన్ను ఆలోచించుకోనివ్వండి. మహేష్ అదే మా అబ్బాయి ఎక్కడున్నాడు?" ముసలాడి కంఠంలో వణుకు నాకెంతో తృప్తినిస్తోంది.

ముసలిపీనుగ....నా ప్రాణాలకు ముష్టి రెండు లక్షలు బేరంపెడితే వెంటనే ఒప్పుకోక ఇంకా ఆలోచించుకోనివ్వమంటున్నాడు. డర్టీమైజర్. వాడి దృష్టిలో నా విలువ

రెండు లక్షలు చేస్తుందో లేదో యింకా ఆలోచించుకోవా లన్నమాట.

"మీ అబ్బాయి ఎక్కడున్నాడో చెప్పేస్తే డబ్బెలా వస్తుంది. డోన్టబీ పూలిష్. నీ కుర్రకుంక మా చేతుల్లో వున్నాడనటానికి నిదర్శనంగా నీ ఇంటిముందు పోర్టికోలో వున్న క్రోటన్ కుండీలలో స్థంభం ప్రక్కన వున్న దాని క్రింద ఓ కవరుంది చూసుకో. మీ వాడి చేతివుంగరం అందులో వుంటుంది" ఫోన్ పెట్టేశాను.

మొదటిసారి గనుక ఎక్కువసేపు మాట్లాడినా ప్రమాదం లేదుగాని .... అతిగా మాట్లాడితే ఎఫెక్ట్ అయిపోయే ప్రమాదం వుంది. ముసలాడు రెండు లక్షలు ఇవ్వడానికి ఒప్పుకుంటాడని నాకు నమ్మకంలేదు.

సిగరెట్ వెలిగించి కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను.

బయట వరండాలోనూ, పోర్టికోలోనూ లైట్లు వెలిగాయి. లుంగీ బనియన్‌తో ముసలాడు బయటికొచ్చాడు. వెనకే సీతయ్య కూడా కుక్కపిల్ల తోకాడించినట్లు చేతులు నలుపుకొంటూ వస్తున్నాడు. సీతయ్య క్రోటన్‌కుండీ పైకెత్తితే దానిక్రిందే నేను ఈ రోజు ఉదయం దాచిన కవరు బయటికి తీశాడు ముసలాడు.

కవరులోంచి ఉంగరం బయటికి తీసి అటూ ఇటూ త్రిప్పి చూసుకొంటున్నాడు. బైనాక్యులర్స్ వుంటే బావుండేది. ముసలాడి ముఖం కాస్త స్పష్టంగా కనిపించేది.

ముసలాడు సీతయ్యనేదో అడుగుతున్నాడు. సీతయ్యేదో చెపుతున్నాడు ఇద్దరూ కలిసి ఇంట్లోకి వెళ్ళారు. ఆ తర్వాత రాత్రంతా పోర్టికోలో వెలుగుతోన్న లైట్లనుబట్టి ముసలాడు గాని, సీతయ్యగాని నిద్రపోలేదని గ్రహించాను.

ఉదయం ఆరుగంటలకు మ్రోగేటట్లుగా అలారం సెట్ చేసి నిద్రపోయాను.

3

అలారం మోగగానే లేచి బాత్‌రూమ్‌లో ముఖం కడుక్కొని షేవ్ చేసుకొన్నాను. ఇది పూర్తయేప్పటికి పర్కొలేటర్ మీద కాఫీ డికాక్షన్ తయారయింది. పంచదార లేకుండా వేడివేడి కషాయం ముడికాఫీ డికాక్షన్ తాగేప్పటికి హెంగోవర్ పోయి మైండ్ క్లియరయింది. ఆరున్నరయింది.

టెలిఫోన్ తీసి డయల్ చేశాను. మొదటి రింగ్‌కే రిసీవర్ లిఫ్ట్ చేశారు.

"హలో" ముసలాడి కంఠం. ఎందుకో బరువుగానూ, నీరసంగానూ వుందనిపించింది.

"మహేశ్వర్ స్నేహితులం. రెండు లక్షలు సిద్ధం చేశావా?" అడిగాను.

"చూడు మిష్టర్....ఇంత వుదయమే అంత డబ్బు ఎలా వస్తుందనుకొంటున్నావు. అయినా మా అబ్బాయి ఉంగరం చూపించి డబ్బు గుంజాలనుకొంటే నేనేం పిచ్చాడిననుకొన్నావా. చెప్పాపెట్టకుండా వారం పదిరోజులు ఏ రేసులకో చెక్కేయడం, ఆ తర్వాత రావడం మా వాడికి అలవాటే. అలాంటి సమయమేదో గమనించి వాడెప్పుడన్నా డబ్బు అవసరమై తాకట్టు పెట్టిన ఉంగరం చూపించి మీరు నన్ను ఫూల్నిచేయడం లేదన్న నమ్మకమేమిటి?"— కోపంవల్లో, భయంవల్లో డబ్బు వదులుకోవాలన్న బాధవల్లో ముసలాడి కంఠంలో వణుకు స్పష్టంగా తెలుస్తోంది.

పూర్ ఫెలో! డబ్బుతో ప్రాణానికి లంకె వున్నంత లంకా మనిషి బ్రతుకింతే! అయినా; ముసలాడ్ని నేను

తప్పు అంచనా వేయలేదు. ఇంత సంక్షోభంలోనూ వాడి బుర్ర చురుగ్గానే పనిచేస్తోంది. చాలా దూరం ఆలోచిస్తోంది. ఇంకా నయం.... నేనే డబ్బుకోసం ఈ నాటకం ఆడుతున్నా నన్నాడు గాదూ.

"చూడు మిష్టర్ కనకయ్యా! కథలు చెప్పే అలవాటు మాకులేదు. కావలిస్తే మీ దౌర్భాగ్యుడితో ఓ క్షణం ఫోన్లో మాట్లాడిస్తాను విను...." అని స్క్రీన్ తీసేసి ఓ సారి గట్టిగా ఊపిరి పీల్చి, "నాన్నా!...." అన్నాను బరువుగా.

"పండుబాబూ.... నువ్వేనా?"—ముసలాడి కంఠంలో ఆతృత.... నేను కాకపోతే బావుణ్ణు అనే కోరిక కూడా వుందేమో.... వెల్! పండుబాబు అనే ముద్దు పేరొకటుంది లెండి నాకు.

"నేనే నాన్నా... రాత్రి డిన్నర్‌కని మనోరమ...." చటుక్కున చిన్నగా మూల్గి, మళ్ళీ స్క్రీన్ అరేంజ్ చేశాను మౌత్ పీస్‌లో.

"బాబూ.... బాబూ...." పిలుస్తున్నాడు ముసలాడు.

"వెల్....మిష్టర్ కనకయ్యా....సాయంత్రానికి రెండు లక్షలు సిద్ధం చెయ్యి. అన్నీ కాస్త మాసిన పాతనోట్లు, ఇరవై రూపాయల డినామినేషన్ మించకుండా వుండాలి. ఎలా అందజెయ్యాలో సాయంత్రం ఆరింటికి ఫోన్ చేసి చెబుతాను...." డిస్‌కనెక్ట్ చేశాను.

కిటికీ కర్టెన్లు ఒక్క అంగుళం మాత్రం తెరిచి, బ్రెడ్ జామ్ తింటూ ఆ సందులోంచి మా యింటినే గమనించ సాగాను.

ఎనిమిది గంటలకు కంపెనీ అడ్వకేటు శివసుందరం కారు వచ్చి ఆగింది పోర్టికోలో. డోర్ తెరుచుకొని దిగి హడావిడిగా లోపలకెళ్ళాడు శివసుందరం.

వెరీవెల్! ముసలాడు బుద్ధి పోనిచ్చుకొన్నాడు గాదు. చచ్చింతరువాత శ్రాద్ధం పెట్టవలసినవాణ్ణి. నన్ను కిడ్నాప్ చేసి చంపుతామని బెదిరిస్తున్నా ఇంకా దబ్బివ్వకుండా ఎగ్గొట్టే ఉపాయం ఏదైనా వుందేమోనని మంతనాలకు పిలిచాడు లాయర్ని.

ఓపిగ్గా చూస్తూ కూర్చున్నాను. తొమ్మిది గంటలకు శివసుందరం బయటికి వచ్చాడు ముసలాడితో కలిపి. ఇద్దరూ కలిసి కారెక్కి ఎక్కడికో బయలుదేరారు.

ముసలాడిమీద ద్వేషం రెట్టింపయింది. కాని; ఒకందుకు నా మనసు ఆనందంగా వుంది. ఇలాంటి సిచుయేషన్‌లో ముసలాడేం చేస్తాడో ఖచ్చితంగా ఊహించగలిగినందుకు.

పోలీసులకీ విషయం తెలిసినా, తెలుపకపోయినా నాకొచ్చే లాభనష్టాలేమీ లేవు. నిజానికి పోలీసులు రంగంలో దిగివుండడం నా పథకానికి మరింత బలం ఇస్తుంది.

సాయంత్రం వరకూ వేచివుండటం కంటే చేయగలిగింది లేదు.

సాయంత్రం నాలుగు నుండి మా ఇంటిని జాగ్రత్తగా గమనించసాగాను.

అయిదున్నరకు శివసుందరం, మరో వ్యక్తి కారులో వచ్చారు.

శివసుందరంతోపాటు వచ్చిన వ్యక్తి పోలీసుల మనిషి అని స్పష్టంగా తెలుస్తోంది. కారు దిగగానే యింటి పరిసరాల్ని కాజువల్‌గా అతను గమనించటం నేను గమనించాను.

సరిగ్గా ఆరుగంటలకు మా యింటి నంబరు డయల్

చేశాను. రెండవ రింగ్‌కు రిసీవర్ ఎత్తారు.

"హల్లో...." వణుకలాడే మాట్లాడుతున్నాడు.

"నీ ఇంట్లో కారు షెడ్లో ఎలక్ట్రిక్ మీటరు వున్న స్విచ్ బోర్డు తెరువు. లోపల ఓ సీలుచేసిన కవరుంటుంది. డబ్బు యెలా అందజేయాలో వివరాలు అందులో వున్నాయ్" ఫోన్ డిస్‌కనెక్ట్ చేశాను.

కాల్ ట్రేస్ చెయ్యడానికి పోలీసులు సిద్ధంగా వుంటారని తెలుసు. అంచేత అరనిమిషం కూడా మించకుండా వ్యవధి ఇవ్వలేదు.

నిన్న మధ్యాహ్నమే డబ్బు యెలా అందజేయులో టైప్ చేసిన కాగితం కవర్లో వుంచి సీల్‌చేపి కారుగేరేజిలో వున్న మీటర్ బాక్స్‌లో దాచాను. దాన్లో చెప్పిన ప్రకారం ఈ రోజు రాత్రి పదకొండున్నరకు బయల్దేరే లింక్ ఎక్స్‌ప్రెస్ మూడవ టూటైర్ బోగీలో డబ్బు నింపిన ఆకుపచ్చరంగు వి.ఐ పి. సూట్‌కేసును లగేజ్ రాక్‌లో పెట్టి రావాలి సీతయ్య.

నేను ఫోన్‌చేసిన పది నిమిషాలకు శివసుందరంతోపాటు వచ్చిన పోలీసు వ్యక్తి హడావిడిగా బయటకు వచ్చి కారెక్కి వెళ్ళిపోయాడు. బహుశా రాత్రికి స్టేషన్‌లోనూ, ట్రైన్‌లోనూ కాపలా ఏర్పాట్లు చేయడానికయుంటుంది.

చిన్నగా నవ్వుకొని సిగరెట్ వెలిగించి మరో నంబరు తిప్పాను....అవతల ఫోన్ ఎత్తిన చప్పుడు వినిపించింది.

"అబ్దుల్ సత్తార్ కావాలి" అన్నాను క్లుప్తంగా.

"ఎవరు నువ్వు?" అది సత్తార్ గొంతే సందేహం లేదు. అయితే నా మౌత్‌పీస్‌కు బిగించిన స్క్రీన్‌వల్ల అతను నా గొంతు గుర్తుపట్టలేకపోయాడు.

"దోస్త్‌వర్రీ సత్తార్‌భాయ్! ఒకపని చేసిపెట్టాలి."

"ఊరు పేరు లేనివాళ్ళతో మేం డీల్ చెయ్యం" అన్నాడు సత్తార్ మేటరాఫ్‌ఫేక్ట్‌గా.

చిన్నగా నవ్వాను. "ఈ రోజు రాత్రి లింక్ ఎక్స్‌ప్రెస్ మూడవ టూటైర్ బోగీలో ఆకుపచ్చ వి. ఐ. పి. సూట్ కేస్‌ను లగేజ్ రాక్‌లో పెడతాడో వ్యక్తి. మద్రాసు వెళ్ళే లోపున స్వాధీనం చేసుకోవాలి. ఫిఫ్టీ ఫిఫ్టీ వాటా మనిద్దరికి ఎల్లుండి ఫోన్ చేస్తాను" అన్నాడు ఫోన్ పెట్టేస్తూ.

సత్తార్ రైలు దొంగతనాల గాంగ్‌కి నాయకుడు. మద్రాస్, విజయవాడ లైను అతని స్వంతమని పోలీసులకు కూడా తెలుసు. ఇదివరలో అవసరం వచ్చి రెండుమూడు సార్లు సత్తార్ దగ్గర వడ్డీకు అప్పు కూడా తీసుకున్నాను. అంచేత సత్తార్ వ్యవహారాలు సూచాయగా నాకు తెలుసు.

ఏది ఏమైనా ఈ రోజు రాత్రికి సత్తార్ గేంగ్ ఆ సూట్ కేస్‌ను వేటకుక్కల్లా వెంటాడుతారు. అదే నాక్కావల సింది. తిరిగి నేను సత్తార్‌ను కలుసుకొనే సమస్యలేదు. మొత్తం ఆస్తి నా స్వాధీనం కాబోతుండగా ముష్టి రెండు లక్షలకు కక్కుర్తిపడి ప్రయోజనంలేదు.

నా పథకాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడానికి సత్తార్‌నో పావును చేశాను. అంతే!.... నే నెవరో తెలియక పోయినా క్యూరియాసిటీకయినా సత్తార్ రాత్రికి తన మను షుల్ని పంపుతాడు.

4

రాత్రి పదకొండు గంటలయింది.

ముసలాడు, సీతయ్య, శివసుందరం కారులో బయలు దేరి వెళ్ళారు. వాళ్ళ కారు రోడ్డుమీదకు రాగానే, అప్పటి వరకూ కాస్త ఎగువన పార్క్ చెయ్యబడ్డ నల్ల అంబాసి

డర్ స్టార్టయి షాలో అపసాగింది. పోలీసులు మంచి జాగ్రత్తలోనే వున్నారు.

అపార్ట్‌మెంట్ తలుపు కొద్దిగా తెరచి వరండాలోకి తొంగి చూసాను. నాలుగు అపార్ట్‌మెంట్లకు కలిపి ఒకే కామన్ నడవా వుంటుంది. నడవ చివర మెట్లు. నడవ నిర్మానుష్యంగా వుంది.

చటుక్కున బయటికి వచ్చి తలుపువేసి చకచక మెట్లు దిగాను. మూడవ అంతస్థు నుండి క్రింద ఫ్లోర్‌కు వచ్చే లోపల ఎవరూ ఎదురుపడలేదు.

మెట్లబాట పోర్టికోలో ఎలక్ట్రిక్ బల్బు వెలుగుతోంది. పోర్టికోకి కాస్త ఎడంప్రక్క వున్న ఆల్‌నైట్ రెస్టారెంట్‌లో జనం హడావిడి ఇంకా తగ్గలేదు. చేతిలో లాఠీ వూపుకొంటూ చకచక రోడ్డుమీదకు నడిచాను. హోమ్‌గార్డ్ డ్రస్‌లో వున్న నన్ను పట్టించుకొనే వాళ్ళు ఎవరూ వుండరు.

అపార్ట్‌మెంట్స్‌కు ఎదురుగా రోడ్డుకవతల పోర్టికోలో లైటు వెలుగుతున్నా లోపల ఎవరూ లేరని తెలుసు. అయినా ఇంటివైపు కూడా చూడకుండా మెయిన్ రోడ్డు వెంట ఓ ఫర్లాంగు నడిచాను. అక్కడ రోడ్ క్రాస్‌చేసి మెయిన్‌రోడ్‌ను కలిసే సైడ్‌స్ట్రీట్‌లోకి వెళ్ళాను.

ఓ నాలుగిళ్ళ అవతల మెయిన్‌రోడ్‌కు పారలెల్‌గా మరో చిన్న సందు వుంది. ఆ సందు సరిగ్గా మా ఇంటి వెనుకవైపు నుండి వెళుతుంది. మరో పది నిమిషాల్లో ఇంటి వెనకవైపుకు చేరుకొన్నాను.

సన్నని ఇరుకు సందు అది. పగటిపూట లాండ్రీ షాపులు, బార్బరు షాపులు, చిన్న చిన్న గోడవున్లు పని చేస్తున్నప్పుడు వచ్చేపోయే జనంతో నిండివుంటుంది. రాత్రిళ్ళు వీధిదీపాలు కూడా సరిగ్గా వెలగవు.

వెనక గోడవైపు ఓ మూల వేపచెట్టు కొమ్మ క్రిందకు వాలివుంటుంది. అక్కడ నిలబడి చుట్టూ గమనించాను. సంపు చీకటిగా వుంది. దూరంగా వెలుగుతోన్న వీధి దీపం కాంతిలో నిర్మానుష్యంగా వుంది.

చకచక గోడదూకి ఇంట్లోకి ప్రవేశించాను. క్రింద బయటి తలుపులు తాళంవేసి వుంటాయని తెలుసు. వెనక వైపు నుండి కూడా బయటనుండి మేడమీదకు వెళ్ళడానికి మెట్లు వున్నాయి. మెట్ల పయిన మేడమీదకు వెళ్ళడానికి వీల్లేకుండా ఓ ఇనుపచువ్వల గేటు వుంటుంది. ఎప్పుడూ గేటుకు లోపలివైపు తాళం వేసివుంటుంది. ఆ తాళం వారం క్రితమే సంపాదించి డూప్లికేట్ తయారుచేయించి నా దగ్గర వుంచుకొన్నాను.

లోపలికి ప్రవేశించడం కష్టం కాలేదు. లోపలి కెళ్ళిం తరువాత గేటు మూసివేశాను. లైట్లన్నీ ఆర్పేయడంవల్ల మేడమీద చీకటిగా వుంది. బెడ్ రూమ్స్‌కు తాళాలు వుండవు గెడలు తప్ప ...ముసలాడి గదిలో యెవరూ ప్రవేశించరు ముసలాడు తప్ప. గది ఊడ్చడానికి, బెడ్ రూమ్ శుభ్రం చెయ్యడానికి రోజుకో మారు సీతయ్య మాత్రం వెళతూ వుంటాడు.

ముసలాడి బెడ్ రూమ్‌లో ప్రవేశించి ఓసారి చుట్టూ చూశాను లైటువేసి, టైము పన్నెండు కావస్తోంది. వాళ్ళు వెనక్కి తిరిగొచ్చే సమయం అయింది.

సిగరెట్టు కాల్చాలనిపించింది. కాల్చలేదు. ఇరుకు గదుల్లో సిగరెట్టు వాసన ఘాటుగా తెలుస్తుంది బయట నుండి లోపలకు వచ్చేవాళ్ళకు.

ఓపిగ్గా కాచుకొని కూర్చున్నాను.

౬

రాత్రి ఒంటి గంట ప్రాంతంలో పోర్టికోలో కారు ఆగింది.

మేడమీద బాల్కనీ స్తంభం వెనుక నక్కి గమనిస్తో న్నాను. కార్లోంచి ముగ్గురు దిగారు. శివసుందరం కారు దగ్గరే ఆగిపోయాడు.

"ఇక నేను వుంటాను సార్. ఉదయానిక్కాని మనకు పాజిటివ్‌గా ఏమీ తెలియదు. పోలీసులు చాలా పటిష్టమైన వల పన్నారు. ఆ సూట్‌కేస్ తీసుకొన్నవాడిని పట్టుకో కుండా వాణ్ణి వెంబడించి ముఠాను మొత్తం పట్టుకొనే ప్లాన్‌లో వున్నారు. మీరు వర్రీ కావద్దు. ఎస్.పి. పర్సె నల్ యింట్రెస్ట్ వుందనేప్పటికి డిపార్ట్‌మెంట్‌వాళ్ళు జాగ్రత్తగా వుంటారు...." అంటున్నాడు శివ సుందరం.

"అదికాదు సుందరం. మనం పొరపాటు చేశామా అని యిప్పుడు అనుమానం వస్తోంది. ఇప్పుడు డబ్బూ— కుర్రాడు.... రెండూ...." ముసలాడి గొంతు మధ్యలో ఆగి పోయింది.

'హారి ముసలిపీనుగా!' అనుకొన్నాను మనసులో. నేను లేకపోతే పోయాను. అదనంగా రెండు లక్షల రూపాయలు పోయాయి అని విచారిస్తున్నట్లున్నాడు.

"ఫర్లేదు బాబూ....పొద్దునకల్లా పండుబాబు తిరి గొచ్చేస్తాడు చూడండి" అంటున్నాడు సీతయ్య. ఇన్నాళ్ళు ముసలాడి సేవలో గడిపి ముసలాణ్ణి దేవుడుగా చూసు కొనేది ఈ మూర్ఖుడొక్కడే.

"ఓ.కె! సుందరం. గుడ్‌నైట్! ఉదయమే రా;" అంటున్నాడు నాన్న....అదే ముసలాడు.

"గుడ్‌నైట్ సార్! మనం చేయగలిగింది చేశాం....ఈ రాత్రికి కాస్త రెస్టు తీసుకోండి ..." అన్నాడు శివసుందరం కారెక్కుతూ.

శివసుందరం కారు స్టార్ట్ చెయ్యగానే నేను చకచక ముసలాడి గదిలో ప్రవేశించి తలుపు ప్రక్కనే నిలబడ్డాను. సౌండ్‌ప్రూఫ్ చెయ్యబడ్డ ఎయిర్‌కండిషన్డ్ గదది. అంచేత ముసలాడు గది తలుపులు త్రోసేంతవరకూ వస్తున్నట్లు తెలియదు. రిస్కే అయినా చేయదలుచుకున్న పనికి ఆ మాత్రం రిస్కు తీసుకోవాలి.

అయిదు....పది....పదిహేను నిముషాలు గడిచాయి. నాలో అసహనం పెరిగిపోతోంది....అరచేతుల్లో చిరుచెమటలు పడుతున్నాయి. గబగబా వూపిరి పీల్చుతున్నానేమోననిపించి, డెలిబరేట్‌గా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కంట్రోల్ చెయ్యసాగాను.

అరగంట తరువాత తలుపు హేండిల్ చప్పుడయింది. లోపల లైటు వెలిగించి, తలుపు తోసుకొని లోపలకు వచ్చాడు ముసలాడు. గదిలోకి రెండడుగులు వేసింతరువాత గాని గదిలో మరెవరో వున్నట్లు తోచలేదు. అప్పటికే నేను ప్రక్కకు జరిగి తలుపు మూసి బోల్టు పెట్టాను....

ఒక్కక్షణం తెల్లబోయినట్లు చూశాడు ముసలాడు....నా పెంపుడు తండ్రి. "పండూ .... నువ్వా!" అన్నాడు ఆశ్చర్యంగా.

నేను బ్రతికి వుంటాననే ఆశ ఏనాడో పోయినవాడికి మళ్లీ చూస్తున్నాడు.

చిన్నగా నవ్వాను. "కిడ్నాపర్స్ నన్ను చంపకుండా వదిలేశారని ఆశ్చర్యంగా వుందా....?" అన్నాను వ్యంగ్యంగా.

"అదేంట్రా.... నిన్ను వదిలేశారు. అంతే చాలు. ఈ రెండ్రోజులు ఎంత వర్రీ అయ్యానో తెలుసా?" ఎంకోడు ముసలాడి గొంతు కొద్దిగా వణికింది. నేనెలాగూ బ్రతికే వున్నానని ప్లేటు మారుస్తున్నట్టున్నాడు.

"బుల్ షిట్!"— అన్నాను జేబులోంచి పిస్తోలు తీస్తూ.

ముసలాడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"నన్నెవరూ కిడ్నాప్ చెయ్యలేదు. అలా నేనే నాటకం ఆడాను."—

"వాట్?.... మనసులో నాకు ఏ మూలో అనుమానం గానే వుంది. డబ్బుకోసం ఇది నువ్వాడుతున్న నాటకం కాదుగదా అని. అప్రాచ్యపు వెధవా.... మళ్ళీ పిస్తోలేమిటి రెండులక్షలు చాలవా?"—అసలు విషయం చెప్పేప్పటికి ముసలాడి అసలు రంగు బయటపడుతోంది.

"కదలక.... ముష్టి రెండులక్షలు కాదు. నీ మొత్తం ఆస్తి కావాలి. ఇన్నాళ్ళూ... క్రమశిక్షణ పేరున, సంపాదన పేరున, పరువుప్రతిష్టల పేరున నీవు నన్ను పెట్టిన హింసకు ప్రతిఫలం కావాలి ..." అరిచాను రోషంగా.

ముసలాడికళ్ళల్లో మొదటిసారిగా భయాన్నిచూచాను ... ఆ భయం ఇంకాసేపు చూడాలనుంది. కాని ఎక్కువసేపు యీ సీన్ పొడిగించడం ప్రమాదకరం .... ట్రిగ్గర్ నొక్కాను.

ఆ చిన్న బెడ్‌రూమ్‌లో చెవులు గింగుర్లుమనేలా ప్రేలింది పిస్తోలు. సౌండ్‌ప్రూఫ్ గది గనుక శబ్దం బయటికి ఒక్కటే వినబడే అవకాశం లేదు.

ముసలాడి ఛాతిమీద చిన్న రంధ్రం పడింది. ఎవరో

పట్టి తోపినట్లు రెండడుగులు వెనక్కేశాడు. ఆ ముఖంలో ఒకింత కోపం, బాధ, ఆశ్చర్యం అన్నీ కలిపి కనపడు తున్నాయి. అప్రయత్నంగా వాడి చేయి ఛాతీమీదకెళ్ళింది. చేతి వ్రేళ్ళ మధ్య నుండి రక్తం నీటి బుడగలా పైకుబికింది.

మరో షాట్‌కోసం పిస్తోలు ముందుకు చాపాను.

"నో...."—అన్నాడు అప్రయత్నంగా క్రిందికి ఒరుగుతూ.

మూలుగుతున్నాడు. దెబ్బ సరియైన ప్రదేశంలో తగిలినట్లు లేదు. వీడు బ్రతికేవుంటే కొంప మునుగుతుంది. క్రిందపడిన ముసలాడు రొప్పుతున్నాడు. పైకి లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. మరోసారి ట్రిగ్గర్ నొక్కాను. వీపు కుడిభాగంలో దిగింది గుండు. లేవబోతున్నవాడు ఆ బుల్లెట్ తాకిడికి ఎగిరి వెల్లికిలా పడ్డాడు.

ఆ కళ్ళు....అరవైఅయిదేళ్ళ ఆ ముసలి కళ్ళు.... ప్రపంచంలోని ద్వేషాన్నంతా నింపుకొని నన్నే చూస్తున్నాయి. బహుశా ఊపిరితిత్తులు పంక్చరయుండాలి. నోటికి ఓ మూలనుండి సన్న ధారగా రక్తం కారుతోంది. బాధతో పళ్ళు బిగబట్టాడు. పళ్ళనిండా ఎర్రటి రక్తం. భయంకరంగా, డ్రాకులా వున్నాడు.

ఇంకా చావడేం?....మరో షాట్ యిస్తేగాని లాభం లేనట్లుంది.

రక్తంలో తడిచిన వాడి కుడిచెయ్యి కదుల్తోంది కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి రెప్పల క్రింద. కుడిచేతివేళ్ళు నేలను గీరుతున్నాయి. కాదు....కాదు ఓమిటో గీస్తున్నాడు....నేలమీద రక్తంలో తడిచిన వ్రేళ్ళతో. మృత్యు

పును బలవంతంగా ఆపుతూ ... ప్రాణాలు నిలుపుకోవాలని శక్తినంతా కేంద్రీకరించి.

కళ్ళు చిట్లించి చూశాను. అప్పటికే మూడు అంకెలు వేశాడు. రెండు, నాలుగు, అయిదు, చివరి అంకె.... పూర్తి చేస్తుండగా ఆ శరీరంలో చలనం ఆగిపోయింది. వ్రేళ్ళు వంకరతిరిగి ఆరు కాస్త చెరిగింది.

ఒక్కక్షణం వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. మై గాడ్ .... ముసలాడు చచ్చాడు. నేలమీద రక్తంతో తడిచిన బట్టలతో వికృతమైన ఆకృతిలో పడివున్న శరీరం.... బాధతో తెరుచుకొన్న పెదవుల మధ్యనుండి వికృతంగా రక్తంలో తడిచిన పళ్ళు తెల్లని కనుగుడ్లు.

మళ్ళీ ముసలాడు వ్రాసిన అంకెలవైపు చూశాను. రెండు, నాలుగు, అయిదు, ఆరు ....ఏమిటది.... రెండువేల నాలుగువందల యాభై ఆరు ....ఎనిమిది? టెలిఫోన్ నెంబరా? ఈ వూళ్ళో నాలుగంకెల నెంబర్లు లేవే.. బాంకు ఖాతా నెంబరా? ....నా పేర్న బాంకు కాతాకూడా లేదు. పుట్టిన తేదీనా? కాదు. నేను పంతొమ్మిదివందలయాభై అయిదులో పుట్టాను. లేక అర్థంలేని అంకా? ....

ముసలాడి తెలివితేటలు తెలిపిన నేను, చివరిక్షణాల్లో ప్రాణాల్లో వుగ్గబట్టుకొని, గీసిన ఆ రక్తపు అంకెల మర్మం ఊహించలేకుండా వున్నాను. చివరిక్షణాల్లో మతిభ్రమించి అలా వ్రాశాడా? ...

నిముషాలు గడిచిపోతున్నాయి. ఇక్కడ నుండి యెంత త్వరగా బయటపడితే అంత మంచిది. వెల్ ....ఆ అంకెలతో రిస్క్ పడదలంకంటె వాటిని చెరిపేయడం ఉత్తమం. చుట్టూ చూశాను. గుడ్డలాంటిదాని కోసం.... బెడ్ మీద టవల్ కనబడితే అందుకొన్నాను.

బెడ్ ప్రక్కదేవున్న లైట్ టేబుల్‌మీది టెలిఫోన్ "ట్రింక్" మంటూ మ్రోగింది.

నా గుండె ఒక్కక్షణం ఆగి మళ్ళీ కొట్టుకోవడం ప్రారంభించింది. ఆగకుండా రింగవుతోంది టెలిఫోన్.

ఈ టైమ్‌లో సీతయ్యే ఎక్స్‌టెన్షన్ కనెక్షన్ ఇచ్చాడంటే తప్పకుండా ముఖ్యమైన వ్యక్తి అయివుండాలి ఫోన్ చేస్తున్నది. టెలిఫోన్ ఆన్సర్ చెయ్యకపోతే సీతయ్యే పైకి వచ్చే ప్రమాదం వుంది.

వెంటనే బయటపడటం క్షేమం.

టవలు ఆ రక్తపు అంకెలమీద వేసి తుడిచాను. ఆశ్చర్యం అవి చెరగడంలేదు. నేలమీద రక్తం ఆరిపోయి కొంసలు తప్ప అసలు అంకెలు చెరగడం లేదు. హఠాత్తుగా నాలో కంగారు పెరిగింది. లాభంలేదు. ఈ అర్థంకాని అంకెలు చెరుపుతూ కూర్చుంటే సీతయ్య పైకి వచ్చెయ్యెచ్చు. సీతయ్యను చంపే ఆలోచనలేదు నాకు. టవల్ ఓ మూలకు విసిరేశాను పిస్తోలుపై వేలిముద్రలు తుడిచేసి బెడ్‌మీదకు విసిరాను.

చటుక్కున తలుపు తెరుచుకొని బయటకు నడిచాను. చకచక మెట్లు దిగి క్రిందకు పరిగెత్తాను. తలుపుకు తాళం వెయ్యవలసిన అవసరం లేదు. గబగబ రావడంవల్ల ఆయాసంగా వుంటున్నట్లుంది. ఒక్క క్షణం క్రింద మెట్టుమీద ఆగాను.

అయామ్ జస్ట్ ఇన్ టైమ్! పైన 'బాబుగారూ' అని సీతయ్య తలుపుతట్టడం వినిపిస్తోంది ఓ నిముషం ఆగి లోపలకు వెడతాడు సీతయ్య. మరో అయిదు నిముషాల్లో పోలీసులతో నిండిపోతుంది.

చప్పుడు చెయ్యకుండా గోడెక్కి వెనక వీధిలోకి

దూకాను. చకచక నడవడం ప్రారంభించాను. మూడు నిముషాల్లో సందు మలుపు తిరిగి మెయిన్ రోడ్ మీదికొచ్చాను.

రిక్షా ఎక్కి తిన్నగా రైల్వేస్టేషన్‌కి పోనిమ్మని చెప్పాను. లెఫ్ట లగేజిరూమ్‌లో రెండు రోజుల క్రితమే పెట్టిన సూట్‌కేస్ వుంది.

లగేజ్‌రూమ్ క్లర్క్ నన్ను కాసేపు ఎగాదిగా చూసి రిసీట్ ప్రొడ్యూస్ చేసే టప్పటికి మారు మాట్లాడకుండా సూట్‌కేస్ ఇచ్చాడు. చకచక బట్టలు మార్చుకొని కాంటీన్లో కాఫీ త్రాగాను. సూట్‌కేస్‌లో జతబట్టలు తప్ప మరేమీ లేవు. జాగ్రత్తగా ప్లాట్‌ఫారంమీద ఆగివున్న ఓ రైలు పెట్టెలో యెక్కి లగేజ్ రాక్‌లో పెట్టి క్రిందకు దిగాను.

రాత్రి రెండు దాటుతోన్నా అవతలివైపు ప్లాట్‌ఫాం మీద రైలు రావడంతో రద్దీగా వుంది. కాసేపు అటుయిటు తచ్చాటలాడి రిక్షా ఎక్కి ట్రంక్‌రోడ్‌మీద ఊరుకు చివరగా వున్న కాలనీకి పోనిమ్మన్నాను.

ఊరిచివర రిక్షా దిగి డబ్బులిచ్చి పంపేసి ట్రంకు రోడ్డంట తెల్లవారుఝామువరకూ నడిచాను.

రాత్రి జరిగిన హత్యకు కారణం ఏమయినా, అనుమానం మాత్రం నామీదకు రాదు. కిడ్నాపర్స్ కస్టడీలోవున్న నేను కనకయ్యను చంపడం అసంభవంగా భావిస్తారు. ముసలాడి గదిలో నా కాలి వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడ్డాను. పిస్తోలుమీద వేలిముద్రలు తుడిచేశాను.

సత్తార్ ముఠాగనుక కకుర్తిపడి ఆ రెండు లక్షలున్న సూట్‌కేస్ పట్టుకొంటే, పోలీసులు వాడి ముఠాను అరెస్టు చేస్తారు. పోలీసులు వాడి మాటలు నమ్మకపోయినా

యిబ్బంది లేదు. నమ్మితే పోలీసుల దాడి గురించి తెలుసుకొని కిడ్నాపర్ సత్తార్ ఛాయలకు రాలేదనుకొంటారు.

నేను మాత్రం కొంత కాలం విచారం నటించాలి. క్రొత్తలో బాధ నటించాలి.

వెల్.... నలభై లక్షల ఆస్థికోసం, డాలీకోసం ఆ మాత్రం చెయ్యగలను.

దాదాపు అయిదు మైళ్ళు నడిచివుంటాను ట్రంక్ రోడ్డు మీద. టైము అయిదుకావస్తోంది. ట్రంక్ రోడ్ మీద ట్రాఫిక్ ఇంకా పూర్తిగా పిక్ అప్ అవలేదు. రెండు పెద్ద మట్టి గడ్డలు రోడ్డుమధ్య పెట్టాను.

జేబులోంచి ఎర్రజెండా ఒకటి బయటకు తీసి, రోడ్డు ప్రక్కనున్న చెట్టుకొమ్మ విరిచి దానికి కట్టాను. మరో జేబులోంచి రెండు 'వాలియమ్ 5' మాత్రలు మ్రింగాను. నీళ్ళు లేకపోవడంవల్ల కాస్త కష్టం అనిపించింది.

ఎర్ర జెండాను మట్టి గడ్డలమధ్య పైకి కనపడేలా అరేంజ్ చేసి, ప్రక్క తారురోడ్డుమీద పడుకొన్నాను. దూరంగా యేదో మోటారు శబ్దం వినబడుతోంది. మెల్లిగా మత్తు ఆక్రమిస్తోంది.

మోటారుశబ్దం దగ్గిరయింది. కళ్ళు మూసుకొని ప్రశాంతంగా పడుకొన్నాను. హారన్ మ్రోగుతోంది. మోటారు మరింత దగ్గరయిన శబ్దం తెలుస్తోంది కారు అదురుబట్టి.... కళ్ళు తెరవలేదు. ఊపిరి బిగించి అలానే పడుకొన్నాను. ఎర్రజెండా చూసి వాళ్ళే ఆగుతారు.

కీచుమంటూ బ్రేకులువేసిన శబ్దం వినబడింది. లారీ డ్రైవర్ బూతులు తిడుతున్నాడు. "ఏంబే రోడ్డు కడ్డంగా పడుకొన్నావ్! బ్రతకాలని లేదా?"—అంటున్నాడెవడో దగ్గిరికి వచ్చి.

మాటలు సరిగా వినపడ్డంలేదు. చెవుల్లో హోరు.... 'వాలియమ్ 5' పనిచెయ్యడం మొదలుపెట్టినట్లున్నాయ్. ఎవరో కదుపుతున్నారు. ఒళ్లు కదుల్తోంది. మత్తు వంటి నిండా ప్రాకుతోంది ఏదో అరుస్తున్నారు. బూతులు, తన్నులు స్పృహపోయింది నాకు.

6

తలలో విపరీతమైన పోటు. ఎవరో లోపల మెదడును సుత్తులతో కొడుతున్నట్లు బాధ.

కళ్ళు తెరిచేప్పటికి గదంతా గిర్రున తిరుగుతున్నట్లని పించింది. స్పష్టంగా కనబడ్డానికి ఒక్క నిముషం పట్టింది. తెల్లని ఎనామిల్ గోడలు, పైన తిరుగుతోన్న సీలింగ్ ఫాన్. మెత్తటి పడక. కళ్ళు త్రిప్పిచూశాను. తలుపు ప్రక్కనే స్టూలుమీద పోలీస్ కానిస్టేబుల్ కూర్చొని వున్నాడు.

ఒక్కక్షణం గుండె జల్లుమన్నది....ఆస్పత్రి గది యిది....మరి పోలీస్ కానిస్టేబుల్ కాపలా ఎందుకు?....

నేను కదలడం చూపి ఆ కానిస్టేబుల్ బెడ్ దగ్గరికి వచ్చాడు....వాడి చేతిలో తుపాకి కూడా వుంది. నా వైపు చూపి గమ్మత్తుగు నవ్వాడు.

నేను తిరిగి నవ్వాలని ప్రయత్నించాను. "ఎక్కడున్నాను?"—అన్నాను....నా గొంతు నాకే నూతిలోనుండి వచ్చినట్లు వినపడింది. బయట అడుగుల చప్పుడు వినబడింది బూట్ల శబ్దం.

"వెల్! మెలకువ వచ్చిందన్నమాట ఆఖరికి...."— అన్న మాటలు వినబడ్డాయి ద్వారం దగ్గర. నా చూపులు అటు తిరిగాయి.

తెల్ల కోటు వేసుకొన్న డాక్టరు, ఒక ఇన్‌స్పెక్టర్,

మరో యిద్దరు కాన్‌స్టేబుల్స్ వున్నారు ... వాళ్ళకు వెనగ్గా తెల్లని యూనిఫారం వేసుకొన్న నర్సు కూడా వుంది.

గదికి కాపలావున్న కానిస్టేబుల్ చటుక్కున సెల్యూట్ చేశాడు. "ఇప్పుడే మెలకువ వచ్చింది సార్" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ బెడ్ దగ్గరికి వచ్చాడు. అతని బుగ్గమీసాల క్రింద పెదవులమీద చిన్న నవ్వు కదిలింది.

"హౌ ఆర్ యు మిస్టర్ మహేశ్వర్?" అన్నాడు.

చిన్న నిట్టూర్పు విడిచాను.. హమ్మయ్య ఫర్లేదు.... చిన్నగా నవ్వి "ఫైన్.... థ్యాంక్యూ!" అన్నాను మెల్లిగా లేచి కూర్చుంటూ.

"వెరీ గుడ్. క్రిందివరకూ నడిచే ఓపికుందా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నవ్వుతోనే.

"వెల్! ఐవిల్ ట్రై!" అన్నాను మెల్లిగా లేచి నిలబడుతూ. ఒక్కక్షణం గది అటూ ఇటూ కదిలినట్లనిపించి సర్దుకొంది. నిద్రమాత్రల ఎఫెక్ట్ అనుకొంటాను.

"వెరీగుడ్ ... లే.... జాగ్రత్తగా విను" ఆశ్చర్యంగా చూశాను ఇన్‌స్పెక్టర్‌వైపు. అతని పెదవులమీద ఇందాకటి నవ్వులేదు. "యు ఆర్ అండర్ అరెస్టు."

"వాట్!" అన్నాను అర్థంకానట్లు.

"ఓవర్ యాక్టింగ్ చెయ్యక. నీ పెంపుడు తండ్రి కనకయ్యను హత్యచేసిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నా ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తూ.

"ఏమిటి? ఏమిటి మీ రంటున్నది. మా నాన్న హత్య చెయ్యబడ్డాడా?" నమ్మలేక అరిచాను.

"గొంతు చించుకొని ప్రయోజనం లేదు మహేశ్వర్.

ఆస్థికోసం నీ పెంపుడు తండ్రి కనకయ్యను చంపడానికి నువ్వాడిన నాటకం పూర్తిగా బయటపడింది. నిన్నెవరూ కిడ్నాప్ చెయ్యలేదనీ, కనకయ్యను హత్యచేయడానికి ఎలిబీ సృష్టించు కోవడం కోసం కిడ్నాపింగ్ నువ్వు ఆడిన నాటక మనీ....మాకు ఋజువుల్తో సహా దొరికాయి" అంటున్నాడు ఇన్స్పెక్టర్.

నమ్మలేనట్లు చూశాను ఇన్స్పెక్టర్ వైపు "అబ్సర్డ్" అన్నాను కోపంగా.

నవ్వాడు ఇన్స్పెక్టర్ "ఏమిటి అబ్సర్డ్. నీ ప్లాన్ అప్ సెట్ కావడం అబ్సర్డా? లేక నీవు క్రోటన్ మొక్క క్రింద పెట్టిన ఉంగరం దాచిన కవర్ మీద నీ వేలిముద్రలుంటమా? మీటర్ బోర్డ్ మీద కేవలం నీ వేలిముద్రలే వుండడమా? డబ్బు ఎలా ఇవ్వాలో ఇన్స్ట్రక్షన్స్ టైప్ చేసిన ఉత్తరం మీద, కవర్ మీద నీ వేలిముద్రలుండడమా? ఆ ఉత్తరం మీ ఇంట్లో వున్న టైప్ రైటర్ మీద టైప్ చేయడమా?.... ఏది అసంభవం అంటావో చెపుతావా. ఈ ఎవిడెన్స్ అంతా నువ్వే ఎక్కడో దాక్కొని, నిన్నెవరో కిడ్నాప్ చేసినట్లు నాటకం ఆడినట్లు స్పష్టంగా చెప్పడం లేదూ."

మతిపోయినట్లు చూశాను ఇన్స్పెక్టర్ వైపు.... గుటకలు మింగుతూ బెడ్ మీద కూలబడ్డాను.

"నువ్వు చివరిగా ప్రజలకు కనిపించిన అలంకార్ బార్ లో ఎంక్వయిరీ చేయగానే నీమీద అనుమానం వచ్చింది మాకు...." అన్నాడు ఇన్స్పెక్టర్ కానిస్టేబుల్ దగ్గర్నుండి హేండ్ కఫ్ తీసుకొంటూ.

ఒక్కసారి ప్రపంచం తల్లక్రిందు లయిపోతోంది నాకు. ఇంత జాగ్రత్తగా వేసిన పథకంలో ఈ పొరపాట్లు నన్ను

పట్టిస్తాయనుకోలేదు అసలు నామీదకు అనుమానం వస్తుం దనుకోలేదు.

"ఎనిమిదిన్నరకు 'మనోరమా' లో డిన్నర్‌కు వెళ్ళాలని తెలిసే ఏడున్నరకు 'అలంకార్'లో నీవు సుష్టుగా భోజనం చేశావని తెలిసినప్పుడే నీ మీద అనుమానం కలిగింది. తర్వాత ఇక భోజనం చేసే అవకాశం రాదు మనోరమాకు వెళ్ళే పని లేదు. అని నీకు ముందుగా తెలియబట్టే అలంకార్‌లో కడుపునిండా తిన్నావు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ బేడీలు తొడుగుతూ.

"కాని ఆయన్ను నేనే చంపానని చెప్పడానికి ఆధారాలు లేవు....ఇన్‌స్పెక్టర్" అన్నాను ఆత్మ విశ్వాసంతో.

"షటప్ యు ఇడియట్" అరిచాడు ఇన్‌స్పెక్టర్. "నీ పెంపుడు తండ్రి తెలివిని చాలా తక్కువ అంచనా వేశావు నువ్వు. చావుకు ముందు కనకయ్య తన పదునైన బుర్రను చివరిసారిగా ఉపయోగించాడు. తనను హత్య చేసిందెవరో చాలా తెలివిగా మాకు తెలియచేశాడు.

చనిపోయే ముందు రక్తంతో తడిచిన వ్రేలితో నేలమీద ఓ అంకె వ్రాశాడు రెండు, నాలుగు, అయిదు, ఆరు.... అదే నీ గొంతుకు ఉరిత్రాడును ఖాయంచేసింది. ఆ రక్తపు అంకెలే ఈ హత్యా రహస్యాన్ని ఛేధించాయి."

"వాట్? రెండు నాలుగు అయిదు ఆరు....మీనింగ్ లెస్....అలాంటి అర్థంపర్థం లేని...." ఉద్రేకంతో, నిస్సహాయంగా, పిచ్చిగా అరిచాను....ఏముంది? ఏముంది ఆ అంకెల్లో? ఏమిటి ఆ రక్తపు అంకెల రహస్యం.

"ఫండాకోర్!" అరిచాడు ఇన్‌స్పెక్టర్...."అది అర్థం లేని అంకె కాదు నీలాంటి మూర్ఖులకు అర్థమయ్యే సంఖ్య కాదు....అలా అర్థమయితే ఏదోరకంగా దాన్ని

చెరిపేస్తారనే అలా వ్రాసాడు. కాని ఆ అంకె రహస్యం సీతయ్య చెప్పాడు."

"సీతయ్యా?" అన్నాను గొంతు పెకల్చుకొని.

"అవును. అది ఒక తేది. పంతొమ్మిదివందల యాభై ఆరు, ఏప్రిల్ రెండవ తారీఖు" అర్థంకావడం లేదు. అంతా పిచ్చిగా, కంగారుగా, కన్‌ఫ్యూజ్‌గా వుంది.

"నీకు అర్థంకాదులే. తన మరణాన్ని కొని తెచ్చుకొన్న తేదీ అది. అదే నిన్ను దత్తత తీసుకొన్న తేదీ. నీకు జ్ఞాపకం వుండదులే" ఇన్‌స్పెక్టర్ మాటలు సమ్మెటపోటుల్లా వినబడుతున్నాయి.

ప్రపంచం గిర్రున తిరుగుతోంది. కళ్ళముందు ఉరి త్రాడు కదుల్తోంది. చివరిక్షణాల్లో ముసలాడి కళ్ళలో ద్వేషం నన్ను కాల్చిచ్చేల్లా దహిస్తోంది. రెండు చేతులు ముందుకు సాచి కుప్పలా కూలిపోయాను. □

దూర శ్రవణం !



చేతులు మారిన చప్పట్లు

పి. అరుణ



వేదమూర్తికి సంతోషంగా వుంద. అతని మనసు ఎక్కడో తేలిపోతోంది. వేగంగా వెళుతోన్న రైల్లోకి దూసుకుని వస్తున్న గాలి అతడిని గిలిగింతలు పెడుతోంది.

అతనికి ఆ నిముషాల్లో పదే పదే విజయ గుర్తుకు వస్తోంది.

ఇంతకీ వేదమూర్తి సంతోషానికి— ఓ ముఖ్యమయిన కారణమే వుంది—అదే అతనికి కొద్ది రోజుల్లో రాబోయే ఉద్యోగం.

ప్రస్తుతం అతను విశాఖలో ఓ పెద్ద కంపెనీ వాళ్ళు నిర్వహించిన పెద్ద ఉద్యోగం యింటర్వ్యూకి వెళ్ళి తిరిగొస్తున్నాడు.

ఇంటర్వ్యూ బాగానే చేశాడు. అసలు అన్నింటికీ మించి అతని అదృష్టం ఒకే ఒక్కచోట పండి కూర్చుంది. అతను ఆ ఇంటర్వ్యూ జరుపుతున్న కంపెనీకి వెళుతుంటే దార్లో అతని ఫ్రెండ్ కలిశాడు. వేదమూర్తి ఇంటర్వ్యూ విషయం చెప్పగానే పెద్దగా నవ్వేసి, నీకా ఉద్యోగం వచ్చేసినట్టే అనుకో. ఎందుకంటే ఆ కంపెనీ జనరల్ మానేజర్ మా ఆవిడకు పెదనాన్నే అవుతాడని హుషారుగా చెప్పాడు. ఇంటర్వ్యూకు వెళ్ళడం వరకే నీ పని ఆ తర్వాత నీకా కంపెనీలో ఉద్యోగం వచ్చేలా చూడటం నా పని—అనేసి ఇంకా చాలా విషయాలు చెప్పి వెళ్ళిపోయాడు.

అందుకే ఇప్పుడు వేదమూర్తి చాలా సంతోషంగా వున్నాడు.

ఆ కంపార్టుమెంటులో మరో ఇద్దరు ప్రయాణీకులు వున్నారు కాని వాళ్ళిద్దరు బాగా కునుకుతున్నారు.

రాత్రి—చాలా సమయం గడిచిపోతున్నది. కళ్ళలో వత్తులు వేసుకున్నట్టు వేదమూర్తి అలా కిటికీ పక్కనే కూర్చుని తన ప్రియురాలు విజయతో తన భవిష్యత్తు జీవితాన్ని వూహించుకుంటూ కలలు కంటున్నాడు.

సరిగ్గా అలాంటి సమయంలోనే ఆ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ స్టేషన్‌లోకి వచ్చి మెల్లిగా ఆగింది.

రైలాగినా ఆ ఇద్దరు ప్రయాణీకులూ లేవనేలేదు.

వేదమూర్తి తన బ్రీఫ్‌కేసు తీసుకుని రైల్లోనించి దిగేశాడు.

కాని—అతని చేతిలో వున్న బ్రీఫ్‌కేసు అతనిది కాదనీ ఆ నిద్రపోతున్న ఇద్దరిలో ఒకరిదనీ అతను గమనించ లేదు.

2

వేదమూర్తి లేచేసరికి ఉదయం ఎనిమిది గంటలు కావస్తోంది. రాత్రి ఆలస్యంగా పడుకోవటం వల్ల అతనికి ఎర్లీగా మెలకువ రాలేదు.

లేచి బ్రష్‌కోసం బ్రీఫ్‌కేస్‌ను తెరిచి అతను వెంటనే ఆ బ్రీఫ్‌కేసు తనది కాదనే విషయాన్ని గ్రహించేశాడు.

అప్పుడు అతను ఆశ్చర్యంతోనే అందులో ఏమున్నాయో ఇంతకీ ఆ బ్రీఫ్‌కేసు ఎవరిదో తెలిసే ఆవకాశం ఏదయినా వుంటుందేమోనని—పైనవున్న పేర్‌పిల్లోను పైకి తీశాడు. కింద అతనికి ఓ చిన్న ప్లాస్టిక్ పెట్టె కనిపించింది. ఆ పెట్టె ఎర్రగా గుమ్మత్తుగా వుంది. అందంగా కూడా వుంది. అందువల్ల వేదమూర్తి ముచ్చటపడి ఆ పెట్టెను తెరిచేశాడు.

అతడి కళ్ళు పూర్తిగా షాక్‌తో పెద్దవైనాయి. ఎందుకంటే ఆ పెట్టెలో వున్నది మిలమిల మెరుస్తున్న—తళతళ లాడుతున్న ఆ పది వజ్రాల విలువ కొన్ని లక్షల రూపాయల్లో వుంటుందని అతని కనిపించింది.

వేదమూర్తిగా చేతులు ఒక్కసారి వణికాయి.

'మైగాడ్' అన్నాడు చిన్నగా—షాక్‌నించి తేరుకున్న తర్వాత.

వెంటనే అతను ఆ ఎర్ర ప్లాస్టిక్ పెట్టెను మూసేశాడు.

ఇంకా ఆ బ్రీఫ్‌కేస్‌లో యేమున్నాయోనని వెతికాడు కాని విలువైన వస్తువులేమీ కనిపించలేదు.

అతనికి అప్పుడే స్ఫురించింది ఏదో—ఆ కంపార్టుమెంటులో తన యెదురుగా కూర్చుని ప్రయాణం చేస్తున్న ఇద్దరు మనుషులు కళ్ళముందు గబగబా కదిలారు.

ఆ ఇద్దరిలో ఈ బ్రీఫ్‌కేస్ ఎవరిది?

ఇద్దరిదా?

ఒకరిదా?

ఆ యిద్దరూ కలిసే దీన్ని తీసుకెళుతున్నారా? యింత విలువయిన వజ్రాలున్న బ్రీఫ్‌కేస్‌ను అలా వదలి అంత ధైర్యంగా ఎలా నిద్రపోతున్నారు?

ఇలాంటి ప్రశ్నలతో వేదమూర్తి ఉక్కిరి బిక్కిరవుతున్నప్పుడు—

సుడిగాలిలా లోపలకు ఓ అందమైన యువతి "హాయ్!" అంటూ వచ్చేసింది.

ఉలిక్కిపడ్డాడతను.

గబుక్కున ఆ బ్రీఫ్‌కేస్‌ను మూసే ప్రయత్నం చేశాడు కాని అప్పటికే విజయ అను పేరుగల ఆ యువతి దృష్టి బ్రీఫ్‌కేస్‌లోవున్న యెర్రటి ప్లాస్టిక్ పెట్టెమీద పడనేపడింది.

"ఓహ్....ఎంత అందంగా వుందీ పెట్టె? ఎక్కడ తీసుకొచ్చావ్! విశాఖలోనా?" అంటూనే ఆ పెట్టెను చేతికి తీసుకొని తెరిచి కెవ్వుమనరిచింది.

భయంగా — ఆశ్చర్యంగా — అనుమానంగా చాలా స్పీడ్‌గా వేదమూర్తిని చూసింది.

అతను చిరునవ్వుతో విజయ చేతిలోనించి ఆ పెట్టెను తీసుకుని మూసి "ముందు నువ్వు షాక్‌నించి బయటపడు. తర్వాత అంతా వివరంగా చెబుతాను" అన్నాడు.

విజయ తేరుకొని "ఆల్‌రైట్! నేను షాక్‌నించి బయట పడినట్టే... అంతా వివరంగా చెప్పు?" వేదా అనడిగింది.

వేదమూర్తి వీలయినంత చిన్నగా ట్రెయిన్లో తన బ్రీఫ్ కేస్ బదులు ఈ వజ్రాలపెట్టె వున్న బ్రీఫ్‌కేస్‌ను పొరపాటుగా తీసుకురావటం గురించి చెప్పాడు.

"ఓహో....అంతా సినిమాల్లోలాగా జరిగింది.. వియార్ లక్కీ....లక్షల ఖరీదుచేసే వజ్రాలు యిప్పుడు మనదగ్గరున్నాయి. ఇప్పుడు మనిద్దరం లక్షాధికారులం. అవును కదూ!" అన్నది విజయ అదోలా నవ్వుతూ.

"స్టాప్ నాన్సెన్స్....ఇంత ఖరీదయిన వజ్రాలను దగ్గర పెట్టుకొని మనం ప్రాణాలతో బతికివుంటామనే అనుకుంటున్నావా? నువ్వెంత ఫూల్‌వో నీకు అర్థం కావటంలేదు" అన్నాడు అతను కోపంగా.

"నేను ఫూల్నే....అందులో యెలాంటి అనుమానం లేదు. అందుకే నీలాంటి మనిషి ప్రేమలో పడ్డాను."

నవ్వొచ్చింది ఆ క్షణంలో వేదమూర్తికి.

నవ్వి "ఈ వజ్రాల అసలుమనిషి నన్ను వెతుక్కుంటూ వచ్చి బారెడు కత్తితోనో. సైలెన్సర్ అమర్చిన పిస్తోలుతోనో చంపి వజ్రాలను తీసుకొని వెళ్ళగలడు. తెలుసా?" అన్నాడు.

"ఎలా?....అతనికి నీ ఎడ్రసు—ఫోటో కూడా ఇచ్చి వచ్చావా?"

"లేదు. అందుకే నువ్వు ఫూల్‌వని అన్నాను. నా బ్రీఫ్ కేస్‌ను అతను తీసుకెళ్ళి వుండడూ....అందులో నా సర్టిఫికెట్లూ....నా ఎడ్రస్ తెలియజేసే కాయితాలూ వుండవూ?"

"ఓహ్....ఆ విషయమే మరచిపోయాను. ఐతే ఇప్పుడు మనం ఏం చేద్దాం?" అనడిగింది విజయ.

"ఏదో చెయ్యాలి....ఇంత ఖరీదైన వజ్రాలను తీసు కెళుతున్నాడంటే ఆ మనిషి తప్పకుండా గొప్ప స్మగ్లరై వుంటాడు. అందువల్ల నాకు ఈ వజ్రాలపెట్టెను పోలీసు లకు అప్పగించాలని వుంది. కానీ...." అంటూ ఆగి పోయాడు.

"మరైతే యింకా ఆలోచనెందుకు?"

"ఎందుకంటే విజ్జీ....ఈ పోలీసులకు ఎదుట వున్న వాడే నేరస్తుడు. ఆ వజ్రాలను చూసి యిందులో నాకూ ఏదో సంబంధం వుందని నన్ను పట్టుకొచ్చుకుంటారు. ఇదో పెద్ద న్యూసెన్స్. అందువల్ల నేనో ప్రయివేట్ డిటెక్టివ్‌ని కలుసుకొని ఈ కేసు గురించి చెప్పాలని అను కుంటున్నాను" అన్నాడు.

"ఎవరా డిటెక్టివ్?"

"డిటెక్టివ్ రాజారావు."

3

"నన్ను మీరు కలుసుకోకుండా మీ దగ్గరకు నన్నే రమ్మని ఫోన్‌చేసి పిలిచారంటే యిదేదో అతి ముఖ్యమైన కేసనే అనుకుంటాను" అన్నాడు డిటెక్టివ్ రాజారావు లోపలకు వస్తూనే.

"అవును. ముందు మీరు కూర్చోండి." అన్నాడు వేద మూర్తి.

ఆ డిటెక్టివ్‌ను యెక్కువసేపు సస్పెన్స్‌లో వుంచక ఆ వజ్రాలపెట్టె కేస్ గురించి చెప్పేసి రాజారావుకు

ఎర్రటి ప్లాస్టిక్ పెట్టెలో వున్న వజ్రాలను కూడా చూపించాడు అతను.

ఆ వజ్రాలను చూడగానే డిటెక్టివ్ కూడా షాక్ తినేసి "మైగాడ్.... లక్షలు విలువచేసే వజ్రాలు.... ఇది నిజంగా అతి ముఖ్యమయిన కేసే. ఇందులో సందేహం లేదు" అన్నాడు.

"సందేహంలేదు. నిజమే. ఇప్పుడు నేనేం చెయ్యాలో చెప్పండి. ఈ వజ్రాల మనిషి నన్ను తప్పకుండా ఇక్కడికి తీసుకొస్తాడు. ఈ వజ్రాలకోసం నన్ను హత్య చేస్తాడు. అందువల్ల వీటిని బుద్ధిగా యివ్వమంటారా?" అనడిగాడు.

"వద్దు. అలాంటి పని చెయ్యకండి. ఈ వజ్రాలను మనం పోలీసులకు అప్పగిద్దాం. ఇక్కడి ఓ పోలీస్‌స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ నాకు క్లోజ్ స్నేహితుడు. అందువల్ల మీరు భయపడకుండా అతనితో జరిగినదంతా చెప్పేస్తే అతను తప్పకు మీకు రక్షణ ఏర్పాటు చేసి, ఆ మనిషిని పట్టుకునే ఏర్పాటు చేస్తాడు."

ఇలా డిటెక్టివ్ రంజారావు మాట్లాడుతున్నప్పుడు తలుపులమీద చప్పుడయ్యింది.

ఒకరికొకరు మొహాలు చూసుకున్నారు. అప్పుడే "వేదమూర్తిగారూ! మీకు నెల్లూరునించి ట్రంకాల్ వచ్చింది" అన్నదో అమ్మాయి బయటనించి.

ఆ అమ్మాయి గొంతును గుర్తుపట్టి "ఆశ్చర్యంగా వుంది. నాకు నెల్లూరులో ఎవరూ లేరు. ఎందుకయినా మంచిది. మీరు కూడా రండి!" అంటూ డిటెక్టివ్‌ని తీసుకుని తలుపులు తెరిచి బయటకు వచ్చాడు.

అంతా కిందికి వెళ్ళారు.

ఇంటివాళ్ళ అమ్మాయి ఫోన్ దగ్గరే నిలబడి వుంది.

రిసీవర్‌ను తీసుకుని "హల్లో....నేను వేదమూర్తిని మాట్లాడుతున్నాను" అన్నాడు.

"హల్లో....నేను మీతో క్రితంరాత్రి రైల్లో ప్రయాణం చేసిన మనిషిని. మన బ్రీఫ్‌కేస్‌లు తారుమారైనాయి. మీ బ్రీఫ్‌కేస్ నా దగ్గరకొచ్చింది. అందులో మీకు ఎంతో ముఖ్యమయిన సర్టిఫికెట్లు ఇతర కాయితాలూ వున్నాయి. అందులో కనిపించిన మీ ఫోన్ నెంబర్ ఆధారంగా మీకు ఫోన్ చేస్తున్నాను. మీరు వెంటనే మీ దగ్గరవున్న నా బ్రీఫ్‌కేస్‌తో నేను చెప్పే ఎడ్రస్‌కు వచ్చి తప్పక కలుసుకోండి. నా బ్రీఫ్‌కేస్‌లో వస్తువులు జాగ్రత్తగా తీసుకురండి" అంటూ తన ఎడ్రస్ చెప్పి ఫోన్ పెట్టేశాడు.

తను కూడా ఫోన్ పెట్టేసి రాజారావుతో ఆ ఫోన్ మాట్లాడిన మనిషిని గురించి చెప్పాడు.

అతడి పేరు శివపాదం.

"గుడ్! ఐతే ఈ శివపాదం తను రావటానికి భయపడి మనకే వల విసిరాడు. ఇప్పుడు మన పోలీస్ ఫ్రెండ్ సాయంతో వాడిని కొన్ని గంటల్లో పట్టుకోవచ్చు. పదండి ముందు మనం ఇన్‌స్పెక్టర్ దిలీప్‌ను కలుసుకోవాలి" అన్నాడు ఉత్సాహంగా.

4

ఇన్‌స్పెక్టర్ దిలీప్ డ్రెస్‌లో లేడు. మామూలు దుస్తుల్లోనే వున్నాడు.

టాక్సీ నెల్లూరులోకి ప్రవేశించగానే "అందరం జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఆ శివపాదం మన కళ్ళముందే పారిపోతాడు. బి కేర్‌ఫుల్. అర్థమయ్యిందా?" అన్నాడు దిలీప్.

అంతా తలలూపారు.

ఓ పదినిముషాలు కొన్ని రోడ్లు తిరిగిన వాళ్ళ టాక్సీ ఒకచోట ఆగిపోయింది రోడ్డు మొదట్లోనే.

"దిగండి టాక్సీని ఇక్కడే వుంచి చిన్నగా నడిచి వెళదాం" అన్నాడు దిలీప్.

మరో రెండునిముషాలు నడిచిన తర్వాత "ఇదే ఇల్లు. నెంబర్ రెండొందలరెండు" అన్నాడు వేదమూర్తి.

గేటు నెట్టుకుని చిన్నగా లోపలకు నడిచాడు.

తలుపులు మూసివున్నాయి.

వాళ్ళక్కడకు వెళ్ళేసరికి లోపల్నుంచి మాటలు వినపడుతున్నాయి.

"....నువ్వెంత బుకాయించినా ప్రయోజనంలేదు శివపాదం. నీ బ్రీఫ్‌కేస్‌లో ఓ ఓపేరికార్డరూ వందరూపాయల నగదు మించి ఏమీ లేవు. కాని నా బ్రీఫ్‌కేస్‌లో లక్షలు విలువచేసే వజ్రాలున్నాయి. నా దురదృష్టంకొద్దీ రాత్రి ఎన్నడూ రానంతగా నిద్ర వచ్చింది. నువ్వు కూడా నిద్రపోయినట్టు నటించి నా బ్రీఫ్‌కేస్‌ను తీసుకుపోయావు. అందులో వున్న వజ్రాలను తీసుకుని నీకేమీ తెలియదని బుకాయిస్తున్నావు. నీ మాటలు నేను నమ్మను. రెండు నిముషాల్లో నువ్వు నిజం చెప్పకపోతే ఈ రివాల్వర్‌లో వున్న బుల్లెట్లన్నీ నీ గుండెలోకి దూసుకుపోతాయి."

అంతా వులిక్కిపడ్డారు.

అప్పుడే "ప్లీజ్, నన్ను నమ్మండి. నిజంగా మీ బ్రీఫ్‌కేస్ నేను తీసుకోలేదు. నేను తీసుకువచ్చిన బ్రీఫ్‌కేస్ వేదమూర్తి అనే మనిషిది. అందులో అతని సర్టిఫికెట్లు వున్నాయి. దాన్ని మీకు చూపించాను కదా" అన్నాడు శివపాదం.

ఆ మనిషి విలన్లా నవ్వి "నేను నిన్ను వెతుక్కుంటూ వస్తానని నువ్వు ముందుగానే వూహించి ఆడుతున్న నాటకం. నిజం చెప్పు. లేకపోతే నిర్దాక్షిణ్యంగా చస్తావ్...."

డిటెక్టివ్ రాజారావు ఆ తలుపులు కేవలం దగ్గరే వేసి వున్నాయనీ—లోపల బోల్టు వేయలేదనీ గమనించి ఆ విషయాన్ని దిలీప్‌తో చెప్పాడు.

వెంటనే అతను వూహించని వేగంతో తలుపులను విసురుగా నెట్టుకుంటూ లోపలకు పరుగెత్తాడు.

ఆ విసురుకు శివపాదాన్ని రివాల్వర్‌తో బెదిరిస్తూన్న ఆ మనిషి బోర్లాపడిపోయాడు.

రివాల్వర్ దూరంగా పడిపోయింది. అతను లేచేలోపలే రాజారావ్ అతడిని గట్టిగా పట్టుకున్నాడు.

శివపాదానికి వేదమూర్తి తనని పరిచయం చేసుకుని జరిగిందంతా చెప్పాడు.

చెప్పిన తర్వాత—

"ఓ వజ్రాల మనిషీ! ఆ శివపాదంగారు చెప్పినదంతా నిజమే. నీ వజ్రాలున్న బ్రీఫ్‌కేస్‌ను పొరపాటుగానే వేదమూర్తి తీసుకుని విజయవాడలో దిగిపోయాడు. ఆ తర్వాత మీ రిద్దరూ ఒకరి బ్రీఫ్‌కేస్‌లు మరొకరు తీసుకొని దిగిపోయారు. శివపాదంగారి దగ్గర్నుంచి ఫోన్ రాగానే ఆయనే ఈ వజ్రాల మనిషని అనుకున్నాం. కాని నువ్వు శివపాదం గారి బ్రీఫ్‌కేస్‌లో దొరికిన ఆయన ఎడ్రస్ పట్టుకుని యిక్కడికొచ్చి మాకు పట్టుబడిపోయావ్" అన్నాడు డిటెక్టివ్ రాజారావ్.

"అవునూ. అంత విలువైన వజ్రాలను అలాంటి

మామూలు బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకుని ఎందుకు ప్రయాణం చేస్తున్నావ్?" అనడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మామూలు బ్రీఫ్‌కేస్ ఐతే ఎవ్వరూ అనుమానించకుండా వుంటారని" అన్నాడతను ఏడుపు మొహంతో.

"అదే నీ కొంప ముంచింది. ముగ్గురి బ్రీఫ్‌కేస్‌లూ ఒకేలా వుండటమే నీ దురదృష్టం. దీని ఫలితం కటకటాల వెనక కూర్చుని తీరిగ్గా అనుభవించు. కథలు రాయటం వస్తే 'జాతకం మార్చిన బ్రీఫ్‌కేస్' అని ఓ కథ కూడా రాసెయ్" అన్నాడు రాజారావు.

అతడి మాటలకు వేదమూర్తి—విజయ—శివపాదం తెగనవ్వేశారు. □

మిమ్మల్ని నమ్మిందెవరు?



విషజంతువు

కాశీభట్ల భానుమూర్తి

భుజంమీద చేయి పడటంతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు రంగడు.

రంగడికి ముప్పై ఏళ్ళు వుంటాయి. గళ్ళలుంగీ పంచ, లాల్చీ, చేతిలో సిగరెట్‌తో దర్జాగా వున్నాడు రంగడు.

రంగడి అసిస్టెంటు పేరు చిన్నారావు. తల్లితండ్రులు చనిపోయిన దగ్గరనుంచీ చిన్నారావు, రంగడి దగ్గరే ఆ పనీ, ఈ పనీ చేసుకొంటూ తన పొట్ట పోషించుకొంటున్నాడు. నిక్కరు, చారల చొక్కా, చేతిలో బోర్నవిటా డబ్బా పట్టుకొని రంగడికన్నా ముందు నడుస్తున్న చిన్నారావు గురువుగారు ఆగేటప్పటికి తానుకూడా ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

తనమీద చేయివేసిన వ్యక్తివంక విసుగ్గా చూస్తూ "ఏం కావాలి?" అని ప్రశ్నించాడు రంగడు. ఈ లోపల చిన్నారావు వెనక్కివచ్చి రంగడ్ని కలుసుకొన్నాడు.

"మిస్టర్! నీ పేరు రంగడని తెలుసు. నీ అసిస్టెంటు పేరు చిన్నారావని తెలుసు. మీ ఇద్దరికీ నా అనేవాళ్ళు లేరని తెలుసు. పొట్టకూటికోసం ఏ పనయినా చేయటానికి మీ యిద్దరూ సిద్ధమే ననీ తెలుసు" అన్నాడా వ్యక్తి గంభీరంగా.

"రోడ్డుమీద పోయేవాళ్ళని ఆపి జాతకాలు చెప్పుతున్నావు. జ్యోతిష్కుడువా, లేక అది నీకు హాబీయా" అన్నాడు చిన్నారావు.

"ఏం కావాలని అడుగుతే మా జాతకాలు తిరగేస్తావేం, మా జాతకాలు మాకు తెలుసు, ఇంతకీ నీ వొచ్చి మమ్మల్ని ఆపిన విషయం చెప్పు" అన్నాడు రంగడు.

"ఆ బోర్నవిటా డబ్బాలో బోర్నవిటా లేదనీ తెలుసు. అందులో ఒక భయంకరమైన పాము వుందనీ తెలుసు" అన్నాడు ఆ వ్యక్తి తమాషాగా నవ్వుతూ.

ఉలిక్కిపడి చుట్టూ చూశాడు రంగడు ఎవరయినా చూస్తున్నారేమోనని.

చిన్నారావు భయంతో వణికిపోతూ డబ్బాని గట్టిగా

పట్టుకొన్నాడు.

"డబ్బాలో పాము వుందని చెబితేనే అంతలావణికి పోతున్నారు. ఆ పాము ని చూపించి ఆ ఇంటి యజమాని దగ్గర ఎందరూపాయలూ కాజేసారని చెబితే ఇంకెంతలా వణికిపోతారోగదా" అన్నాడా వ్యక్తి.

"మహానుభావా, మా ర్రాండతేజా, నీకు తెలిసిన విష యాలు పైకి అరిచి పబ్లిసిటీ చేయనక్కరలేదు. నడు అక్కడ మాట్లాడుకొందాము" అని ఆ వ్యక్తిని తోసుకొంటూ ఒక పొదదగ్గరికి తీసుకెళ్ళాడు రంగడు. చిన్నారావు రంగడ్ని అనుసరించాడు.

పొద దగ్గరికి రావటంతోనే ఆ వ్యక్తిని కూర్చోపెట్టి, తాను కూర్చొంటూ "చెప్పు, నీకేంకావాలి, ఎందుకు మమ్మల్ని వెంబడించావు" అన్నాడు రంగడు. చిన్నారావు కూడా కూర్చొన్నాడు.

"నా పేరు జగదీష్" అని తనను తాను పరిచయం చేసు కొని రంగడికి, చిన్నారావుకి చెరొక సిగరెట్టూ ఇచ్చి, తాను ఒకటి తీసి వెలిగించుకొన్నాడు జగదీష్.

"నీ పేరు జగదీష్ కావచ్చు. యేం కాదనలేదు. కాని నువ్వెలా మా రహస్యాలు తెలుసుకొన్నావో అది చెప్పు ముందు" అన్నాడు రంగడు.

"పోస్టాఫీసుకి ఉత్తరం పోస్టు చేద్దామని వెళుతుంటే సుబ్బారావు వాళ్ళ ఇంటిదగ్గర మీ రిద్దరూ తచ్చాడటం కని పించింది. ఏమై వుంటుందా అని నేను చూస్తుంటే ఎవరూ గమనించటంలేదనుకొని నువ్వు ఆ బోర్నవిటా డబ్బాలోంచి పాముని తీసి, సుబ్బారావు వాళ్ళ కిటికీలోంచి లోపలికి వదిలి దూరంగా వెళ్ళిపోయావు. వెనకే నీ అసిస్టెంటు పరి గెత్తాడు.

ఏమి జరుగుతుందో అని తెలుసుకోవాలన్న కుతూహలంతో నేను చెట్టుచాటున నిలబడి గమనించసాగాను. మిట్ట మధ్యాహ్నం ఎండ విపరీతంగా వున్న కారణంగా ఆ రోడ్డు మీద ఎవరూ తిరగటం లేదు.

కాసేపటికి సుబ్బారావు వాళ్ళ ఇంటిలో నుండి "పాము, బాబోయ్ పాము" అని కేకలు వినిపించాయి. చుట్టుపక్కల జనం అందరూ హడావుడిగా సుబ్బారావు వాళ్ళ ఇంటికి చేరారు. ఆ హడావుడిలో మీరిద్దరూ కూడా నెమ్మదిగా ఆ జనంతో కలసి సుబ్బారావు వాళ్ళ ఇంటిలో దూరారు. నేనుకూడా నెమ్మదిగా సుబ్బారావు వాళ్ళ ఇంటిలోకి వచ్చాను. కాసేపు జనం హడావుడి పడ్డాక, పాముల్ని పట్టుకొనే హీరోల్లా మీరిద్దరూ ముందుకి వచ్చి, మచ్చిక అయిన ఆ పాముని పట్టుకొని, ఈ డబ్బాలో పెట్టుకొని, కష్టపడినందుకు వందరూపాయల ప్రతిఫలం పుచ్చుకొని మరీ వచ్చారు" అన్నాడు జగదీష్ నెమ్మదిగా.

జగదీష్ చెప్పేదంతా ఆశ్చర్యంగా నోరు తెరుచుకొని మరీ విన్నారు ఇద్దరూ.

"అక్కడ జరిగింది అంతేనా, నేనేమన్నా తప్పు చెప్పానా" అన్నాడు జగదీష్.

"ఇప్పుడు.... ఇప్పుడు మీకేం కావాలి" అన్నాడు రంగడు భయంగా.

"ఏదో పొట్టకూటికోసం చేసాం సార్. ఇంకెప్పుడూ చేయం, మమ్మల్ని క్షమించండి సార్" అని జగదీష్‌ని ప్రాధేయపడసాగాడు చిన్నారావు.

"మీరు చేసినపని, మీకు చెప్పింది బ్లాకుమెయిల్ చేసి మీ దగ్గరనుంచీ డబ్బు తీసుకొందామనీ కాదు, పోలీసులకి పట్టించి మీకు జెయిల్‌శిక్ష వేయిద్దామనీ కాదు" అన్నాడు

జగదీష్ అయిపోయిన సిగరెట్టు పారేస్తూ.

"మరి....మరి, మీకేం కావాలి" అన్నాడు రంగడు సందేహంగా.

"మీరు నాకో హత్య చేసిపెట్టాలి" అన్నాడు జగదీష్ చుట్టూ చూస్తూ.

"హత్యా" భయంతో వణకసాగాడు రంగడు. చిన్నారావు ఆ ఖంగారులో చేతిలోని డబ్బాని నేలమీద పారేసాడు. డబ్బాలో పాము బయటికి వచ్చి తన జీవితానికి స్వేచ్ఛ వచ్చినందుకు సంతోషించి పొదల్లోకి దూరబోయింది. అది గమనించి, తేరుకొని పాము తోక పట్టుకొని వెనక్కి లాగి డబ్బాలో పడేసి మూత గట్టిగా బిగించాడు చిన్నారావు.

"ఏం, అంతలా భయపడుతున్నారు" అన్నాడు జగదీష్.

"నాయనా, నువ్వు చేయమన్నది అప్పడాలు కాదు. హత్య? అయినా ఏ కిరాయి హంతకుడ్నో చూసుకోక, మా లాంటి అల్పజీవులెందుకు" అన్నాడు రంగడు.

"ఎవరిని ఏ పనికి ఎలా ఉపయోగించుకోవాలో నాకు తెలుసు. ఇది లారీద్వారా చంపటం కాదు సింహాద్రిని నియమించటానికి, కత్తితో చంపటం కాదు అప్పలకొండని నియమించటానికి కేవలం గుండెనొప్పితో బాధపడుతున్న అతనికి నీ పాముని చూపించి ఆ గుండె నొప్పితోనే పరలోకం పంపించాలి" అన్నాడు జగదీష్ నెమ్మదిగా.

"అబ్బే మావల్ల కాదు. హత్య చేయటం అంటే మజాకా?" అన్నాడు రంగడు.

"రెండు వేలిస్తామన్నా చేయరా?" అన్నాడు జగదీష్.

"రెండు వేలా" నోరు వెళ్ళబెట్టాడు రంగడు.

"రెండు వేలే" అని మళ్ళీ డబ్బాని జారవిడిచాడు

చిన్నారావు.

ఈసారి జగదీషే డబ్బాతీసి చిన్నారావుకి ఇచ్చాడు మూత బిగించి.

"అవును రెండువేలిస్తాను. మీరు చేయవలసిందికూడా ఏమీ లేదు. పాముని తీసుకెళ్ళి నేను చెప్పిన ఇంటికెళ్ళి కిటికీలోంచి పాముని జారవిడవాలి. అక్కడ వ్యక్తి పాముని చూడగానే గుండెనొప్పితో చచ్చిపోతాడు. మీరు నెమ్మదిగా లోపలికి ప్రవేశించి మీ పాముని తీసుకొని వెళ్ళి పోవాలి. మొత్తం అరగంట పని. అరగంట కష్టపడితే రెండు వేలు మిమ్మల్ని సుఖపెడతాయి" అన్నాడు జగదీష్ వేరొక సిగరెట్టు వెలిగించుకొంటూ.

"మీరు చెప్పినట్టే ఎలా జరుగుతుంది. మేము పాముని వదిలిన టైముకి అతనుండొద్దూ, ఉన్నా చావద్దూ" అన్నాడు చిన్నారావు.

"అతను అక్కడ వుండేటైమే నేను చెబుతాను. ఆ టైముకి మీరు పాముని వదిలితే ఆ షాక్‌కి అతను చస్తాడు. అతనికి గుండెనొప్పి వుంది. పైగా అతనికి పాములంటే ఎలర్జీ!" అన్నాడు జగదీష్.

"మామీదకి ఏ రిస్కూ రాకూడదు. అలా అయితేనే ఒప్పుకొంటాను. లేదా మీకూ, నాకూ రాం, రాం" అన్నాడు రంగడు.

"మీరీ విషయం నలుగురికీ చెప్పకపోతే చాలు, మీమీదకే రిస్కూ రాదు. గప్‌చిప్‌గా వచ్చి పనిచేసుకొని డబ్బు తీసు కొని వెళ్ళిపోవటమే, దట్సాల్" అన్నాడు జగదీష్.

"సరే మేం ఒప్పుకొంటున్నాం" అన్నాడు రంగడు, జగదీష్‌తో.

చిన్నారావు మొహం సంతోషంతో విప్పారింది.

జగదీష్ జేబులోంచి వేయిరూపాయల కట్టతీసి రంగడికి ఇచ్చాడు. రంగడు దానిని అందుకొని కళ్ళకద్దుకొని జేబులో పెట్టుకొన్నాడు.

ఒక కాగితంమీద ఇంటి ఎడ్రస్సు వ్రాసి రంగడికి ఇచ్చాడు జగదీష్.

"ఓ! నేను చంపవలసిన వ్యక్తి పేరు శ్రీనివాసన్న మాట. ఆయన్ని ఎందుకు చంపమంటున్నారో తెలుసుకో వచ్చా!" అన్నాడు రంగడు కాగితం చూస్తూ.

"అది నీ కనవసరం. నేను నీకు ఇచ్చిన ఎడ్రస్సు ప్రకారం వెళ్ళటం, ఆ వ్యక్తిని చంపటం. పాముని తీసుకొని వచ్చేయటం. ఆ కాగితంలోనే వ్రాసానుకదా సమయంకూడా. ఇంకేమన్నా అనుమానాలుంటే అడగండి" అన్నాడు జగదీష్.

"మరి ఆ టైములో ఆ ఇంటిలో యెవరన్నా ఉంటే?" అన్నాడు చిన్నారావు.

"ఎవ్వరూ వుండరు. ఆ విషయాలన్నీ ఆలోచించే, మీకు ఆ టైము ఇచ్చాను. మీరు ఏమాత్రం సందేహపడ నక్కరలేదు" అన్నాడు జగదీష్ లేస్తూ.

"సరే, అయితే మిగిలిన డబ్బు ఎప్పుడిస్తారు?" అన్నాడు రంగడుకూడా లేస్తూ.

"నేను అక్కడే వుంటాను ఆ టైముకి. మీరు మీ పాముని తీసుకొని బయటికి రాంగానే నేను మీకు ఆ డబ్బిస్తాను" అన్నాడు జగదీష్.

"మరి మేం వెళ్ళొస్తాం" అన్నాడు రంగడు కదులుతూ.

"ఆ! మరిచిపోకండి, రేపు రాత్రి 9 గంటలకి గుర్తుంచుకోండి" అని రంగడికి చెప్పి గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు జగదీష్.

జగదీష్ వెళ్ళిపోయేదాకా ఆగి జేబులోంచి డబ్బు తీసి మళ్ళీ లెక్కపెట్టాడు రంగడు. లెక్క సరిపోయింది. తృప్తిగా నిట్టూర్చి మళ్ళీ జేబులో పెట్టుకొన్నాడు రంగడు ఆనందంగా.

"డబ్బు వస్తున్నందుకు ఆనందంగా వుంది, హత్య చేయవలసి వస్తున్నందుకు విచారంగా వుంది గురూ" అన్నాడు చిన్నారావు.

"న్యాయంగా బతికే వన్నాళ్ళు మనగురించి ఎవరికీ పట్టదు. ఈ రోజుల్లో నలుగురి పొట్టకొట్టేనా మనపొట్ట పోషించుకోవాలి. ఒక రచయిత వ్రాసిన కథకి కొద్దిగా మెరుగులు దిద్ది మరొక రచయిత నవలగా వ్రాసి బ్రతుకు తున్నాడు. తన అభిమానులకి డబ్బులిచ్చి తన సినిమా వందరోజులు ఆడించుకోవటానికి కొందరు సినిమా హీరోలు ఉబలాటపడుతున్నారు. మరొక వ్యక్తిని చంపైనా తన పదవిని నిలబెట్టుకోవటానికి కొందరు రాజకీయనాయకులు పాట్లు పడుతున్నారు. మనం అలాంటివేమన్నా చేస్తున్నామా, లేదు. పాముని వదులుతాం. ఆ మాత్రానికే గుండెనొప్పి తెచ్చుకొని చచ్చిపోతే మనమేం చేస్తాం. వెధవ ఆలోచనలు మానేసినయ్" అన్నాడు రంగడు ముందుకి కదులుతూ.

రంగడి ధోరణి చూస్తుంటే చిన్నారావుకి ఎప్పుడూ ఆశ్చర్యంగానే వుంటుంది. రంగడు ఎంత చదువుకున్నాడో చిన్నారావుకి తెలియదు. రంగడిని అడిగితే జీవితాన్ని చదువుకొన్నాను అని చెబుతాడు.

ఇద్దరూ నెమ్మదిగా నడుచుకుంటూ తాము వుంటున్న రూమ్‌వైపు బయలుదేరారు. రెండు కళ్ళు ఇదంతా గమనిస్తున్న విషయం ఈ ముగ్గురికీ తెలియదు.

2

"ఇదే ఆ ఇల్లు" అన్నాడు రంగడు కాగితంలోకి చూస్తూ.

చిన్నారావు ఆ పరిసరాలను ఆతృతగా పరిశీలించాడు.

ఇల్లంతా చూసుకుంటూ ఇద్దరూ ఇంటివెనక్కి వచ్చారు. చీకటిగా వుంది. చుట్టూ చూసి ప్రహరీగోడ ఎక్కుదామని గోడమీద చేయివేసాడు రంగడు కస్సుమని మెత్తగా రంగడి చేతిలో దూరింది ఒక గాజుముక్క. చప్పున చేయి వెనక్కి తీసేసాడు రంగడు.

'నీయమ్మ' అని చేయి పట్టుకొని కూలపడ్డాడు రంగడు. రక్తం బొటబొటా కారిపోసాగింది. చిన్నారావు గబగబా జేబులోంచి కర్చీఫ్ తీసి రంగడి చేతికి కట్టాడు. రంగడు బాధగా మూలగసాగాడు.

పది నిముషాలు గడిచేసరికి తేరుకొన్నాడు రంగడు.

రంగడి చేతికి బోర్నవిటా డబ్బా ఇచ్చి, ప్రహరీగోడని జాగ్రత్తగా పరిశీలించి గోడమీద గాజుపెంకులు లేనిచోట చేయివేసి పైకి యెక్కాడు చిన్నారావు గోడమీద కూర్చొని రంగడి చేతిలో డబ్బా అందుకొని గోడమీద పెట్టి, రంగడికి చేయి అందించాడు చిన్నారావు.

చిన్నారావు సహాయంతో మెల్లగా గోడ ఎక్కాడు రంగడు.

"గోడమీద గాజుపెంకులున్నాయని ముందే చెప్పొద్దూ ఆ చవట జగదీష్ సన్నాసిగాడు" అని జగదీష్ని తిట్టుకొని గోడకి అవతలివైపుకి దూకాడు రంగడు. రంగడికి డబ్బా అందించి, చిన్నారావుకూడా చప్పుడు కాకుండా గోడ అవతలివైపుకి దూకాడు.

ఇద్దరూ నెమ్మదిగా నడుచుకుంటూ కిటికీ దగ్గరికి

వచ్చారు. ఆ పరిసర ప్రాంతాలలో ఎవరూ లేరు.

కిటికీ తలుపుని నెమ్మదిగా తోసాడు చిన్నారావు.

చప్పుడు కాకుండా తెరుచుకొంది కిటికీ తలుపు.

లోపలికి చూసారు ఇద్దరూ ఆత్రుతగా.

లోపల మంచంమీద ఒక వ్యక్తి కూర్చొని వున్నాడు. అతని వీపు గోడకి చేరబడి వుంది. ఆ వ్యక్తి ఎటో చూస్తున్నాడు.

చిన్నారావు డబ్బా మూతతీసి రంగడికి ఇచ్చాడు. రంగడు డబ్బాలోపల చేయిపెట్టి పాముని బయటికి తీసి కిటికీలోంచి లోపలికి నెమ్మదిగా వదిలాడు.

పాము నేలమీదకి జారటంతోనే అటూఇటూ చూసింది. రంగడు ఇచ్చిన శిక్షణ ప్రకారం అది మంచం దగ్గరికి వెళ్ళింది. "బుస్, బుస్" మని ధ్వని చేస్తూ మంచంచుట్టూ ప్రదక్షిణ చేసింది. రంగడికి, చిన్నారావుకి విసుగ్గా వుంది.

"ఛీ, నీ యవ్వ. ఎంతకీ ఆ పామువైపు చూడదేంవాడు" అన్నాడు రంగడు.

"కాసేపు చూద్దాం గురూ, వాడు చూసి చావకపోతే మనమేం చేసేది వీడికి గుండెనొప్పి అన్నాడు జగదీష్ గాడు. చూడబోతే వీడు గుండ్రాయిలా వున్నాడు. ఇప్పుడప్పుడే చచ్చేట్టు లేదు వాలకం చూస్తే" అన్నాడు చిన్నారావు విసుగ్గా.

ఇంతలో ఆ సందులో జనసంచారం ప్రారంభమయింది.

"ఆరిని అప్పుడే మొదటి ఆట విడిచిపెట్టినట్టున్నారు. మనమింకా ఇక్కడే వుంటే జనం ఎవరన్నా చూస్తే చితక కన్నుతారు" అన్నాడు చిన్నారావు.

"అవును. వీడేమో ఎంతకీ చావటంలేదు. మనల్ని చంపుతున్నాడు. అయినా పాముని వదలమన్నాడు. వదిలాం,

వాడు చావలేదు, మనకి సంబంధంలేదు. పాముని వెనక్కి లాగేద్దాం" అని ఆ పక్కనే వున్న కర్ర తీసుకొని కిటికీ లోంచి లోపలికి దూర్చి పాముకి తాకించాడు రంగడు.

కర్ర వచ్చి తగలంగానే పాము ఏ మాత్రం ఆలశ్యం చేయకుండా కిటికీ కిందకి వచ్చి కర్రమీదకి ఎక్కింది. జాగ్రత్తగా దానిని కిటికీలోంచి బయటికి లాగి డబ్బాలో పడేసాడు రంగడు. చిన్నారావు డబ్బాకి మూత బిగించాడు. రంగడు చేతిలో వున్న కర్రని దూరంగా విసిరేసాడు.

"గురూ, చూడబోతే ఈ ఇంటిలో యెవరూ వున్నట్టు లేరు. ఇదే మంచి సమయం లోపలికి వెళ్ళి అందిన కాడికి చేజిక్కించుకొందామా" అన్నాడు చిన్నారావు.

రంగడు "వద్దు, అది తప్పు" అన్నాడు సంకోచంగా.

"ఏమిటి తప్పు. రెండువేల కోసం ఒక మనిషి ప్రాణాలు తీయటంకన్నా, ఒక ఇంటిని దోచుకోవటం తప్పు కాదు. నా మాట విను గురూ. అవకాశం వచ్చింది. ఉపయోగించుకోవటమే" అన్నాడు చిన్నారావు.

"సరే, నాకూ ఆశగానే వుందనుకో, లోపలికి వెళ్ళే మార్గం ఎలా, తలుపులు వేసి వుంటాయిగా" అన్నాడు రంగడు సందేహంగా.

"చూద్దాం గురూ, ఏ తలుపన్నా తీసి వుండకపోతుందా, ఒకవేళ ఏ తలుపూ తీసిలేదనుకో వుందిగా మనదగ్గర కర్ర. దానితో ప్రయత్నిద్దాం. వస్తే మంచిదే, లేదా ఆ జగదీష్ వచ్చేవరకు కాలక్షేపం చేసినట్టు వుంటుంది. ఎలావుంది నా ఆలోచన" అన్నాడు చిన్నారావు.

"సరే, వెతుకు ఏ తలుపన్నా తీసివుంటుందేమో" అన్నాడు రంగడు.

చిన్నారావు తలుపులన్నీ చేతితో నెట్టుకుంటూ ఇంటి చుట్టూ తిరిగాడు. వీధి తలుపు తప్ప అన్నీ గడియలుపెట్టే వున్నాయి.

వీథి తలుపు కొద్దిగా తీసి లోపలికి చూసాడు చిన్నారావు. ఎవరూ కనిపించలేదు. లోపలికి వెళ్ళాడు చిన్నారావు. రంగడు అనుసరించాడు.

ఇల్లంతా తిరిగిచూసారు ఇద్దరూ. ఒక్క పిట్టకూడా కనిపించలేదు.

"ఆ గదిలోకి వెళ్ళి ఆ వ్యక్తి ఎవరో చూద్దామా, ఇందాక మొహం సరిగ్గా కనిపించలేదు. అసలు వీడికి, ఆ జగదీష్ గాడికి ఏం గొడవ వచ్చిందో, నడుగురూ మొహం చూద్దాం. వచ్చాడో, బతికాడో" అన్నాడు చిన్నారావు.

"వద్దు. ఒకవేళ వాడు బతికుంటే లేనిపోని గొడవ. మన పని మనం నీటుగా ముగించుకోవటం వుత్తమం" అన్నాడు రంగడు.

ఇద్దరూ ఇల్లంతా తిరిగారు. ఒక మూల చిన్న బీరువా చిన్నారావుకి కనిపించింది. డబ్బా పక్కనపెట్టి ఆ బీరువా తలుపు తీసాడు చిన్నారావు.

ఆ బీరువా నిండా బట్టలు వున్నాయి. విసుగ్గా ఆ బట్టల్ని తీసి పక్కన పడేసాడు చిన్నారావు. ఆ బీరువాలో ఒక మూల వందరూపాయలు దొరికింది చిన్నారావుకి. ఆనందంగా ఆ డబ్బుని జేబులో కుక్కుకున్నాడు.

రంగడు ముందు హాల్లో సామాన్లన్నీ తిరగేయగా డ్రాయర్లో ఐదువందలరూపాయలు దొరికింది. రంగడు ఆ డబ్బుని జేబులో జాగ్రత్త చేశాడు.

చిన్నారావు, రంగడికి వందరూపాయల విషయం చెప్పాడు.

"వంటిచేత్తో వెతికిన నాకు ఐదువందలు దొరికితే, రెండు చేతుల్తో వెతికిన నీకు వందరూపాయలే దొరికాయన్న మాట" అన్నాడు రంగడు.

"ఎన్ని చేతులన్నది కాదు ముఖ్యం. మన నసీబ్ బాగుండాలి. ఈ రేడియో, టేప్‌రికార్డరు కూడా తీసుకొని వెడదామా? వెయ్యి రూపాయలవరకూ విలువ చేస్తాయి" వాటిని రంగడికి చూపుతూ అన్నాడు చిన్నారావు.

"రేడియో వద్దు. వెధవ తలనొప్పి కోరి తెచ్చుకోవటమెందుకు? టేప్‌రికార్డర్, కాపిని కాసెట్లు పట్టుకొని వెడితే సరి, కాలక్షేపమన్నా అవుతుంది" అని టేప్‌రికార్డర్ తీసి చంకలో పెట్టుకొన్నాడు రంగడు.

నాలుగు కేసెట్లు తీసి జేబులో పడేసుకొని, డ్రాయరు మీద ఉన్న వాచీ తీసి చేతికి తగిలించుకొన్నాడు చిన్నారావు. డబ్బా చేత్తో పట్టుకొన్నాడు.

"చాల్లే. నడు జగదీష్ వచ్చే టయిం అయింది. మిగతా డబ్బులు తీసుకొని గప్‌చిప్‌గా వెళ్ళిపోదాము" అని బయటికి నడవబోయాడు రంగడు.

అంతలో — "ధనేలు" మని తలుపులు తెరుచుకొన్నాయి.

ఒక్కసారిగా తలుపులు తెరుచుకోవటంతో రంగడు భయపడి వెనక్కి తగ్గాడు. రంగడి వెనకే వస్తున్న చిన్నారావు, రంగడు వెనక్కి తగ్గంగానే రంగడిని గుద్దుకొని క్రింద పడ్డాడు. కాని చేతిలోని డబ్బాని మాత్రం కిందపడనివ్వలేదు.

తేరుకొని ముందుకి చూసిన ఇద్దరికీ ఎదురుగా ఖాకీ బట్టలు కనపడ్డాయి. 'షాక్'తో నోరు వెళ్ళబెట్టారు యిద్దరూ.

"ఈ ఇన్‌స్పెక్టర్ పరాంకుశం ముందా మీ కుప్పి గంతులు. నేరం యెక్కడ జరిగినా, నేరస్థుడు ఎవరైనా, యెక్కడ వున్నా పట్టుకోగల నేర్పు వుంది, ఖబర్దార్" అని అరిచి గాల్లోకి రివాల్వర్ పేల్చాడు పరాంకుశం.

అసలే భయంతో బిగుసుకుపోయిన రంగడూ, చిన్నారావులు యీ రివాల్వర్ దెబ్బకి బట్టలు తడిపేసుకున్నారు.

"వీళ్ళేనా మిస్టర్ శ్రీనివాస్ మీరు చెప్పిన ఆ వ్యక్తులు" అన్నాడు పరాంకుశం, శ్రీనివాస్‌కి, రంగడిని, చిన్నారావులని చూపుతూ.

శ్రీనివాస్ పేరు విని మరీ వణకసాగారు రంగడూ, చిన్నారావులు.

"అవును సార్, వీళ్ళు కిటికీదగ్గర తచ్చాడుతున్నారు, నేను మొదటి ఆట 'చూసివచ్చేసరికి. నేను పట్టుకొందామంటే శక్తి చాలదు. కొద్దిగా గుండెనొప్పి వుంది నాకు. పోనీ పొరుగున వున్నవారిని కేకేద్దామన్నా ఆ సందడికి వీళ్ళు పారిపోవచ్చు; అందుకే వెనక్కి తిరిగి పోలీస్‌స్టేషన్‌కి వచ్చి మీకు చెప్పాను" అన్నాడు శ్రీనివాస్.

"నడిచొచ్చే కాలానికి, కలిసివచ్చే కొడుకు పుడతాడు" అన్నాడు పరాంకుశం.

"కాదు సార్, మీరు తప్పు చెప్పారు. కలిసివచ్చే కాలానికి నడిచివచ్చే కొడుకు పుడతాడు" అని సరిదిద్దాడు కానిస్టేబుల్ వీరాస్వామి.

"వీరాస్వామి, అందుకే నీకు హెడ్‌గా ప్రమోషన్ రావటంలేదు. నేను ఏదో ఒకటి అంటే మళ్ళీ కరెక్టు చేయాలా" అని వీరాస్వామిని కసిరి, మిస్టర్ శ్రీనివాస్, మీరు లోపలికెళ్ళి ఏమేం పోయాయో చూసుకోండి" అని చెప్పాడు ఇనస్పెక్టర్ పరాంకుశం.

శ్రీనివాస్ లోపలికి బయలుదేరాడు వెతకటానికి.

రంగడి చేతిలో టేప్‌రికార్డర్ లాక్కొని, చిన్నారావు చేతిలో కాసెట్లు తీసుకొని, ఒక కేసెటు టేప్‌రికార్డర్‌లో పెట్టి, 'ప్లే' బటన్ నొక్కాడు ఇనస్పెక్టర్ పరాంకుశం. 'ముఖ్య మంత్రి' సినిమాలో పాటలు వినిపించసాగాయి. ఆనందంగా ఆ పాటలు వినసాగాడు పరాంకుశం.

ఇంతలో 'కెవ్వు'మన్న కేక వినబడి, టేప్‌రికార్డర్లో అనుకొని దానిని ఆపేశాడు పరాంకుశం. అయినా ఆ కేకలు ఆగలేదు. అవి శ్రీనివాస్ అరచిన అరుపులు అని తెలుసుకొని, శ్రీనివాస్ వున్న గదిలోకి బయలుదేరాడు పరాంకుశం. కాసేపటికి పరాంకుశం కూడా శ్రీనివాస్‌తోపాటు అరవసాగాడు

రంగడు, చిన్నారావుల దగ్గర యిద్దరు కానిస్టేబుల్సు మాత్రం వుండి మిగిలినవాళ్ళు లోపలికి వెళ్ళారు.

లోపలికి వెళ్ళిన కానిస్టేబుల్స్‌కి మంచంమీద ఒక వ్యక్తి కనిపించాడు.

"సార్, మా తమ్ముడ్ని చంపేసార్ వాళ్ళు, నా తమ్ముడు జగదీష్ ఇంక నాకు దక్కడు సార్" అని బావురుమన్నాడు శ్రీనివాస్.

"ఊరుకోండి. మీ తమ్ముడ్ని చంపిన ఆ వ్యక్తుల్ని వదలను, కటకటాలు జీవితాంతం లెక్కపెట్టిస్తాను" అని శ్రీనివాస్‌కి చెప్పి, "వీరాస్వామి, ఫోన్‌చేసి, నిపుణులని మన బృందాన్ని రమ్మని చెప్పు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పరాంకుశం సీరియస్‌గా.

వీరాస్వామి గబ గబా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

"మిస్టర్ శ్రీనివాస్, ఈ ఇంటిలో ఎవరూ కనపడరేం" అన్నాడు పరాంకుశం.

"మా తమ్ముడిభార్య సరళ పుట్టింటికి వెళ్ళింది నిన్ననే. నా భార్య లావణ్య ఏడాదిక్రితమే పోయింది. మా ఇద్దరికి వంటా, మిగతా ఏర్పాటు చేసేది సరళే, ఆమె కూడా నిన్న వెళ్ళిపోవటంతో మేము హోటల్లో తింటున్నాం. మాకు యింక యెవరూ లేరు" అన్నాడు శ్రీనివాస్ బాధగా.

"ఓ ఐయామ్ సారీ!...." అన్నాడు పరాంకుశం బాధగా.

అరగంట గడిచేటప్పటికి ఆ యిల్లు జనంతో నిండి పోయింది జనాన్ని అందర్నీ బయటికి గెంటేసి వేలి ముద్రల నిపుణులు పని ప్రారంభించారు. ఫోటోగ్రాఫర్ చకచకా ఫోటోలు తీయసాగాడు.

డాక్టర్‌గారు చెప్పింది విని అందరూ నిర్ఘాంత పోయారు.

"ఆఁ పాము కాటువల్ల మరణించాడా?" అన్నాడు పరాంకుశం.

"అవును, నిస్సందేహంగా. ఇదిగో చూడండి కాలిమీద పాము కాటువేసిన గుర్తులు. విషం తలకెక్కి మరణిం చాడు. ఇతను మరణించి షుమారు రెండు గంటలు గడిచి వుంటుంది. మిగతా వివరాలు పరీక్ష చేశాక చెబుతాను" అన్నాడు డాక్టర్ జీవనాథ్.

"తప్పకుండా వాళ్ళే చంపారు సార్, అందులో ఒకడి చేతిలో డబ్బా వుంది. అందులోనే పాము ఉండివుంటుంది" అన్నాడు శ్రీనివాస్.

"అవును, నాకదే అనుమానం. పదండి వెదుకుదాం" అని ముందుగదిలోకి వచ్చాడు పరాంకుశం కంగారుగా.

రంగడు, చిన్నారావు, పరాంకుశం వంక బెదురుగా చూసారు.

చిన్నారావు దగ్గర డబ్బాతీసి చూసాడు పరాంకుశం. లోపల పాము వుంది. ఆవేశాన్ని ఆపుకోలేక చిన్నారావుని లాగిపెట్టి గుద్దాడు పరాంకుశం. చిన్నారావు ఆ దెబ్బకి కింద పడ్డాడు.

"దుర్మార్గుల్లారా, పాముని పంపి జగదీష్‌ని చంపి, సొమ్ము దోచుకొందామని లోపలికి వచ్చారా" అన్నాడు పరాంకుశం.

పరాంకుశం చేసిన ఈ అభియోగానికి రంగడు, చిన్నారావులు విస్తుపోయారు.

"ఏం, యెలా తెలుసుకొన్నానా అని ఆశ్చర్యంగా వుందా? సింపుల్. మీరు దొంగతనానికి ఈ యింటికి వచ్చి వుండొచ్చు. ఆ సమయానికి జగదీష్ యింటిలో వున్నాడు. అప్పుడు మీరు మీ పాముని పంపి, జగదీష్‌ని చంపి, యింటిలో వున్న సొమ్ము దోచుకొందామనుకొన్నారు. కాని మీ అదృష్టం బావుండలేదు. నా చేతికి చిక్కారు" అన్నాడు పరాంకుశం తీవ్రంగా.

"మేం జగదీష్‌గారిని చంపలేదు సార్, మమ్మల్ని నమ్మండి, అసలు జరిగినకథ చెబుతాను" అన్నాడు రంగడు భయం భయంగా.

"నా సర్వీస్‌లో ఇలాంటి కథలెన్నో విన్నా, సరే చెప్పు నీ కథేమిటో?" అన్నాడు పరాంకుశం జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకొని.

జగదీష్ వచ్చి తమని కలిసిన దగ్గరనుంచి జరిగింది చెప్పి "సార్, మా పాము ద్వారా జగదీష్‌గారు చనిపోయారన్నారు. అసలు మా పాముకి కోరలు ఎప్పుడో తీసేసాం. కావాలంటే పరీక్షించుకోండి. అయినా మాకు పని ఇచ్చిన జగదీష్‌గారినే మేం యెందుకు చంపుతాం. అసలు మేం

వచ్చేటప్పటికే ఎవరో చంపేసివుంటారు సార్!" అన్నాడు దీనంగా.

"మీరు చెప్పేది ఆలోచింపదగినదే. సరే పోస్టుమార్టం జరిగాక ఏ సంగతీ తెలుస్తుంది గదా, అంతదాకా మీరు మాత్రం నా కస్టడిలో వుండవలసిందే" అని రంగడికి, చిన్నారావుకి చెప్పి, "వీరాస్వామి నువ్వు శవాన్ని ఇక్కడి నుంచి తరలించే ఏర్పాట్లు చేయి, ఈ లోపల నేను ఈ చుట్టుపక్కల ఎంక్వయిరీచేసి అక్కడికి వస్తాను" అని వీరాస్వామికి చెప్పి, ఇద్దరు కానిస్టేబుల్స్‌కి రంగడిని, చిన్నారావుని పోలీసుస్టేషన్‌కి తీసుకొని వెళ్ళమని చెప్పి, అక్కడ నుంచి బయలుదేరాడు పరాంకుశం.

"మీ తమ్ముడు విషప్రయోగం ద్వారా చనిపోయాడు మిస్టర్ శ్రీనివాస్. ఎవరో మీ జగదీష్‌కి విషప్రయోగం చేసి కాలిమీద పాముకాటు గుర్తు పడేటట్టు సృష్టించారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పరాంకుశం, శ్రీనివాస్‌ను పిలిపించి.

శ్రీనివాస్ ఖంగుతిన్నాడు. అయినా తేరుకొని "ఎవరు సార్, నా తమ్ముడిమీద అంత పగ వున్నవాళ్ళు. ఇక నాకు దిక్కు యెవరు సార్!" అని బాధగా విలపించసాగాడు శ్రీనివాస్.

"నీ తమ్ముడిభార్య వుందికదా!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పరాంకుశం క్రూరంగా నవ్వుతూ.

"అధికారం చేతిలో వుందిగదా అని యిష్టం వచ్చినట్టు మాట్లాడకండి ఇన్‌స్పెక్టర్. చెల్లెలులాంటి "నా తమ్ముడి భార్యకు, నాకూ అక్రమసంబంధం అంటగడతారా?" అని అరిచాడు శ్రీనివాస్ కోపంగా.

"మిస్టర్ శ్రీనివాస్, బుకాయించకండి. నా కంతా తెలుసు. నీ భార్య పోంగానే నీ తమ్ముడి భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నావు. అది తెలిసి నీ తమ్ముడు సహించ లేక తన భార్యని పుట్టింటికి పంపేసి, నిన్ను చంపి పగ తీర్చుకొందామనుకొన్నాడు. అందుకనే రంగడిని, చిన్నా రావుని సంప్రదించాడు. ఇదంతా జగదీష్ డైరీలో వుంది.

అది నువ్వు గమనించి నీ తమ్ముడ్నే చంపి. ఆ నేరం రంగడిమీదకి, చిన్నారావుమీదకి తోద్దామని అనుకొన్నావు. పాముకన్నా విషజంతువి నువ్వు. నువ్వు మెడికల్‌షాపులో పాయిజన్ కొన్నట్టు సాక్ష్యం వుంది. అది నీ తమ్ముడికి ఎక్కించి చంపేసి, పాముకాటు గుర్తులు సృష్టించి మమ్మల్ని మభ్యపెట్టి, తమ్ముడిభార్యతోపాటు, తమ్ముడి ఆస్థి కూడా అనుభవిద్దామని ప్లాను వేసావు.

రంగడు, చిన్నారావులు మీ ఇంటిలోకి ప్రవేశించగానే, నీవు పక్కింటిద్వారా ఫోన్ చేయవచ్చు. కాని అలా చేయక పోలీస్‌స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేశావు పామును పరీక్షి స్తే దానికి కోరలు లేవు, నోరు కుట్టేసి వుంది. అనుమానం వచ్చి ఎంక్వయిరీ చే స్తే నీ పాపం బయటపడింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పరాంకుశం తీవ్రంగా.

శ్రీనివాస్ చేసేదిలేక తల దించుకొన్నాడు.

కాన్‌స్టేబుల్ వీరాస్వామి అతడిని కటకటాల వెనుకకు నడిపించుకు వెళ్ళాడు. □

పోస్ట్‌మాన్ హత్య

చంద్రశేఖర ఆజాద్

ఊరవతల కొండ ప్రక్కన ఓ శవం పడుంది.

అది చాలా భీకరంగా వుంది. శరీరంలో చాలాచోట్ల కత్తిపోట్లు కనిపిస్తున్నాయ్. ఆ శవాన్ని వివిధ కోణాల నుండి ఫోటోలు తీశారు. శవం పడున్న స్థలాన్ని కొలిచారు. రొటీన్ కార్యక్రమాలు జరిగిపోతున్నాయి.

ఎస్.ఐ. జనార్దన్ వెనక్కి తిరిగి కొండను ఆసాంతం పరిశీలించాడు. ఎత్తుగా....గంభీరంగా నిలబడి వుంది.

ఆయన ఒక్కసారి నిట్టూర్చాడు. ఈ కొండకే నోరుంటే ఎన్నెన్ని కథలు చెబుతుందో గదా అనుకున్నాడు.

ఆ కొండ క్రింద శవాలు దొరుకుతుంటాయి వజ్రాల్లా. మనుషులివే కాదు, జంతువులివి కూడా.

* * *

"ఆ శవం కృష్ణాపురం పోస్ట్‌మాన్ వినాయకరావుది సర్. వాళ్ళ బంధువులు శవాన్ని తీసుకువెళ్ళారు" అన్నాడు హెడ్‌కానిస్టేబుల్.

"పోస్ట్‌మాన్‌దా" యథాలాపంగా అన్నాడు ఎస్.ఐ. జనార్ధన్.

"యస్ సర్!"

"అతని కెవరైనా శత్రువు లున్నారేమో?"

"కనుక్కున్నాను సర్. తనకు తెలిసినంతవరకు అతని కెవరూ శత్రువులు లేరని ఆయన భార్య చెప్పింది."

"మరి ఈ హత్య ఎలా జరిగిందంటావ్. దీని వెనుక ఉన్న మోటివ్ ఏమై ఉంటుందంటావ్."

"నాకోటి అనిపిస్తుంది సార్."

"ఏమిటి?"

"ఈ నడుమ ప్రభుత్వం కొన్ని ఆఫీసర్ల ఉద్యోగాలు ప్రకటించింది. వాటి కోసం పరీక్షలు రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారాలు తెప్పించటానికి ఉన్న సమయం చాలా తక్కువ. నా అనుమానం అలాంటివేమైనా మాయం చేస్తే ఏ కుర్రాడన్నా పొడిచేశాడా అని"

"అఫ్‌కోర్స్. ఈ హత్య వెనుక స్త్రీ పాత్ర ఏం లేదు గదా...."

"లేదు సార్. ఆ విషయం గురించి నేను చుట్టుప్రక్కల వారిని అడిగిచూశాను. ఎవరూ అలాంటి అభిప్రాయం వెలి

బుచ్చలేదు."

జనార్ధన్ జేబులోనుండి సిగరెట్ ప్యాకెట్ తీశాడు. సిగరెట్ అందుకొని వెలిగించాడు.

"కృష్ణాపురం పరిధిలోకి వచ్చే రచయిత లెవరైనా ఉన్నారా?" అకస్మాత్తుగా అడిగాడు.

"తెలియదు సార్"

"వెంటనే హెడ్ పోస్టాఫీస్‌లో విచారించు."

"అలాగే" శాల్యూట్ కొట్టి వెనక్కు తిరిగాడు.

"ఇదిగో" పిలిచాడు జనార్ధన్. వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ వెనక్కు తిరిగి వచ్చాడు.

"కృష్ణాపురం ఏరియాకు ఇద్దరు పోస్ట్‌మాన్‌లు ఉంటారు. అందులో ఒకరు రిజిస్టర్ లెటర్స్ ఇస్తుంటారు. వారానికోసారి ఇద్దరూ మారుతుంటారు. కాబట్టి నువ్వా మనిషిని పట్టుకుంటే వివరాలు తెలుస్తాయి. 'బై దిబై' అతని మీద కంప్లయింట్సేమన్నా రికార్డయి ఉన్నాయేమో కూడా తెలుసుకోవాలి."

"యస్‌సర్" అంటూ వెళ్ళిపోయాడతను.

రెండు గంటల తర్వాత తిరిగొచ్చాడు.

"కృష్ణాపురం ఏరియాలో చైతన్య అనే రచయిత ఉన్నాడంట సార్"

"అది అతని పేరేనా?"

కాదు. కలంపేరు. అసలుపేరు రమణమూర్తి"

"ఐ. సీ"

"ఆ పోస్ట్‌మాన్ మీద చైతన్యగారే రెండు మూడుసార్లు కంప్లయింటు ఇచ్చారట. తనకు చెందినవేవీ సరిగా అందటంలేదని"

"ఇంకా ఏమైనా?"

"రిజెన్‌గా ఏం లేకున్నా కొందరు మనిఆర్డర్లు రావటం లేదని వాపోతుంటారట. అంతకుమించి వివరాలేం తెలియ లేదు."

"సరే. ఆ చైతన్యను ఓసారి పిలిపించు."

2

"కమాన్" ఆహ్వానించాడు యస్. ఐ. జనార్ధన్.

చైతన్య లోపలకు వచ్చాడు.

"టీసేజెడ్"

"థాంక్యూ" అంటూ ఎదురుగా కూర్చున్నాడు.

"మీ రచనలు ఏ పత్రికల్లో వస్తుంటాయ్."

"ఎక్కువగా తిరిగొస్తుంటాయ్"

"అదేం"

"నా రచనలు వాస్తవికంగానూ, ముక్కుకు సూటి గానూ ఉంటాయి. అందుకే మన పత్రికలు వాటిని ప్రచు రించవు. నా అభిప్రాయాలతో ఏ మేరకయినా ఏకీభవించే వారే వాటిని ప్రచురిస్తారు. ఆ పుస్తకాల పేర్లు మీరు విని ఉండకపోవచ్చు" అన్నాడు చైతన్య.

"యూ మీన్....మీరు విప్లవ రచయితలా?"

"నో....నేను మామూలు రచయితనే. నన్నెందుకు పిలిచారో తెలుసుకోవచ్చా?"

"కృష్ణాపురం ఏరియా పోస్టమాన్ చచ్చిపోయాడు. మీకు తెలుసా?"

"అరెరే. నాకు తెలియదే" అన్నాడు సానుభూతిగా.

"ఏమైనా సంతాపసభ ఏర్పాటు చేస్తున్నారా. మంచిదే. పోస్టుమాన్ ప్రజా సేవకుడు. అతన్ని గౌరవించటం మంచి సంప్రదాయమే" అన్నాడు.

జనార్ధన్ చైతన్యవంక పరిశీలనగా చూస్తూ అన్నాడు.

"అతను హత్య చెయ్యబడ్డాడు"

"నిజమా" నమ్మలేనట్లు అడిగాడు చైతన్య.

"యస్"

"అందులో ఎవరు. ఇద్దరున్నారుగా"

"వినాయకరావు"

కొంచెంసేపు నిశ్శబ్దం.

"ఈ విషయంలో మీకు నా మీద అనుమానం ఉందా లేక మరేమైనా సమాచారం కోసం పిలిచారా" సూటిగా అడిగాడు చైతన్య.

ఈసారి జనార్ధన్ ఆశ్చర్యపోయాడు.

"ఫ్రాంక్‌గా ఉండటం నా పద్ధతి" తిరిగి చైతన్య అన్నాడు.

"వెల్. అతని గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"అతని గురించి నా అభిప్రాయం ఎలాంటిదైనా అతనిప్పుడు లేడుగదా!"

"అఫ్‌కోర్స్. అతని గురించి ఓ అంచనాకు రావటానికి సహకరిస్తుందేమోనని"

"అతను పోస్టుమాన్‌కంటే జేబులు కొట్టే కార్యక్రమంలో బాగా సక్సెస్ అవగలడని నా అభిప్రాయం"

"యూ మీన్"

"అవును. పోస్టుమాన్ అనేవాడు ప్రభుత్వోద్యోగి. తను చేసిన పనికి జీతం పుచ్చుకొంటున్నాడు. అయినా ఆ ఉద్యోగంలో ఓ బాధ్యత ఉంది. అతను తెచ్చే వార్తలు సంతోషంగా, విషాదంగా, రకరకాలుగా ఉంటాయ్. అన్ని రకాల అనుభూతుల్ని కలిగించే ఈ కార్యక్రమాన్ని వాళ్ళే బాధ్యతతో నిర్వహించాలి. జీతాలు చాలకుంటే ప్రభుత్వంతో పోరాడాలి. అంతేగాని దరిద్రులు జనం సొమ్ము కాజేయ

టం ఏమిటీ?"

"మీ కెప్పుడయినా అతన్ని చంపాలన్నంత కోపం వచ్చిందా?"

"రెండు మూడుసార్లు వచ్చింది. నాకు రావలసిన పత్రికలు రాలేదు. అందులో కాంప్లిమెంటరీ కాపీలున్నాయి. వాటి సంగతి వదిలెయ్యండి. ఓ పత్రిక్కి నేను చందా కట్టాను. అవి కూడా సరిగా అందలేదు. అడిగితే కేర్‌లెస్‌గా సమాధానం ఇచ్చాడు. వెంటనే గొంతు పిసికి పారేయా లన్నంత కోపం వచ్చింది. వాడి మూలంగా నాకో ఎడిటర్ గారితో అభిప్రాయ భేదాలొచ్చాయి. అంత మాత్రాన వీడ్ని హత్య చేసేంత మూర్ఖుడ్ని కాదు. ఈ అంటువ్యాధి వినాయకరావుకే పరిమితం కాదు. దేశంనిండా ఇలాంటి బాపతులున్నారు. ఈరోజు వాడ్ని చంపితే రేపు ఇంకొకడు వస్తాడు. వాడ్ని....మరొకడ్ని చంపలేనుగా. మహా అయితే ఓ పనిమాత్రం చెయ్యగలను."

జనార్ధన్ ఆసక్తిగా వింటున్నాడు.

"ఇలాంటి బాపతు జనాన్ని విమర్శిస్తూ ఓ కథ రాయ గలను. అంతే" అన్నాడు చైతన్య.

జనార్ధన్ బిగ్గరగా నవ్వుతూ తన ముందున్న బెల్ మ్రోగించాడు. ఎవరో వచ్చారు.

"రెండు స్ట్రాంగు కాఫీ"

"ఎవరో చంపారో కానీ దారుణంగా చంపేశారు. వళ్ళంతా కత్తిపోట్లు. చంపి ఊరవతల కొండ క్రింద పడే శారు." అన్నాడు యస్.ఐ. జనార్ధన్.

"మీకెలా తెలిసింది"

"ఎవరో ఫోన్‌చేసి చెప్పారట. ఏదిఏమైనా అతని మీద బాగా కసి ఉండి ఉంటుంది."

"కపి ఉంటేనే హత్యలు జరుగుతాయి?" అన్నాడు చైతన్య చిన్నగా నవ్వుతూ.

"నో....నో....హత్యలకూ కపికి సంబంధం లేదు. మామూలుగా కూడా కొన్ని హత్యలు జరుగుతుంటాయి. కాఫీ తీసుకోండి" అన్నాడు జనార్ధన్ అప్పుడే వచ్చిన టీ స్టాల్ కుర్రాడి నుండి కాఫీ అందుకుంటూ.

"అయితే చాలా కేసుల్లో కపి ప్రాధాన్యం ఉంటుంది లెండి" అంటూ రెడ్ విల్స్ సిగరెట్ పెట్టె చైతన్య ముందుకు త్రోశాడు.

"థాంక్స్" అని సిగరెట్ తీసుకున్నాడు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించుకున్నారు.

"నాకు తెలిసిన పోలీసు అధికారుల్లో ఇంత సాఫ్ట్‌గా మిమ్మల్నే చూశాను."

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్" అని నవ్వుతూ. "సాహిత్యం అంటే నాకూ ఇష్టమే" అన్నాడు జనార్ధన్.

"మీరేమైనా రాస్తుంటారా?"

"అఫ్‌కోర్స్"

"ఏ పత్రికల్లో అయినా వస్తున్నాయా?"

జనార్ధన్ ఒక్క క్షణం తర్వాత మెల్లగా అన్నాడు.

"నా రచనలు కూడా పత్రికలు వేసుకోవు"

చైతన్య స్తబ్ధుడయ్యాడు.

"మరి శెలవు ఇప్పిస్తారా?"

"అలాగే"

"మరోసారి కలుసుకుందాం"

చైతన్య లేచాడు.

జనార్ధన్ ఆప్యాయంగా చేతిని నొక్కి వదిలాడు.

"నేను 'కొండ క్రింద శవం' అనే కథ రాస్తున్నాను"

"దానికి ముగింపు" అంటూ ఆగాడు జనార్ధన్.

"మీరు చెప్తారు" అనేసి వెళ్ళిపోయాడు చైతన్య.

3

"పోస్టుమాన్ హత్య" అని దినపత్రికల లోపలిపేజీల్లో ఓ కాలమ్ దాటనివార్త వచ్చింది. కృష్ణాపురం ఏరియా పోస్టుమాన్ శ్రీ వినాయకరావును ఎవరో దారుణంగా హత్యచేసి ఊరవతల కొండక్రింద పడేశారు. యస్. ఐ. జనార్ధన్ దర్యాప్తు చేస్తున్నారు అంటూ ప్రచురించారు.

రెండు నెలలు గడిచాయి. ఆ కేసు ముందుకు సాగలేదు. అందుకు అంతకంటే ముఖ్యమైన కేసులు ఆ సమయం లోనే రంగంలోకి రావటం ఓ కారణం. దాదాపు పోలీసులు ఆ కేసు గురించి మరిచిపోయారు. పెండింగులో ఉన్న వందలాది కేసుల్లో అదొకటి అయింది.

ఓ రోజు యస్. ఐ. జనార్ధన్ తిరిగి చైతన్యను పిలిపించాడు.

"మీ కథకు ముగింపు లభించింది"

"హంతకుడు దొరికాడా?" ఆత్రంగా అడిగాడు.

జనార్ధన్ తన టేబుల్ సొరుగులాగి ఓ లెటర్ చైతన్య కిచ్చాడు. చైతన్య చదవటం ప్రారంభించాడు.

"యస్. ఐ. గార్కి,

కొండ క్రింద శవం గురించి మీ డిపార్టుమెంటు ఈ సరికి మరిచిపోయే ఉంటుంది. ఆ ఫైలు మూసే ఉంటారని నాకు తెలుసు. అయినా ఈ లేఖ మీకు రాయటానికో కారణం ఉంది. ఆ శవం పోస్టుమాన్లకూ, ఆ డిపార్టు మెంటు వారికి ఓ హెచ్చరికగా ఉండాలి. అందుకే ఈ లేఖ మీతో పాటు పత్రికలన్నింటికీ రాస్తున్నా.

తొలిసారిగా ఈ వినాయకరావు పబ్లిక్ సర్వీసు కమీషన్ నుండి నాకు వచ్చిన అప్లికేషన్ ఫారం మాయం చేశాడు. తిరిగి తెప్పించుకోవటానికి గడువు పూర్తయింది. అప్పట్లో నేను చదువుకుంటున్నాను. అందుకే అంతగా పట్టించుకోలేదు.

ఆ రోజుల్లోనే నేనో అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి కూడా నన్ను గాఢంగా ప్రేమించింది. మా వివాహానికి అంగీకారం లభించినా, లభించకపోయినా మేం లక్ష్యపెట్ట దలచుకోలేదు. ఆ అమ్మాయి తన బంధువుల ఇంట్లో ఉండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తోంది. ఈ విషయం వాళ్ళ ఇంటిలో తెలిసింది. సెలవులకు ఇంటికి వెళ్ళిన ఆమె తిరిగి రాలేదు. వారం రోజుల్లోనే ఆమె పెళ్ళికి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. అప్పుడు ఆ అమ్మాయి ఎలాగో తంటాలుపడి ఈ విషయం తెలియచేస్తూ వెంటనే రమ్మని రాసింది.

ఆ ఉత్తరం నాకు అందలేదు.

వినాయకరావు దాహానికి పుస్తకాలూ, మనిఆర్డర్లు, పార్శిల్లే కాదు ప్రేమికుల ఉత్తరాలు కూడా ఆహుతయ్యాయ్. నన్నో మోసగాడుగా భావించి ఇష్టంలేని వివాహానికి బలవంతంగా మెడలు వంచింది. మెడలో ఉరితాడు పడింది. తర్వాతెప్పుడో ఈ విషయం తెలిసింది. నా జీవితంతో ఆడుకున్నాడు వినాయకరావ్.

ఈ ప్రపంచమంతా శూన్యం అనుకుంటున్న నాకు లభించిందో కలం స్నేహితురాలు. ఇంగ్లండు నుండి ఆమె తరచుగా లెటర్స్ రాస్తుండేది. వాటిల్లో భారతదేశాన్ని దర్శించాలనే ఆరాటాన్ని వ్యక్తం చేస్తుండేది. ఆమె నా పూర్తి వివరాల్ని తెలుసుకొంది. ఓసారి లెటర్ రాస్తూ, మీ

పుట్టినరోజుకు, మీరూహించని ఓ అద్భుతమైన కానుక పంపుతున్నానంటూ రాసింది.

నా పుట్టినరోజు వచ్చింది. ఆమె గ్రీటింగ్స్ మాత్రం తర్వాతెప్పుడో అందాయి. ఆమెకు లెటర్ రాస్తూ మీకానుక సంగతెలా ఉన్నా కనీసం మీరు లెటరయినా రాస్తే బాగుంటుంది అని రాశాను. తిరుగుటపాలో వచ్చింది జవాబు ఘాటుగా. ఆ లెటర్ నాకు వినాయకరావు ఇవ్వలేదు. వాడు సెలవులో లేకుంటే అది కూడా మిస్సయ్యేదేమో? అందులో ఆమేం రాసిందో తెలుసా? వాళ్ళ దేశంలో ఇండియన్స్ పట్టి మోసగాళ్ళు....కక్కుర్తిగాళ్ళు అనుకుంటారట. అందుకే ఆ కానుక అందినా అలా రాస్తున్నానంటూ నిందించింది. అందులో ఆమేం పంపిందో తెలియదు. భారతదేశంలోని ఇన్ని కోట్లమందిని ఆమె దొంగలుగా చిత్రీకరించింది.

అందుకు కారణం ఓ వినాయకరావు....మరో వెంకట్రావ్....నేను ఎవరికీ కంప్లయింటు ఇవ్వలేదు. పోస్టల్ వారు నా జీవితంతో ఆడుకుంటున్నారు. నాలో ద్వేషం పెరిగిపోసాగింది. వినాయకరావును నా స్వహస్తాల్తో పొడిచి చంపిన రోజుకు సరిగ్గా రెండు రోజులక్రితం నా తొలి స్నేహితురాలు కిరసనాయలు పోసుకొని ఆ మంటల్లో చచ్చిపోయింది. అందుకే వినాయకరావుకు ముక్తి ప్రసాదించాలనుకున్నాను. ఆ రోజు ఊరవతలకు తీసుకెళ్ళి చంపేశాను.

నేను ఊహించినట్లు ఈ హత్య బాగా ప్రచారం జరగలేదు. పత్రికలు ఆ వార్తను ఏదో మూల వేశాయి. ఈ లెటర్తో పాటు పోస్టల్ డిపార్టుమెంటువారి చాకచక్యం గురించిన కటింగ్స్ పంపుతున్నాను. ఈ హత్య అలాంటి వ్యక్తులకో హెచ్చరికగా ఉండాలి.

వినాయకరావులాంటి వారికో హెచ్చరిక!

మీ పద్ధతులు మార్చుకోండి. లేకుంటే ఎవరి జీవితాలతో మీరు ఆడుకుంటారో వారి చేతుల్లోనే నాశనం అవుతారు!

చివరిగా నన్నుపట్టుకోవాలని ప్రయత్నించకండి. అది సాధ్యంకాదు కూడా. ఎందుకంటే....నన్నెవరూ పట్టుకోని చోటుకు నేను వెళ్ళిపోతున్నాను.

అభాగ్యుడు
మనోహర్."

ఆ లెటర్‌తోపాటు కొన్ని పేపర్ కటింగ్స్ ఉన్నాయి.

"ఇన్స్యూర్డ్ పార్శిల్లో డబ్బు గల్లంతు"

"బట్టల బదులు గడ్డి"

"ఇరవై సంవత్సరాలకు చేరిన ఉత్తరం"

"అయిదు సంవత్సరాల తర్వాత చేరిన అప్పాయింట్‌మెంట్ ఆర్డర్" ఇంకా చాలా చాలా ఉన్నాయ్.

చైతన్య, జనార్ధన్‌వంక చూశాడు.

"విత్ యువర్ పర్మిషన్" అంటూ అతని ముందున్న తెల్లకాయితం అందుకొని ఏదో రాసిఇచ్చాడు.

"నా కథ ముగింపు అది" అన్నాడు.

యస్.ఐ జనార్ధన్ చదివాడు.

"మనోహర్ లేఖను పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయ్.

దేశంలోనే ఇదో సంచలన వార్త!

అయినా....

రచయితలకు బుక్స్ అందటంలేదు!

పార్శిళ్ళలో వస్తువులు మాయం అవుతున్నాయ్!

మారుతున్నాయ్!

మనిఆర్డర్లు సైతం గల్లంతవుతున్నాయ్!" □

కె.వి.రమణ

టక్కరి పులి

సుమారు వంద సంవత్సరాల క్రిందటిమాట. ఈ నాటికీ కాకులు దూరని కారడవులకు ప్రసిద్ధి గాంచిన శ్రీకాకుళ మన్యప్రాంతానికి జమీందారు రాజాప్రసాద్ చంద్ర నాడు మకుటంలేని మహారాజు.

వేట ప్రసాద్‌చంద్రకు రెండో ప్రాణం.

ఆరోజు వేకువజామునే లేచి ఎప్పటిలా వ్యాయామం పూర్తి చేసుకున్నాడు ప్రసాద్ చంద్ర. తూర్పు తెల తెల వారుతుండగా ఒంటరిగా నదీతీరంలో కొద్దిసేపు తుపాకితో ప్రాక్టీసుచేసి, నదిలో స్నానంచేసి, తన నివాసానికి తిరుగు ముఖంపట్టాడు. ఇది ప్రతిరోజూ ప్రసాద్‌చంద్ర దిన చర్యలలో ఒక భాగం.

ప్రసాద్‌చంద్ర తన మహల్ చేరేసరికి సిద్ధంగావున్నాడు శివయ్యదొర. శివయ్యదొర వచ్చాడంటే వేట తెచ్చాడన్న మాటే! ఏదో పెద్ద విశేషమే లేకపోతే శివయ్యదొర అంత పెందలాడే తన గూడెం వదలి రాడని ప్రసాద్‌చంద్రకు తెలుసు.

రెండు చేతులూ ఎత్తి వినయంగా "దండాలు దొరా!" అంటూ నమస్కరిస్తున్న శివయ్యదొర భుజంమీద ఆప్యాయంగా చేయివేసి "శివయ్యదొరా! క్షేమమా! ఏమిటి విశేషం" అన్నాడు రాజాప్రసాద్‌చంద్ర వుత్సాహంగా.

ఆ మాటతో అంతవరకూ నవ్వులు వెదజల్లుతున్న శివయ్యదొర మొహం ఒక్కసారిగా వివర్ణమయింది. పెద్దగా నిట్టూరుస్తూ "ఏం చెప్పను రాజా! మా ప్రాంతాలకు ఏడనుండి దాపురించెనో ఆ పెద్దపులి. నేటికి నలుగురు మనుషుల్ని పొట్టనబెట్టుకున్నది. పశువుల మాట సరేసరి. అంతేకాదు రాజా! ఇదేం విచిత్రమో! మృగమయితే మనుషుల్ని పశువుల్ని పొట్టనబెట్టుకుంటది మరి ఇదెక్కడి మాయదారి మెకమో వాటితోబాటు మేకలూ మా పంటలు సయితం పొట్టబెట్టుకుంటున్నది. కాకుంటే పాడుచేస్తున్నది. మేం దీనితో అన్నిందాలా నష్టపోతున్నాం దొర!

ఈ మెకు చిక్కదు! అమ్మకు అందదు! మహామాయల

మారి! ఏ తావున వస్తదో ఎట్ట తిరుగుముఖం పడతదో త్రినేత్రుడికే ఎరుకగాదు. తమరు తక్షణమే దయచేసి ఎట్టనో దారిచూసి దాని పనిపట్టాల" ఆవేదనగా చెప్పాడు శివయ్యదొర.

శివయ్యదొర మాటల్నిబట్టి పెద్దపులి వారిని యెంతగా కలవరపెడుతున్నదీ అర్థం చేసుకోగలిగాడు ప్రసాద్ చంద్ర.

శివయ్యదొర మన్యంలో పుట్టిపెరిగిన కోయబిడ్డ. సాహసానికీ, గుండెనిబ్బరానికీ శివయ్యదొర సాటిలేని మనిషి. అందుకే అతడు తనజాతికి నాయకుడు కాగలిగాడు. కేవలం చేతికర్రతో క్రూరమృగాల్ని శివయ్యదొర లొంగదీసుకోడం ప్రసాద్ చంద్ర కళ్ళారా చూపిన సందర్భాలు బోలెడు. అటువంటి శివయ్య దొరనే ఇంతగా బెంబేలు పెడుతున్నదంటే ఆ పెద్ద పులి సామాన్యమైనది కాదనీ, అతడు చెప్పినట్టుగానే అది మహా మాయలమారి అనీ గ్రహించాడు ప్రసాద్ చంద్ర.

వేట ఏర్పాట్లు పూర్తిచేసుకొని తాను మరుదినమే రాగలనని శివయ్యదొరకు మాటిచ్చాడు ప్రసాద్ చంద్ర. శివయ్యదొర విల్లమ్ములు ధరించి తన అనుచరులిద్దరూ వెంటరాగా మన్యందారి పట్టాడు సంతోషంగా.

మరుసటిరోజు సూర్యోదయం కాక మునుపే తుపాకి చేతబట్టి జీపులో ఒంటరిగా బయలుదేరాడు ప్రసాద్ చంద్ర.

గూడెంవద్ద శివయ్యదొరను కలిసేందుకు వెళ్ళిన ప్రసాద్ చంద్రకు పాడెమీద సిద్ధంగా వుంచబడిన అతని శవం దర్శనమిచ్చింది.

ఊహించని ఈ హఠాత్సంఘటనకు దిగ్భ్రాంతుడై దిక్కు తోచనివాడిలా నిలబడిపోయిన ప్రసాద్ చంద్రవద్దకు

అంతకు ముందురోజు శివయ్యదొర వెంట వచ్చిన యువకు లిద్దరూ యేడుపు మొహాలతో వచ్చి "చూస్తివా దొరా! ఆ రాక్షసి మెకం యెంతపని చేసిందో?" అన్నారు.

శివయ్యదొర పులివాతబడి మరణించాడన్న సంగతి విని ప్రసాద్ చంద్ర మరింత బాధపడ్డాడు.

"ఎలా జరిగిందిది!" దుఃఖాన్ని దిగమింగి వణికే స్వరంతో అడిగాడు ప్రసాద్ చంద్ర.

యువకులిద్దరిలో ఒకడు ముందుకొచ్చి "నిన్న మీతో మాటాడి మేం తిరిగి గూడెం పొలిమేరల కొచ్చేసరికి ఎండ బాగా తగ్గి కనుమాపుగా వుంది దొరా! శివయ్యదొర మా కంటే రెండడుగులు ముందున్నాడు. ఇంతలో చడీ చప్పుడు లేకుండా పొదలమాటునుండి పెద్దపులి ఒక్కసారిగా శివయ్యదొరమీదకు వురికింది. పంజాతో దొర తలమీద ఒకే దెబ్బ కొట్టి మమ్మల్ని చూచి క్షణంలో పొదల్లో పడి మాయమయ్యింది" అంటూ బావురుమన్నాడు.

ఆసరికి జనమంతా ఒకరొకరే ప్రసాద్ చంద్ర చుట్టూ చేరారు. అందరి కళ్ళల్లోనూ ఒకే రకమయిన నీలి నీడలు స్పష్టంగా అగుపిస్తున్నాయి. ఏ క్షణంలో ఆ మహమ్మారి పెద్దపులి ఎటునుండి తమపైకి దూకుతుందో ననే బెంగ అందర్నీ పట్టి పీడించసాగింది,

ఆరున్నర అడుగుల ఎత్తూ మెలితిరిగిన కండలూ కలిగి కోరమీసాలతో రాజసం వుట్టిపడుతున్న రాజాప్రసాద్ చంద్ర వారి కళ్ళల్లో ఆశాజ్యోతిగా నిలిచాడు. వారంతా అతడు చెప్పే మాటలకోసం ఆత్రుతగా ఎదురు చూడసాగారు.

రాజాప్రసాద్ చంద్ర చేతిలో తుపాకీ, నోటిలో మాటా ఎన్నడూ గురి తప్పవని వారికి బాగా తెలుసు.

ప్రసాద్ చంద్ర వారందరినీ తప్పించుకుంటూ శివయ్యా దొర శవాన్ని సమీపించాడు. శివయ్యాదొర ప్రసాద్ చంద్ర ఇంచుమించు ఒకే వయసు కలిగినవాళ్ళు. శివయ్యాదొరను దాదాపు ఇరవై ఏళ్ళుగా ఎరుగునతడు.

బలిమీ చెలిమీ కలబోసిన మనిషి శివయ్యాదొర.

స్నేహితుడి అకాల మరణానికి అశ్రువులు రాలుస్తూ "దొరా! నీ మరణానికి కారకురాలయిన ఆ పులి ఈ అడవిలో ఏ మూల దాక్కున్నా విడిచేది లేదు" అన్నాడు వుద్వేగం నిండిన కంఠంతో.

శివయ్యాదొర అంత్యక్రియలను వారి ఆచారం మేరకు దగ్గరుండి జరిపించాడు ప్రసాద్ చంద్ర.

పులివేటలో ప్రసాద్ చంద్రకు తోడుగా వచ్చేందుకు కొందరు కోయ యువకులు సిద్ధమయ్యారు. కానీ ప్రసాద్ చంద్ర వారి నెవరినీ తనవెంట వచ్చేందుకు అనుమతించక వేట సరంజామాతో జీపులో తానొక్కడే అడవిలోకి బయలుదేరాడు.

పులి వన్యమృగాలలో కెల్లా సాహసిక ప్రాణి. అటువంటి సాహసిక జీవిని వేటాడడం మరింత సాహసికచర్య.

పులిని గురిచూసి కొట్టడం కన్నా దానిని బరిలోకి నెట్టడం చాలా శ్రమతో కూడినపని. దానికి ఎంతో నేర్పూ ఓర్పూ కావాలి. పులి విషయమై చెప్పే ఎన్నో మాటల్లో ఒకటి ఏమిటంటే: పులిచేత చంపబడిన మనుషుల ఆత్మలు దానిపై స్వారీచేస్తూ పులిని జాగ్రత్తగా నడిపిస్తుంటాయట!

ఈ మాట నిజమయినా అబద్ధమయినా పులిని గురించి వాస్తవాలను తెలిసినవారు మాత్రం దానికి అన్ని తెలివి తేటలూ వున్నాయనే చెబుతారు!

పులివేటలో వేటగాడు చాలా విషయాలను పరిగణన

లోకి తీసుకుంటాడు. పులి దాదాపు రెండుమూడు రోజులుగా ఏ ప్రాంతంలో సంచరిస్తున్నదీ ముందుగా ఆరా తీయాలి.

ఈ విషయంలో పులి నేలమీద నడిచేటపుడు ఏర్పడే పాదాల గుర్తులు వేటగాడికి ఎంతగానో వుపయోగపడతాయి. అంతేకాదు: ఈ గుర్తులద్వారా పులి పాదాల మధ్య దూరం కొలిచి దాని పొడవూ, గుర్తులు ఏర్పడిన లోతును బట్టి దాని బలాన్నీ వేగాన్నీ అంచనా వేస్తారు.

పులి సంచరించే ప్రాంతాన్ని ఈ విధంగా అంచనా వేసుకున్న తర్వాత ఆ ప్రాంతంలో ఒక ఎత్తయిన స్థలాన్ని చూసుకోవాలి. ఇందుకోసం సాధారణంగా ఏ ఎత్తైన చెట్టునో గుట్టనో ఆశ్రయిస్తాడు వేటగాడు. ఆ ప్రాంతాలలో ఇవేవీ కుదరని పరిస్థితుల్లో మాత్రమే కర్రలతో ఎత్తైన వేదికలాంటి మంచెను నిర్మిస్తారు.

ఎందుకంటే పులి తను నిత్యం సంచరించే ప్రాంతాలలోని అసహజత్వాన్ని ఇట్టే గమనించడంలో కడునేర్పరి. ఈ విషయంలో ఏమాత్రం సందేహానికి తావున్నా అది ఆ ఛాయలకే మరి పోదు.

ఇలా ఓ అనువయిన అందుబాటులో వుండే విధంగా రప్పించేందుకు నేలమీద ఓ మేకనో ఆవునో కడతాడు వేటగాడు. ఆ కట్టడం కూడా పులికి అనుమానం వచ్చే రీతిలో వుండకూడదు. అడవిలో మేకల్ని ఆవుల్ని కట్టే పనిని మనుషులు కేవలం తనకోసమే చేస్తారని పులికి బాగా తెలుసు.

నోటికి అందిన ఆహారాన్ని కక్కుర్తిగా గుటుక్కుమనిపించేద్దామనే ఆదుర్దా పులికి ఎంతమాత్రం వుండదు. ఆహారాన్ని సంపాదించుకోవడంలో కఠిన నియమావళిని అది తూ.చ. తప్పకుండా ఆచరిస్తుంది.

ఆ కారణంగా పులిని ఆకర్షించేందుకు వుంచిన జంతువును తనకు అందుబాటులో వుండేట్టుగా ఏ పొదల చేరువనో దాని కొమ్ములకో కాళ్ళకో తీగెలతోనో నేర్పుగా బంధించాలి. చూచేవాళ్ళకు ఆ జంతువు పొదల్లో మేస్తూ పొద పాటున తీగెలకు చిక్కుకుపోయినట్లు కనిపించాలి.

ఇన్ని జాగ్రత్తలూ తీసుకొని వేటగాడు చిటుక్కుమనే శబ్దంకూడా చేయకుండా పులికోసం కళ్ళల్లో వత్తులు పెట్టుకొని మరీ కాపుకాయక తప్పదు. ఇందుకుగానూ సమయం గంటలే కావచ్చు రోజులు దొర్లిపోవచ్చు. ఇంతా చేసాక పులి ఎటువంటి నోటీసూ లేకుండా తన నివాస ప్రాంతాన్ని మార్చుకోవచ్చు! అపుడు కథ రెడ్డిగారు రాలేదు తిరిగి మొదలుపెట్టండని తిరగబడుతుంది!

వేటకు కావలసిన జాగ్రత్తలన్నీ తీసుకొని గుబురు కొమ్మల మాటున చెట్టుమీద స్థిరంగా కూర్చున్నాడు ప్రసాద్ చంద్ర. అతడి చూపులు తదేతంగా పొదలకు నేర్పుగా బంధింపబడి వున్న మేకమీదనే నిలిచివున్నాయి. మేక ఆ బంధంనుండి విడివడేందుకు విఫలయత్నం చేస్తూ అదే పనిగా అరుస్తోంది.

సాయంత్రం చీకటి పడే వేళ ప్రసాద్ చంద్ర చెట్టుమీద మాటువేసి అప్పటికి ఆరేడు గంటలు గడిచాయి.

వున్నట్టుండి ఎవరో నోరు నొక్కినట్టుగా మేక అరుపులు టక్కున ఆగిపోయాయి. చెవులు విచిత్రంగా రిక్కించి ఏదో కొత్త విషయం కనిపెడుతున్నట్టు కొద్దిసేపు అలాగే వుండిపోయింది మేక. ఆనక అదేమిటో అర్థమయినట్టు గజగజలాడుతూ కట్టు వదిలించుకునేందుకు తీవ్రంగా పెనుగులాడసాగింది.

కళ్ళు చిట్లించాడు ప్రసాద్ చంద్ర. పొదలు రెండడుగు

లకు మించి ఎత్తులేవు. ఎక్కడా ఎటువంటి అలికిడీలేదు. మరి మేకలో కానవచ్చే మార్పుకు కారణమేమిటి?

ప్రసాద్‌చంద్ర ప్రశ్నకు జవాబు కొద్ది క్షణాల్లోనే లభించింది. తళుక్కున మెరిసి మాయమయ్యే వురుములేన్ని మెరుపులా పెద్దపులి పొదల వెనుకనుండి మేకపైకి దూకుతూ దానిని నోట కరచుకొని తిరిగి అదే వేగంతో వెనక్కి దూకి చెట్లుమాటున పారిపోయింది.

ఇదంతా జరిగేందుకు కన్నుమూసి తెరిచేంత వ్యవధి కూడా పట్టలేదు. పులి చాకచక్యానికీ వేగానికీ నివ్వెర పోయాడు ప్రసాద్‌చంద్ర.

సుమారు ఆరడుగుల పొడవూ రెండున్నర అడుగుల ఎత్తులో నునుపు తేలివుంది పులి. అంత బారు శరీరాన్ని రెండడుగుల ఎత్తు కూడా పూర్తిగా లేని ఆ పొదలచాటున ఇంత పిసరు కూడా కనపడని విధంగా నక్కుతూ రాగలిగిన దాని చాకచక్యాన్ని అభినందించకుండా వుండలేక పోయాడు ప్రసాద్‌చంద్ర.

ఏదయితేనేం ఇంతవరకూ పడ్డ శ్రమంతా వట్టి దండగ. వుసూరుమంటూ చెట్టుదిగి గూడెందారి పట్టాడు ప్రసాద్‌చంద్ర.

మరుసటి రోజు అదే స్థలంలో మరో మేకను కట్టి చెట్టెక్కాడు. అయినా పులి వస్తుందనే నమ్మకం మాత్రం అతనిలో లేదు. పులి తనను గమనించిందా? గమనించే వుంటుంది. అందుకే అంత చాకచక్యం ప్రదర్శించి తన కళ్లు కప్పింది.

ఆ రోజంతా వేచివున్నా పులి అయిపులేదు. రెండో రోజు కూడా గడుస్తూ సాయంత్రం కావస్తోంది. వేటగాడికి నేర్పుకంటె ఓర్పు ముఖ్యం. పులి ఆ ప్రాంతం

వీడిచి మరో చోటికి పోయిందనే విషయం రూఢిగా తేలే వరకూ ఆ స్థలంలోనే కాపు వేయదలిచాడు ప్రసాద్‌చంద్ర.

సరిగ్గా మొదట పులివచ్చిన సమయం కావచ్చింది. ప్రసాద్‌చంద్ర మూత పడుతున్న కనురెప్పల్ని బలవంతాన తెరచి వుంచుతున్నాడు. అప్పటికి మూడు రోజులుగా అతనికి సరయిన నిద్రాహారాలు లేవు.

ఇంతలో ప్రసాద్‌చంద్ర ఆశ్చర్యపోయేట్టుగా చెట్ల మధ్యనుండి పులి ధీమాగా నడుస్తూ వచ్చి మేక ప్రక్కన వెనక కాళ్ళపై కూర్చుంది. బోరవిరుస్తూ ప్రసాద్‌చంద్ర కూర్చున్న వేపు చూడసాగింది. మేక ఆ చోటునుండి తప్పించుకునేందుకు పొదలతో కుస్తీపట్టడం పులి అసలు పట్టించుకోనేలేదు.

పులిచర్య ప్రసాద్‌చంద్రను అయోమయంలో పడ వేసింది. సందేహంలేదు! పులి తనను సవాల్ చేస్తున్నది! తన వేపే చూస్తూ తన కదలికలను గమనిస్తున్నది.

తనలోని కదలిక తనకే తెలియనంత నెమ్మదిగా తుపాకీ సర్దుకున్నాడు ప్రసాద్‌చంద్ర. అయినా ఆ సంధ్య వెలుతురులో దాని నేత్రాలు ఓరగా కదిలాయి.

ఒక్కసారిగా "ఢాం" అంటూ పేలింది తుపాకీ. పులి అంతకు మించిన వేగంతో గాలిలో పల్టీకొడుతూ దబ్బున నేలమీద పడింది

ఐదు నిముషాలు పులివంకే చూస్తూ వుండిపోయాడు ప్రసాద్‌చంద్ర. పడినచోటునే చలనరహితంగా వుండి పోయింది పులి. గాఢంగా నిట్టూర్చాడు ప్రసాద్‌చంద్ర.

ఎడమచేతిలో తుపాకీ పట్టుకొని చెట్టుదిగి పులికి చేరువగా వెళ్ళాడు. పులి తోకను కాలితో ప్రక్కకు ఒత్తిగించాడు.

అంతే! ఒక్క వుదుటున గాండ్రిస్తూ పైకి ఎగిరి ప్రసాద్‌చంద్ర చేతిలోవున్న తుపాకీ మీదకు పంజా విసిరింది పులి. ఆ కనుమాపు చీకటిలో అల్లంత దూరాన పొదల్లో పడింది డబుల్‌బారల్ గన్.

వూహించని ఈ పరిణామానికి ఒక్కసారిగా నిర్ఘాంత పోయాడు రాజా ప్రసాద్‌చంద్ర. ఒక జంతువులో అంతటి టక్కరితనం అందునా పులిలాంటి జంతువు విషయంలో నమ్మశక్యం కానిది.

తుపాకీని వెదకి పట్టుకునే సమయంలేదు. పులితో బాహా బాహి పోరాటం తప్పదని గ్రహించాడు ప్రసాద్‌చంద్ర. చేతిలో చిరుకత్తయినా లేదు.

అంతలోనే పులి విసిరిన పంజా దెబ్బనుండి లాఘవంగా ప్రక్కకు తప్పుకున్నాడు ప్రసాద్‌చంద్ర. పులి ఆ విసురులో ప్రక్కకు ఒత్తిగిలి పడింది నేలపై. ప్రసాద్‌చంద్ర ఏ మాత్రం వెనుకంజ వేయక జబ్బలు చరుస్తూ పులిని ఎదుర్కొన్నాడు.

ఒకరు పులిబిడ్డ! మరొకరు రాచబిడ్డ!

ఒకరికి ఒకరు తీసిపోని విధంగా జరిగిన ఆ పోరు అలా దాదాపు గంటసేపు సాగింది.

ఈ సమయంలో ప్రసాద్‌చంద్ర పులి ముందు కాళ్ళు రెంటినీ విరిచి దవడలు చీల్చి వేరు చేసేసాడు. పులి గాండ్రింపులు మాని నిర్జీవంగా కూలబడిపోయింది.

ప్రసాద్‌చంద్ర పరిస్థితి కూడా తీవ్రంగానే వుంది. శరీరమంతటా గాయాల మూలంగా రక్తం విపరీతంగా పోసాగింది. కళ్ళు మూతలు పడుతుండగా చచ్చిన పులి మీద ఒరిగిపోయాడు. □

బి.రాజేశ్వరి

ఎంత మోసం!

"సాయంత్రం తొందరగా వచ్చేస్తారు కదూ!" అప్పటికి అయిదోసారి భర్తను హెచ్చరించింది విశాల.

"మాటతప్పుతాననుకున్నావా? మనం మాటంటే మాటే! ఇవ్వకపోవాలేగాని యిచ్చాక తప్పే ప్రసక్తి లేదు!" షర్టు

చేతులు మడతపెట్టుకుంటూ భుజంమీదుగా తల తిప్పి అన్నాడు నిశ్వం.

"ఏమో బాబూ, మీ మగాళ్ళ మాటలు నీటిమాటలని ఏ మహానుభావుడు సెలవిచ్చాడోగాని సెంట్ పర్సెంట్ కరెక్టు! నీటికి ఓ రూపం లేనట్టే మా మీటలకి నిలకడ వుండదు!"

"నన్ను అందరి లిస్టులోను చేర్చి మహాపరాధం చేస్తున్నావేమో! పతియే ప్రత్యక్ష దైవం, భర్త మాటే భార్యకు వేదవాక్కు—యిత్యాది కొటేషన్స్ కూడా ఆ మహానుభావులే సెలవిచ్చి వుంటారు చూడు!"

విశాల మునిపంట వచ్చే నవ్వు నాపుకుని, "సరే, మీ మాట కెంతగా కట్టుబడి వుంటారో చూస్తానుగా! నా కిష్ట మైన పౌరాణిక సినిమా, పురాణాలు యిష్టంలేదని నాకు తెలుసు. అలా అని ఎస్కేప్ కావటానికి ప్రయత్నిస్తే వూరుకునేదిలేదు!" అన్నది.

"అలాగే వూరుకోవద్దు?"

"ఎర్లీగా వస్తున్నట్టేకదా....!?"

"వస్తున్నట్టే....!"

"మోసం చెయ్యరు కదా!"

"చైను."

"చేస్తే తెలుసుకదా! ఈ రాత్రంతా మీరు చంచమామను చూసి విరహగీతాలు పాడుకోవలసిందే."

"అమ్మో! నువ్వీ సంగతి గుర్తుచేశాక మర్చిపోవ టమే, యింకేమయినా వుందా?" భయం నటిస్తూ గుమ్మం దాటాడు.

అతను స్కూటర్ స్టార్టుచేసి కాంపౌండు దాటి కను

చూపుమరుగై వెళ్ళేదాకా అక్కడే నించుని, నవ్వుకుంటూ లోనికొచ్చింది విశాల.

సాయంత్రం అయిదుగంటలకి అరగంట ముందే బయల్దేరాడు విశ్వం. అతను యింటిని సమీపిస్తూండగా, ఎవరో కుర్రాడు తమ యింటి కాంపౌండ్‌గేట్ తోసుకొని బయట కొస్తున్నాడు హడావిడిగా.

విశ్వం అతన్ని గుర్తుపట్టాడు. అతను తమ ఎదురింటి వీధిగదిలో దిగిన కాలేజి స్టూడెంట్సులో ఓ కుర్రాడు. విశ్వాన్ని ఆ కుర్రాడు కూడా చూశాడు హడావిడిగా తప్పు చేసినవాడిలా ముఖం తిప్పుకుని పెద్ద పెద్ద అంగలువేసు కుంటూ వెళ్ళిపోయాడు.

విశ్వం స్కూటర్ గేటు బయటే ఆపి, లోని కొచ్చాడు విశాల బాగా అలంకరించుకొని, సిద్ధంగా వుంది.

"ఎదురింటి స్టూడెంటు కుర్రాడెందుకు వచ్చినట్టు న్నాడు....!?" అన్నాడు భారం ముఖంలోనికి పరిశీలనగా చూస్తూ.

"అవునండి, పేపర్ కావాలని వచ్చాడు."

"తీసుకెళ్ళకుండా వెళ్తున్నాడేం?"

"ఇంగ్లీషు పేపరు కావాలట. మేం తెప్పించం అని చెపితే వెళ్ళిపోయాడు!"

విశ్వం ముభావంగానే బట్టలు మార్చుకొని తయారయ్యాడు.

థియేటర్‌కి చేరుకుని, టిక్కెట్టు తీసుకుని లోపలికి నడిచారు యిద్దరూ. ఆటపెద్దది కావటంవల్ల అప్పటికే మొదలు పెట్టేశారు.

తనకి రెండుసీట్ల అవతల సరిగ్గా విశాల పక్కన యెవరో మనిషి కూచుని వుండటం గమనించాడు విశ్వం. యింటర్వెల్లో ఆ వ్యక్తిని తమ యింటెదురు గదిలోని కుర్రాడిగా గుర్తించాడు. ఆ కుర్రాడే సాయంత్రం పేపర్ కోసం తమ యింటికొచ్చాడు! ఇప్పుడు విశాల పక్కన కూచున్నాడు.

అది పాత పౌరాణిక సినిమా! జనం బాగా పల్చగా వున్నారు. సీరియల్ నెంబర్ యివ్వటంలేదు టికెట్లకు. వరస సీట్లు కాదు, ఎవరిష్టం వచ్చిన సీట్లలో వాళ్ళు కూచో వచ్చును. సీట్లు ఖాళీగా వున్న యిలాంటి సమయంలో కూడా అతనెందుకు విశాల పక్కన కూచున్నట్టు? అత నెప్పుడొచ్చి కూచున్నాడు? తమ వరసలో తాము ముగ్గురు తప్ప వేరొకరు లేనేలేరు!

విశ్వం అసహనంగా కదిలాడు సీట్లో. లైట్లు ఆరిపోయి మళ్ళీ సినిమా మొదలయింది.

ఇంటర్వెల్ తర్వాత విశ్వం అతన్నే పరీక్షగా చూస్తు న్నాడు. భార్యమీదుగా వెనుకనుంచి

"మీరు సినిమా ఫాలో కావటంలేదు!" అన్నది విశాల ఒకటి రెండుసార్లు.

'ఆఁ! ఊఁ!' అన్నాడే తప్ప ఏమీ సమాధానమివ్వలేదు విశ్వం.

ఆ కుర్రాడు ఒకటి రెండు సార్లు విశాల సీటుమీదికి ఒరిగి చెవిలో ఏదో చెప్తున్నట్టు ఆ మసక వెలుగులో కని పించింది విశ్వానికి. సినిమా పూర్తికాకుండానే ఆ కుర్రాడు లేచి వెళ్ళిపోయాడు.

సినిమా పూర్తయింది. విశాల యింటికొచ్చేవరకు సినిమా గురించి అందులో ఎస్వీరంగారావు, ఎన్టీఆర్ల

చాంతాడంత డైలాగుల గురించి, వారి హావభావాల గురించి భర్తతో వసపిట్టలా వాగుతూనే వుంది విశ్వం ఏదో ఆలోచనల్లో వుండి ఆమెకు అన్యమనస్కంగా జవాబు లిస్తుండగా యిల్లు వచ్చేసింది.

స్కూటర్ లోపల పెట్టి లాక్ చేసి. బట్టలు మార్చు కున్నాక "అన్నం పడ్డిస్తాను రండి!" అన్నది విశాల.

"నా కాకలిగా లేదు!" అన్నాడు విశ్వం.

విశాల విస్తుపోయి, "అదేమిటి? రాత్రి ఎనిమిది కాకుం డానే ఆకలి, ఆకలి అంటూ ఆవురావురుమంటుంటారు. తొమ్మిదిన్నరయింది. ఇంకా ఆకలి కాకపోవటమేమిటి?" అన్నది.

"ఒంట్లో బావోలేదు!" అన్నాడు విశ్వం.

విశాల చటుక్కున అతని నుదుటిమీద చెయ్యివేసి చూసి. "అబ్బే, జ్వరం ఏమీ లేదు. బాగానే వుందే!" అన్నది.

"నీకు తెలుసా, నా ఆరోగ్యం గురించి నాకు తెలుసు?"

భర్త కసురుకోవటం కొత్తకాదు గాని, అలా చిరాగ్గా పరాగ్గా వుండటం కొత్తగానే వుందామెకు.

అప్పటికే విశ్వం మంచంమీద అటుతిరిగి పడుకున్నాడు. భర్త ప్రవర్తనలో వచ్చిన మార్పుకి అర్థం ఏమిటో అర్థం కాక, వంటగది సర్దేసి మంచినీళ్ళు తాగి వచ్చి తనూ పడు కొంది. భర్త నిద్రపోవటం లేదని గమనించింది.

"ఏమండీ!" పిల్చింది.

"ఊఁ. నాకు నిద్రొస్తోంది; ఇప్పుడు కాదు. విసిగించక పడుకో!"

"అబ్బ, అందుక్కాదు ఏమిటలా వున్నారు?"

"ఎలా వున్నాను, ఒంట్లో బాగోలేదన్నాను కదా!"

"అది కాదు లెండి, ఏదో వుంది!"

"ఏదో వుందని ఎందుకనుకొంటున్నావు?"

"మీ ప్రవర్తన మామూలుగా లేదు కనక!"

"మామూలుగా లేదని ఎందుకనుకొంటున్నావు?"

"మామూలుగా లేనపుడు మామూలుగా లేదనుకోక మరెలా అనుకోవాలి?"

"అబ్బ, నన్ను విసిగించక పడుకో!"

అంతకన్న భర్తను రెట్టించినా ఫలితం లేదని విశాలకి తెలుసు. అందుకే మారు మాట్లాడకుండా పెద్దలైటు తీసేసి బెడ్‌లైటు వేసింది.

2

ఆఫీసులో కూచున్నా విశ్వానికి మనసు ప్రశాంతంగా లేదు. తమ యింటెదురుగా వున్న స్టూడెంటు కుర్రాడే మనసులో మెదుల్తున్నాడు. వాడు తన భార్యతో అంత చనువుగా మసలటం కాకతాళీయమా, లేక....

కావాలనే అతను తన భార్యతో చనువు పెంచుకోవాలనుకుంటున్నాడని తెల్సిపోతూనే వుంది. తమ యింటికే, తను లేనప్పుడే పేపర్ కోసం ఎందుకు రావాలి, పోనీ, అది అనుకోకుండా జరిగిందనుకుంటే, తాము వెళ్ళిన సినిమాకే, అదే షోకి ఎందుకు రావాలి? వచ్చినా థియేటర్లో సీట్లన్నీ ఖాళీగా వుంటే, తమపక్కనే అందునా తన పక్క కాకుండా, విశాల పక్కనే ఎందుకు కూచోవాలి?

అదంతా కాకతాళీయం కాదు, కావాలనే జరిగింది. తాము అదే సినిమాకి వస్తున్నట్టు విశాల చెపితేనే కదా అతనికి తెలిసేది! అందుకే తమవెంట పడొచ్చాడు. విశాల పక్కన కావాలనే కూచున్నాడు.

విశాల!....ఆమె ప్రోత్సాహమే యిందుకు కారణమా,

ఇప్పుడు.... యిప్పుడు__యీ సమయంలో విశాల ఏం చేస్తుంటుంది? ...ఈ ఆలోచన రాగానే యిక సీట్లో కూచో లేకపోయాడు. తను మేనేజర్ హోదాలో వున్నాడు. ఎవరి అనుమతీ తీసుకోవలసిన అవసరం లేదు.

పి.ఏ.ని పిలిచి, తను ఓ గంటలో వస్తానని చెప్పి, బయటికొచ్చి స్కూటరెక్కాడు.

దూరంనించే తమ యింటివైపు చూపులు సారించాడు. సరిగ్గా అప్పుడే ఆ కుర్రాడు తమ యింటి గేటు తెరుచు కుని బయటకొస్తున్నాడు.

విశ్వం కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. దవడ బిగుసు కుంది. స్కూటర్ గేటుముందు ఆపి, రెండేసిమెట్లు ఒక్క సారి ఎక్కి, గుమ్మం తలుపు తట్టాడు. ఇంతలో కాలింగ్ బజర్ గుర్తొచ్చి బజ్జర్ నొక్కాడు.

రెండు నిమిషాలు గడిచిపోయినా తలుపు తీస్తున్న జాడ కనపడలేదు. మళ్ళీ బజ్జర్ గట్టిగా నొక్కి వేలు అలాగే వుంచేశాడు.

తలుపులు తెరుచుకున్నాయి. విశాల తెరిచింది. జుట్టు చిందరవందరగా వుంది. చీర నలిగిపోయింది.

భర్తను చూసి ఆశ్చర్యపోయి "ఇదేమిటి, యీ సమ యంలో వచ్చారు?" అన్నది.

"తలుపు తీయటానికి ఇంతసేపు ఏం చేస్తున్నావ్? ఆమె ప్రశ్నకు ప్రశ్నే సమాధానంగా అడిగాడు.

"మంచినిద్రలో వున్నానండి ఈ సమయంలో మీరు రారుకదా! భోంచేసి యిప్పుడే పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టేసింది!" అన్నది.

హుం. చక్కటి అబద్ధం. ఎంత అబద్ధంగా కల్పించి చెపుతోంది? వాడి గురించి అడిగెయ్యాలనుకొని, నాలిక

చివరివరకు వచ్చింది. కాని, తను బయటపడిపోతే అప్పటితో భయపడి ఆ కథకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తుంది. తనేమీ ఎరగనని బుకాయిస్తుంది.

ఇద్దరు లోపల వుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకోవాలి! అప్పుడు తప్పించుకోలేదు. వెంటనే బుద్ధిచెప్పి, డైవోర్స్ యిచ్చి వదిలించేసుకోవచ్చు. ఇప్పుడు తొందరపడటంవల్ల తనకేం లాభం లేదు!

"ఆఫీసు కాగితాలు మర్చిపోయాను" అంటూ పుస్తకాల రేక్ దగ్గిర ఏదో సర్దినట్టు నటించి, బయటకొచ్చి "తలుపేసుకో!" అన్నాడు చాలా మామూలుగా.

తిరిగి ఆఫీసుకు వచ్చాడేగాని మనసు దేనిమీద స్థిరంగా నిలపలేకపోయాడు.

విశాలను తను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కట్నం తీసుకోకుండా, కేవలం ఆమె అందచందాలు చూసి, మధ్యతరగతికి చెందిన విశాలను చేసుకొని సంఘంలో గొప్ప స్థానాన్ని కల్పించాడు. ఆమె కావలసినవన్నీ అడక్కుండానే అమర్చి పెట్టాడు. ఆమె తన వెంట వుండటమే స్టేటస్‌గా భావించుకుని తన అదృష్టానికి తనే గర్వపడుతుండేవాడు. కొన్ని వందల కళ్ళు తనని, భార్యని చూసి అసూయతో కుంగిపోతుంటే అతనికి చాలా ఆనందంగా వుండేది.

అలాంటి విశాల, తనంటే ఎంతో ప్రేమతో, తను లేకపోతే, ఒక్క క్షణంకూడా తనని చూడకుండా వుండలేని విశాల—తను ఏం తక్కువ చేశాడని ఆ కుర్రాడితో రహస్యంగా....ఛీ. ఎంత దిగజారిపోయింది? ఎంత మోసం చేసింది? ఇలాంటి కులటనా తను యిన్నాళ్ళు అందరిమెచ్చుకుంచాడు? ఆమెకోసం తనవాళ్ళని కాదని, అందర్నీ వదులుకుని. లక్ష రూపాయల కట్నాన్ని ఒదులుకుని.

యీామెను చేసుకుంటే తనకి యింత ద్రోహం చేస్తుందా?

విశ్వం పిడికిళ్ళు బిగుసుకున్నాయి. తల పగిలిపోతోంది. చెవుల్లో సముద్రఘోష! మనసు నెవరో యినప పిడికిలితో నొక్కేస్తున్నట్టు అనుభూతి! ఊపిరాడక కొట్టుకుంటున్నట్టు కళ్ళముందు అంధకారం ఆవరించుకున్నట్టు, తను దారికానక తడుముకొంటున్నట్టు అగమ్యగోచరంగా అనిపిస్తోంది. తల విదిలించాడు

అప్పటికి నాలుగుసార్లు టీ తెప్పించుకుని తాగాడు. రెండు పెట్టెల సిగరెట్లు కాల్చాడు! తల చిందరవందరగా చేసేసుకున్నాడు. కళ్ళు ఎర్రగా, జ్యోతుల్లా మండిపోతున్నాయి.

దీనికి పరిష్కారం....? ఏమిటి, ఎలా?

వాళ్ళిద్దర్నీ లోపలయిందగా పట్టుకొని, వాడికి దేహశుద్ధి చేయాలి! లేదా, చంపెయ్యాలి! చంపితే యిద్దర్నీ చంపెయ్యాలి! కాని, తను చట్టానికి దొరికిపోతాడు! తనని ఉరి కంబమెక్కిస్తారు.

ఊహుఁ. అది తెలివైన పనికాదు. తన బంగారు భవిష్యత్తుని, నిండు జీవితాన్ని ఓ కులటకోసం ఎందుకు నాశనం చేసుకోవాలి? అది వివేకవంతులు చెయ్యాల్సిన పనికాదు!

ఆమెను దోషిగా నిలబెట్టి, ఆమె చేసిన తప్పుకు విడాకులిచ్చెయ్యాలి! అంతే, అదే సరైన పద్ధతి. తను 'నో' అంటే కోటిమంది అందగత్తెలు పెద్ద కుటుంబాలలోని వాళ్ళు తనకోసం 'క్యూ' లో నిలబడతారు. అందర్నీకాదని యీా కులటను చేసుకున్నందుకు, యిప్పటికైనా తనతప్పును సరిదిద్దుకుని, ఆమెను శాశ్వతంగా వదిలించుకోవాలి!

ఈ నిర్ణయాని కొచ్చాక అతని మనసు శాంతించింది. టేబిలుమీద పేరుకుపోయిన ఫైళ్ళను చకచక సంతకాలు పెట్టి డిస్పోజ్ చేసేశాడు.

"నేను నాలుగురోజులు కేంప్‌మీద బొంబాయి వెళ్తున్నాను. జాగ్రత్తగా తలుపులు వేసుకుని యింట్లోనే వుండు! దొంగలు ఎక్కువగా తిరుగుతున్నారు. మామూలు దొంగలు కాదు. బందిపోట్లు!" అన్నాడు విశ్వం సూట్‌కేసు సర్దుకుంటూ.

విశాల బిక్కమొహం వేసుకుని చూపింది.

"బాబోయ్, నాలుగు రోజులే! నేను ఒక్కతెను వుండలేనండి. నన్ను తీసుకు వెళ్ళండి మీతో! అక్కడ ఏదైనా హోటల్లో రూం తీసుకుని వుండొచ్చు" ప్రాధేయపడింది విశాల.

"అది చాలా యింపార్టెంట్ జాబ్. ఫేమిలీతో విహారం చేసేందుకు కాదు కంపెనీ నాకు యిన్నివేలు టి.ఏ. పోసేది? నాలుగు రోజులేగా!"

"మీకేం. నాలుగురోజులే కదా అని తేలిగ్గా అనేశారు. మీరు ఆఫీసునించి యింటికొచ్చేవరకు బిక్కు బిక్కుమనంటూ వుంటుంది నాకు. రాత్రిళ్ళు మిమ్మల్ని వదిలి వున్నానా పెళ్ళయ్యాక? అలాంటిది నాలుగు పగళ్ళు, నాలుగు రాత్రులు వంటరిగా, మీరు లేకుండా—ఉహు, నాకు ఏడుపొస్తోంది బాబూ, నేనుండలేను!"

"మొదటిసారి కదా, అలా అనిపిస్తుంది. అలవాటుపడిపోతే అదే బావుంటుంది...."

"ఛ, వంటరిగా వుండటం బావుంటుందా?"

"పోనీ, నీ ఫ్రెండ్సెవరైనా వుంటే యీ నాలుగు రోజులు...."

"ఛ ఛ, నా కెవరున్నారండి ఫ్రెండ్సు?"

"మీ స్నేహితురాళ్ళెవరయినా"

"మీకు తెలియని వాళ్ళెవరున్నారు? .... ఒకరిద్దరున్నా

వాళ్ళ సంసారాలు వదులుకుని వచ్చి నాకు తోడు పడు కుంటారా పైగా నవ్విపోతారు.

"సరే నే వెళ్తున్నాను!"

విశాల కళ్ళు వర్షించటానికి సిద్ధంగా వున్నాయి.

విశ్వం ఆమెవంక చూడటంలేదు సూట్ కేస్ తీసుకుని మెట్లు దిగిపోయాడు,

సరాసరి ఆఫీసుకి వెళ్ళిపోయాడు సాయంత్రందాకా ఆఫీసులో గడిపాడు. తను లేదని యథేచ్ఛగా వాడితో సరసాలాడుతూ వుంటుంది. ఈ సమయంలో కిన్న రాత్రి సమయంలో వెళ్తే తననెవరూ గుర్తించరు! చాటుగా వుండి అంతా గమనించాలి! వాళ్ళిద్దరు లోపలవుండగా చటుక్కున తలుపుతట్టాలి. దారివైపు లాక్ చేసెయ్యాలి. వాడు వీధి వైపు తప్ప తప్పించుకునే అవకాశం లేకుండా చెయ్యాలి! అప్పుడు బోనులో పడ్డ పులిలా తప్పించుకునే అవకాశం లేకుండా దొరికిపోతాడు. అప్పుడు తన కసితీరా వాళ్ళిద్దర్నీ తన్ని, దాన్ని బయటకు తగలెయ్యాలి! అంతే, అప్పుడే తనకు శాంతి?

ఆరుగంటలకి ఆఫీసు వదిలి బయటికొచ్చాడు. రాత్రి పదిగంటలు దాటాకగాని అటు వెళ్ళగూడదు.

తను కాంపుకి వెళ్తున్నట్టు యీపాటికి వాడికి తెలియజేసి వుంటుంది. వాడు చూస్తుండగా వెళ్ళాలని ప్రయత్నించాను. కాని రూం తాళం పెట్టివుంది. వాడు చూడకపోయినా విశాల ఎలాగూ వాడికి తర్వాత చెప్పకపోదు. నాలుగు రోజులపాటు తానురానని తెలిశాక యికవాళ్ళకు అడ్డు అపు వుండదు! ఈ రాత్రికే వాళ్ళు తనకి దొరికిపోతారు; తప్పదు!

పది గంటలవరకు ఎక్కడ గడపాలి? ఏదైనా సినిమాకు వెళ్తే....? మనసు గందరగోళంగా వుంది. సమయం గడవ

టానికే అయినా. తను స్థిరంగా థియేటర్లో కూచోలేడిప్పుడు. ఎక్కడైనా కాసేపు ప్రశాంతంగా గడపాలి.

ప్రశాంతత పేరు చెప్పగానే అతనికి పబ్లిక్ గార్డెన్ గుర్తొచ్చింది. లాన్‌లో, క్రోటన్స్ మొక్కల మధ్య, పూల మొక్కల అందాలను చూస్తూ కాసేపు గడిపితే మనసు కొంత తేటపడుతుంది. తన గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. తల సముద్రపు హోరులాంటి ధ్వనితో దిమ్మెక్కిపోతోంది. అందుకే ...కాసేపు ...వీలయితే పది గంటలవరకు అక్కడే గడిపెయ్యాలి.

అతని కాళ్ళు సరాసరి పబ్లిక్‌గార్డెన్‌లోకి దారితీశాయి. మూలగావున్న చోటు వెతుక్కున్నాడు. అక్కడ నిలువెత్తు పెరిగిన క్రోటన్స్ అందంగా వున్నాయి. వాటి వెనక కూచుంటే ఎవరూ కనిపించరు. కాసేపు తను ప్రశాంతంగా కూచోవచ్చు మిగతా ప్రపంచంతో సంబంధం తెంచుకుని!

అప్పుడే చీకటి పడింది. జనం చెదురుముదురుగా వస్తున్నారు, పోతున్నారు. తానున్న చోటికి మాత్రం ఎవరూ రావటం లేదు.

ఎనిమిదయింది. నడుంవాల్చి ఆకాశంలోకి చూస్తూ పడుకున్నాడు. తను పడుకున్న ఆవలిపక్క ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి. అనాసక్తంగానే ఆ మాటలు అతని చెవినపడ్డాయి. అవి ఎవరిగురించో అర్థం కాగానే చటుక్కున లేచి కూచున్నాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. చెవులు రిక్కించి వినసాగాడు.

"అరేయ్ చరణ్, నువ్వు పోటీలో ఓడిపోయినట్టే! ఇక రెండు మూడు రోజుల్లో మన బెట్ నేనే గెలుస్తాను!" ఆ గొంతు....అవును....రాజీదే, తమ యింటి కెదురుగావున్న రూంలోని స్టూడెంటు కుర్రాడిది!

"అప్పుడే ఎలా చెప్పగలం? ఆ విశ్వం యింకా ఆమెను పూర్తిగా అనుమానించినట్టు మనకు కన్ఫర్మ్ కాలేదు. ఆమెను హింసిస్తున్నట్టు గాని, తనామెను అనుమానించి నట్టుగాని, యింతవరకు ఎలాంటి ఆధారాలు లేవు. దీన్ని బట్టి నువ్వు గెలచినట్టు చెపుతున్నావ్! ఆ గొంతు ఎక్కడో విన్నాడు. కాని గుర్తురావటంలేదు.

విశ్వం తొంగిచూశాడు చీకట్లో ఆ రెండోవాడ్ని కూడా కష్టంమీద గుర్తుపట్టాడు. చరణ్ అని పిలవబడిన ఆ కుర్రాడు—తమ యింటికెదురుగా వుండేవాడి రూమ్మేటు! ఇంతకీ వాళ్ళిద్దరు వేసుకున్న బెట్ ఏమిటి?

విశ్వం మనసంతా చిందరవందరై పోయింది. వాడు మళ్ళీ చెపుతున్నాడు.

"నేను గ్రహించాను, వాడి మనసులో అనుమానం జ్వాలలై కార్చేస్తోంది. వాడి చర్యల్ని గమనించాను. ప్రతి సారీ వాడు నావైపు అనుమానంగా చూస్తూనే వుండగా వాళ్ళింట్లోనించి బయటికొచ్చాను సినిమా హాల్లో కూడా కావాలని ఆమె పక్కన కూచుంటే అనుమానంగా చూస్తూనే వున్నాడు! అంతెందుకు? నిన్న మధ్యాహ్నం—వాడు ఇంటి కొచ్చి వెళ్ళటం నేను లోపలున్నాననే అనుమానం తీర్చు కోవటం కోసమే! మన గదిలోంచి మనిద్దరం గమనిం చామా, లేదా? నిన్న సాయంత్రం గూడా వాడు చూస్తుం డగా గేటు తీసుకుని వాళ్ళింట్లోనించి వస్తూ కనిపించినా, యిక అనుమానం రాక ఏమవుతుంది?"

"ఒరే పవన్, నువ్వెంతకైనా సమర్థుడివిరా! కాని యిది పూర్తిగా సక్సెస్ అయ్యేవరకు నీకు బెట్ కాసిన వంద యివ్వను. నేను స్వయంగా చూసి, సక్సెస్ అయ్యా పని కన్ఫర్మ్ చేసుకున్నాకనే యిస్తాను" అన్నాడు చరణ్.

మొదటివాడు, పవన్–"అయితే నీకు పూర్తి నమ్మకం కలగాలంటే ఏం చెయ్యాలి!" అడిగాడు.

"ఆమెను అతను చూస్తూండగా పట్టుకోవాలి. అతను ఆవేశంలో జుట్టు పీక్కుని ఆమెను అనుమానించి, అవమానించాలి. వదిలేస్తే యింకా మంచిది!... లేకపోతే, నన్ను అవమానిస్తుందా? ఏదో అందంగా వుందికదా అని, 'మీరు అందంగా వున్నారు' అని కామెంట్ చేస్తే చెప్పు తీసుకు కొడతానని అవమానకరంగా మాట్లాడుతుందా? చూస్తాను, దాని మొగుడే దాన్ని చెప్పు తీసుక్కొడుతుండగా చూసి, దానిముందే పెళ్ళున నవ్వుతాను. అది రోడ్లు పట్టిపోతే నా కసి తీరుతుంది. అప్పుడు ఎదురుపడి, ఆ నాటి సంఘటన గుర్తుచేసి మరీ నవ్వుతాను. అది ఆత్మహత్య తప్ప గత్యం తరంలేని విధంగా టీజ్ చేస్తాను.... అప్పుడు.... అప్పుడు తీరుతుంది నా కసి!" చరణ్ మాట ఒక్కొక్కటీ విశ్వం గుండెల్లో మార్మోగింది.

ఎంత తొందరపడ్డాడు తను? ఎంత తేలిగ్గా భార్యను అనుమానించాడు? ఇదంతా కావాలని ప్లాన్డ్‌గా జరుగుతున్న ఓ కుట్రలన్న మాట! అమాయకురాలైన తన భార్యను చేజేతులా వదులుకునే వాడు! ఆమె అందాన్ని కామెంట్ చేసిన కుర్రాడ్ని చెప్పుతీసుకు కొడతానని హెచ్చరించిన తనభార్య శీలాన్నితను శంకించాడు? తనకన్న దుర్మార్గుడు, పాపాత్ముడు యింకొకడుండడేమో!....

విశ్వం వాళ్ళిద్దరి పీకలూ పిసికేద్దామన్నంత ఆవేశంతో లేవబోయి మళ్ళీ పవన్ మాటలు వినిపించిఆగాడు....

"సరే. యీ రాత్రికే పథకం అమలుపరుస్తాను. అర్ధ రాత్రి తలుపు తడతాను మొగుడి పక్కలో వుంటుంది కదా! లేచివస్తుంది. బహుశా యిద్దరూ లేచివస్తారు. వాడు

చూస్తే పరుగెత్తుకొచ్చేస్తాను. వాడు చూడకుండా ఆమె ఒక్కతే లేచివస్తే, మీ ఆయన గురించి ఎవరో వచ్చారు లేపమంటాను. నువ్వు నా పక్కనే వుంటావు కదా, కీ నీడలో నిలబడి వుంటావు కాబట్టి నిజంగా ఎవరో అనుకుని లేపుతుంది. ఈ లోపల నేను లోపలికి దూరబడి తలుపు వేస్తాను దగ్గరగా. నువ్వు వెళ్ళిపోతావు మొగుడు లేస్తాడు. నన్నూ ఆమెను చూస్తాడు. అప్పుడిక అనుమానించక చస్తాడా?"

"అరే చరణ్, నీకు మంచి థాట్స్ వస్తాయిరా! ముద నష్టపు అయిడియాలు వేయటంలో నువ్వే ఫస్టు! వాడు చూస్తే 'నువ్వు రమ్మన్నావనివచ్చాను, మీ ఆయన లేచాడు' అని వచ్చేస్తావు, అంతేనా!"

"జిగ్గాట్! మన కత్తికి రెండువైపులా పదునుంది! ఓ....కే....? పద, పోదాం!"

ఇద్దరు వెళ్ళిపోయిన సవ్వడి వినిపించింది.

విశ్వం మనస్సు ఇప్పుడు చాలా తేలిగ్గావుంది. వాళ్ళిద్దర్నీ యెలా పట్టుకోవాలో అప్పటికప్పుడే ప్లాన్ చేశాడు తను కాంప్ వెళ్ళినట్టు పవన్‌కి చరణ్‌కి తెలియదు. అందుకే వాళ్ళు ఈ రాత్రికి పథకాన్ని సిద్ధం చేసుకున్నారు.

భర్తనుచూసి ఆశ్చర్యంతో నోట మాటరాక "అదేమిటి, కాంప్‌కి ..." అనబోతున్న భార్యవంక అపురూపంగాచూసి, చటుక్కున కౌగిలిలోకి తీసుకున్నాడు విశ్వం.

* * *

ఆ మరునాడు ఉదయం నిద్రలేచిన విశాలకు ఎదురింటి కుర్రాడు ఒంటినిండా బ్యాండేజీలతో రిక్షా దిగుతుండటం కనిపించి, "పాపం, ఎక్కడో పడిపోయినట్టున్నాడు! అని జాలిపడింది. □

"సార్!" అన్నాడు సారథి.

డిటెక్టివ్ శిరీష్ ఆనాటి దినపత్రిక చదువుకుంటున్న వాడల్లా తలెత్తి చూశాడు. ఎదురుగా అసిస్టెంట్.

"ఏమిటి సారథీ?" అడిగాడు శిరీష్.

"స్నేహితులతో పిక్నిక్‌కి వెళ్తున్నాను సార్!"

"ఎక్కడికో తెలుసుకోవచ్చునా?"

"అదేమిటి సార్? మీకు చెప్పకుండానా? గంభీర లోయ."

డిటెక్టివ్ శిరీష్ వులిక్కిపడ్డాడు. "గంభీర లోయకా?" అన్నాడు.

"ఏం సార్?"

డిటెక్టివ్ శిరీష్ ఆనాటి దినపత్రిక ఒకసారి తిరగ వేశాడు. "వింతలు-విడ్డూరాలు" శీర్షిక కింద అచ్చువేసిన వార్తను పైకి చదివాడు.

"శివుడికి గరళ కంఠుడన్న పేరుంది. అతడికా పేరెలా వచ్చిందో నమ్మేవాళ్ళున్నా నమ్మనివాళ్ళు కూడా వుండ వచ్చును. కాని విశాఖపట్నానికి డెబ్బై మైళ్ళ దూరంలోనూ సముద్రపట్టానికి పదిహేనువందల అడుగుల ఎత్తులోనూ వున్న గంభీర లోయలో వున్నడు నిజంగా గరళకాయుడే. అతడి శరీరమంతా విషం. పాము అతడిని కరచి సొమ్మ సిల్లి పోతుంది. తేళ్ళు అతడిని సమీపించను కూడా సమీ పించ లేవు. అతడిని పరిశోధనశాలలో వుంచి పరిశోధించ వలసిన అవసరం ఎంతయినా వుంది...."

శిరీష్ చదవడం ఆపాడు.

"ఆ వార్త నేను చదివాను సార్. ప్రకృతివిరుద్ధంగా అతడిలో అంత విషం ఎలా పేరొక్కంది? పాము కరిస్తే అతడు సొమ్మసిల్లిపోవలసింది పోయి—పామే సొమ్మసిల్లి పోతుందా?"

"మొన్న నువు గమాక్సిన్ తెచ్చి దోమల నివారణకు తంటాలు పడ్డావు. దోమలు తగ్గాయా?"

"లేదు సార్! అయినా అవేం దోమలు? ఈగల పరి మాణం పెరిగిపోయాయి."

"దోమలు గమాక్సిన్ పీల్చి ఎలా తట్టుకోగలిగాయి?"
దోమల వంశాలు క్రమంగా మనం వాడే గమాక్సిన్‌పట్ల నిరోధక శక్తిని పెంచుకున్నాయి. అందువల్లనే యిప్పుడు మార్కెట్లో దోమల నివారణకు కొత్త మందులు దొరుకుతున్నాయి. కొన్నాళ్ళకు ఈ మందులు కూడా దోమలకు పిప్పరమెంట్లుగా మారిపోతాయి.

"దున్నడికీ, దోమలకూ సంబంధం యేమిటి సార్?"

"ఇదే పాయింట్ దున్నడి విషయంలో అన్వయించు. అతడు బాల్యంనుండీ విషాన్ని కొద్ది కొద్దిగా సేవిస్తున్నాడనుకుందాం. క్రమంగా అతడి శరీరం విషానికి అలవడిపోతుంది. చాణక్యుడు విషకన్యను పర్వతరాజుమీద ప్రయోగించాడు. చరిత్రలో చదువుకోలేదా?"

"అది పుక్కిటి పురాణం సార్."

"నువ్వు అక్కడే పొరబడుతున్నావు. కథను నమ్మక. ఏమీ ప్రమాదంలేదు కథను సృష్టించడం వెనుక వున్న మనిషి మేథస్సును అంచనా వెయ్యి."

సారథి తలూపాడు "మీ వాదం ఒప్పుకుంటానుసార్! దున్నడి విషయంలో కూడా విషకాయం అలాగే ఏర్పడి వుంటుంది. మీరెందుకు అక్కడికి మేము పిక్నిక్‌కి వెళ్తున్నామంటే భయపడ్డారు.

దున్నడు విషాలను హరించుకునేవాడిలాగా రూపొందాడు. అంటే గంభీరలోయ ప్రాంతాల విషపదార్థాలు సమృద్ధిగా దొరుకుతున్నాయన్నమాట. తమ లోయ తట్టు ఆచారవ్యవహారాలకు మీరు అపచారం చేస్తే అక్కడి గిరిజనులు మిమ్మల్ని వదలిపెట్టకపోవచ్చు"

"మేము వెళ్ళేవాళ్ళ మందరమూ అల్లరి మనుషులం కాదు సార్!"

ఆ మాట విడివిడిగా వున్నప్పుడు ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది మీరే గుంపుగాకలిస్తే కొత్త శక్తి పుట్టుకొస్తుంది. ఉధృతమైన చైతన్యం మిమ్మల్ని ఆవేశపరుస్తుంది. అందుకు నేను భయపడుతున్నాను."

"మీరిచ్చే సలహా ఏమిటి సార్?"

"చాదస్తం అనుకోనట్టయితే మీరంతరూ యాంటీవీనం విషహరణం తీసుకోవడం మంచిదనుకుంటాను. వైద్యసహాయం అందేవరకూ అయినా ప్రమాదం తప్పుతుంది."

సారధి నవ్వపోయి ఆగాడు. శిరీష్ అది కనిపెట్టి తానే నవ్వేశాడు. తరువాత సారధి నవ్వాడు.

"వాళ్ళకు ఫోన్ చేస్తాను సార్! యాంటీవీనం వుంది కదా మన దగ్గర!" అన్నాడు సారధి.

శిరీష్ నవ్వడం ఆపి తలూపాడు. "ఇంజక్షన్ సూదులూ, పిరంజి మరగబెట్టు. నీకు మొదటి డోస్ యిస్తాను" అన్నాడు.

సారధి పుస్తకాలషెల్ఫ్ పక్కనేవున్న మందులషెల్ఫ్ వైపు నడిచాడు.

2

ప్రసాద్ జీపు దిగాడు. "దిగంద్రా.... యిక్కడ.... సీన్ చాలా బాగుంది" అన్నాడు. కాంత్, మల్లేశ్వరం, జీపు దిగాక సారధి దిగాడు.

"ఎటుచూచినా చెట్లూ, పుట్టలూ, అడవితీగలూ, కొండలూ, పక్షుల అరుపులూ, అడవిజంతువులు యెక్కడెక్కడో కదులుతూన్న చప్పుళ్ళూ...."

"ఒరేయ్ ప్రసాద్! జలపాతాల హోరు మరచిపోయినట్టున్నావు" నవ్వాడు కాంత్.

"వాడెందుకు మరచిపోతాడురా!" ప్రసాద్ చుట్టూ చూచి అడుగు వేశాడు.

"డ్రయివర్!" పిలిచాడు మల్లేశ్వరం.

స్నేహితులు నలుగురుకాక జీపులో డ్రైవర్ వున్నాడు. ఏమిటన్నట్టు మల్లేశ్వరం వైపు చూశాడు.

"ఈ బాటలో ఆ చివర మలుపు దగ్గర ఆపు" నడిచి వస్తాం."

జీపు నెమ్మదిగా తీగలమీద నుండి సునాయాసంగా వూగుతూ వెళ్ళిపోయింది. స్నేహితులు నలుగురూ కబుర్లు చెప్పుకుంటూ నడక సాగించారు. దారి సాఫీగా లేదు. అల్లి బిల్లిగా పెరిగిన చిట్టిపొదలూ, అడవితీగలూ, చీమలపుట్టలూ, చెట్లకొమ్మలూ దారికి అడ్డం వస్తున్నాయి.

"నగర వాతావరణానికీ యిక్కడి వాతావరణానికీ ఎంత తేడా!"

"జీవితంలో అప్పుడప్పుడూ యిలాంటి ప్రదేశాలు తిరగాల్రా!"

"అవునురోయ్....లేకపోతే ప్రకృతిలో మనిషికి సన్నిహిత సంబంధం వున్నదన్న సంగతే గుర్తురాదు."

"మనకు కూడా అప్పుడప్పుడూ స్థలం మార్పు కావాలి. ఆ వుద్దేశ్యంతోనే మనం విహార యాత్రలు చేయాలి."

సారధి తలూపి, "ఈ గాలి పీల్చి బతకొచ్చు" అన్నాడు.

"అవును. మీ గురువుగారిని తీసుకురావలసింది. అడుగడుగునా ఆంక్షలు పెట్టేవాడు.

"ఆంక్షలూ కావురా మల్లేశ్వరం! ముందు జాగ్రత్త చర్యలు."

"ఒరేయ్! నీకు కూడా ఆయన పైత్యం పట్టిందిరా!"

"ఎంతయినా గురువుకు తగ్గ శిష్యుడు కదరా!"

సారధి వాళ్ళ భుజాలు చరచి, "నోర్మూయ్యండొరేయ్ ...ఆయన మనకంటె అంతో ఇంతో పెద్దవారు. జీవితంలో దక్కా-ముక్కీలు తిన్నవారు. అనుభవపూర్వకంగా ఆయన చెప్పిన జాగ్రత్తను పాటించూ....మానుకో .... వెటకారం చెయ్యక. మనకు తెలియని ప్రాంతాల్లో యేం జరుగుతుందో ఏం తెలుస్తుంది" అన్నాడు.

స్నేహితులు చప్పట్లు కొట్టి నవ్వుకున్నారు. సారధి వాళ్ళను తమాషాగా చూశాడు. నలుగురూ బాటకు అడ్డదిడ్డంగా నడుస్తున్నారు.

సాయంకాలం అవుతోంది. పశ్చిమదిశలో ఇంకా రెండు బారలలో వున్నాడు సూర్యుడు. వేడిగాలి క్రమంగా చల్లబడుతోంది.

చల్లగా మారుతోన్న వాతావరణంతో గంభీరలోయ మరింత గాంభీర్యం సంతరించుకుంటోంది.

"మనం యీ రాత్రికి కొండపల్లిలో ఆగుదాం!" అన్నాడు కాంత్.

"కొండపల్లిలో గెస్టుహౌస్ వుంది. తరువాతి హాల్ట్ ఎక్కడ?" అడిగాడు సారధి.

"తరువాత నిర్ణయించుకుందాం."

స్నేహితులు జీపును సమీపించారు. జీపు డ్రయివర్ వాళ్ళవైపు చూడటంలేదు. అతడికి అటుప్రక్క దూరంగా జలపాతం వుంది. జలపాతానికీ, అతడికీ మధ్యలో మర్రి చెట్టులాంటి చెట్టు వుంది. దాని కొమ్మలు గాలికి వూగుతున్నాయి. తేలుకొండెల్లాగా ముడుచుకుంటున్నాయి తెరుచుకుంటున్నాయి.

"ఏమిటది డ్రయివర్?" అడిగాడు ప్రసాద్.

"డ్రయివర్ మాట్లాడలేకపోయాడు. సారధి అతడిని మెల్లగా కదిపాడు. డ్రయివర్ తెలివిలోకి వచ్చాడు.

"దాని కొమ్మలు చూశారా సార్....?" అన్నాడు డ్రయివర్.

"అవును. జలపాతం గాలికీ, హోరుకూ కొమ్మలు కదులుతున్నాయి. అంతేనా?" కలుగజేసుకొన్నాడు మల్లే శ్వరం.

"అదికాదు సార్! అది జీవాలను తింటూంది సార్!"

"నాన్సెన్స్! నీకు యింత దూరంనుండి దాని తిండి కనిపించిందా?"

"మల్లేశ్వరం! నిజమే అయివుండాలి. దాని కొమ్మలు చూడు! ఎలా వూగుతున్నాయో! చాల అసహజంగా వున్నాయి. ఆత్రంగా అందుకోబోతున్న మనిషి వ్రేళ్ళకు లాగా కదులుతున్నాయి...." సారధి జీపు దాటి అటు నడిచాడు.

"సార్! వద్దు సార్! నా కళ్ళ ముందే ఒక ఆవు బలయిపోయింది. పాపం దారి తప్పి అటు వెళ్ళి వుంటుంది."

"చాలా విచిత్రంగా వుంది. ఇలాంటి చెట్లు ఆఫ్రికాలో వున్నట్టు విన్నాం. ఆఫ్రికా నుండి ఈ వంగడం యిక్కడకు ఎలా వచ్చిందో?"

"ఆఫ్రికాలోనే కాదు, అమెరికా—దక్షిణ అమెరికా అమెజాన్ నదీప్రాంతలో కూడా వున్నాయి."

ముందు నడుస్తున్నవాడల్లా సారధి ఆగి, "ఆఫ్రికాలో దక్షిణ అమెరికాలో వున్న అడవులలో ఈ మాంసాహార వృక్షాలున్నట్టు మీరు చెప్పింది నిజమే? భూమధ్యరేఖకు

ఆటూ యిటూ కొంత అక్షాంశం మేరకు ఈ అడవులు వున్నాయి" అని తిరిగి ముందుకు వెళ్ళాడు.

"ఒరేయ్! ఎక్కడికిరా! చీకటిపడుతోంది. ఈ రోజుకు పోదాం" అరిచారు మిగతావాళ్ళు.

సారధి మాట్లాడలేదు. ముందుకు నడచి చెట్టుకు కాస్త దూరంలో ఆగాడు. సాయంత్రం వెలుగుకిరణాలు చెట్టుమీద పడుతున్నాయి. చెట్లకొమ్మలు మామూలుగా తెరచుకుని అమాయకంగా ఆగిపోయాయి. కొమ్మల మధ్య రక్తం బీభత్సంగా అంటుకునివుంది. కొమ్మల మధ్య నుండి జారి పడింది.

అది పెద్ద ఎముకలగూడు. ఆకారం మారిపోయి అస్తవ్యస్తంగా కుదించుకుపోయి వుంది. ఎముకలగూడుకు కండ గానీ, రక్తంగానీ అంటివున్న జాడలేదు.

సారధి నిట్టూర్చాడు. చెట్టు ఆవును పీల్చి పిప్పిచేసి వదలిపెట్టింది. సారధికి ముందుకు అడుగువేసే ధైర్యం కలగలేదు. వెనక్కి తిరిగివచ్చి తన స్నేహితులను కలుసుకున్నాడు.

స్నేహితుల మొహంలో కళలేదు.

"నిజంరా సారధీ! ఈ గంభీరలోయ ప్రాంతంలో అంతా విచిత్రమైన విషపూరితాలున్నాయి" అన్నాడు కాంత్.

జీపు భారంగా బయలుదేరింది.

అంతవరకూ, జీపునూ, బృందాన్నీ కనిపెడుతున్న వ్యక్తి చెట్లచాటునుండి యివతలకువచ్చాడు. అతడి ఒంటిన చిన్న నడుముగుడ్డ వుంది. అతడి చేతిలో విల్లు వుంది. వీపుమీద బాణాలపొది వుంది. కుడిచేతిలో ఒక బాణం పట్టుకొని వాళ్ళనే చూస్తున్నాడు. అతడే గరళకాయుడు— దున్నడు. జీపు కొండపల్లిలో ఆగింది.

3

తలుపుమీద టకటక చప్పుడయింది. స్నేహితులు నిశ్చింతగా నిద్ర తీస్తున్నారు. తలుపు చప్పుడుతో మల్లేశ్వరం కదిలాడు.

గెస్టుహౌస్ అద్దాల తలుపుల్లోంచి వెలుగు కనిపిస్తోంది. మల్లేశ్వరం లేచివెళ్ళి తలుపు తెరిచాడు.

గెస్టుహౌస్ కీపర్!

"బాబుగారూ! మీరు చెప్పిన మనిషి గురించి ఆరా తీశాను. అతడు తొమ్మిదయితే యిక దొరకడట" అన్నాడు కీపర్.

మల్లేశ్వరం స్నేహితులను లేపాడు. అందరూ చకచక తయారయారు. గెస్టుహవుస్ కీపర్ దారి చూపుతుంటే జీపు ఘాట్ రోడ్డు దిగింది. సారధి జీపు డ్రయివ్ చేస్తున్నాడు.

జీపును అడ్డగర్ర గ్రామంలో ఆపాడు. గ్రామస్తులు జీపును చూడగానే ప్రక్కలకు తప్పుకున్నారు. గెస్టుహవుస్ కీపర్ గ్రామస్తులను సమీపించాడు. చుట్టూ గుడిసెలూ, రోడ్డుకి రెండుప్రక్కలా చెట్లు వున్నాయి.

"దున్నడు కావాలి. కొండపల్లి నుండి వచ్చాను నేను" అన్నాడు.

ఒక గిరిజనుడు చొరవచేసి, "నువ్వెందుకు తెలీదు? దున్నడు అడుగో" అన్నాడు. సారధితోబాటు స్నేహితులు అటు చూశారు.

మొరటుగా వున్న మనిషి ఒకడు చెట్టుక్రింద నిలబడి వున్నాడు. అతడి ఒంటిన చిన్న నడుముగుడ్డ వుంది. అతడి చేతిలో విల్లు వుంది. వీపుమీద బాణాలు పొదివుంది. కుడి చేతిలో ఒక బాణం పట్టుకున్నాడు.

"ఎందుకు?" అడిగాడతడు. అతడి గొంతు చాల మొర టుగా వుంది. నేలమీద రేకుతో గీచినట్టుగా గొంతు జీర బోయింది.

సారధి అటు నడిచి, "దున్నడంటే నువ్వేనా?" అన్నాడు.

"వూ(!"

"నీ గురించి విన్నాం. ఎలాంటి విషపదార్థం అయినా నిన్ను ఏమీ చేయదట."

"ఎవరు చెప్పారు?"

"పేపర్‌లో రాశారు. వార్తలూ అవీ రాసే పేపర్."

"రాయడానికి ఆళ్లెవరు?"

"ఎక్కడ ఏ విచిత్రం వున్నా రాస్తారు. పేపర్‌లో పని చేసే మనిషికి నీ గురించి తెలిసివుండాలి. అతడు పేపర్‌లో రాశాడు.

దున్నడు అలాగా అన్నట్టు చూశాడు.

"విషం నీమీద ఎందుకు పనిచేయడం లేదు?"

"నాకు తెలియదు."

గిరిజనులు యిద్దరి సంభాషణనూ నోరావులించుకుని వింటున్నారు.

"చిన్నప్పటి నుండీ నీకు విషంతో కలసిన పదార్థాలు తినడం అలవాటా?"

"నాకు తెలియదు."

సారధి నుదురు చిట్లించాడు. "నిన్ను తేలుకుట్టిందా ఎప్పుడయినా?" అన్నాడు.

"నన్ను తేలుకానీ, పాముకానీ ఇంతవరకూ తాకలేదు."

"ఏం? ఎందుకు తాకలేదు?"

"ఏమో?"

"నువు రోజూ ఏం తింటూంటావు?"

"ఏముంది? మామూలే!"

"సారధీ! అతడు ఏమీచెప్పడు. అనవసరం. అడగక!" అన్నాడు ప్రసాద్.

దున్నడు కోరగా చూపి ఎటో వెళ్తున్నవాడిలాగా అక్కడినుండి బయల్దేరిపోయాడు. అక్కడున్న గిరిజనుల వద్ద సెలవు పుచ్చుకుని బృందం కదిలింది.

ఎవరో కుర్రవాడు జీపును అడ్డంగా సమీపించాడు. జీపు ఆగింది.

గెస్టుహౌస్ కీపర్ చటుక్కున జీపు దిగి, "ఏంరా? యిటు వచ్చావు?" అన్నాడు.

"అయ్యా! మన ఆవు కనిపించడం లేదయ్యా!" అన్నాడు కుర్రవాడు.

కీపర్ మొహం తెల్లబడింది. "నిజమా?" అన్నాడు.

జీపు డ్రయివర్ కలగచేసుకుని "ఏ ఆవు? రంగు ఎలా వుంటుంది?" అన్నాడు.

స్నేహితులు మొహాలు చూసుకుంటున్నారు.

"తెల్లటి ఆవు బాబూ! మంచి బలిష్ఠమైన ఆవు" లబ లబలాడాడు కీపర్.

"మా చుట్టుప్రక్కల గ్రామాల్లో రోజూ పశువులు మాయమవుతున్నాయి. కారణం తెలియటంలేదు బాబూ!"

"ఇతడు మీ అబ్బాయా?"

"అవును బాబూ!"

"ఆవును ఎక్కడ మేపారు?"

"ఇక్కడే బాబూ, చుట్టుప్రక్కల."

"జలపాతానికి దగ్గరగా వెళ్ళివుంటుందా?" సారధి కలగచేసుకున్నాడు.

"అటు వెళ్ళనివ్వం సార్!"

"ఏం?"

"జలపాతంలో పడిపోవచ్చును సార్. లేదా .... అటు ప్రక్క మాంసం తినే చెట్లు వున్నాయి."

"మాంసం తినే చెట్లా?" తెలియనట్టు అడిగాడు సారధి.

"అవును బాబూ! వాటి కొమ్మలు జంతువులను కానీ. మనుషులను కానీ పట్టుకుంటాయి. జలగ పీల్చినట్టుగా రక్తాన్నీ, కండలనూ పీల్చుతాయి. ఎముకలను మాత్రం వదలిపెడతాయి."

"నిన్న మీ ఆవు అటు వెళ్ళిందేమో!"

గెస్టుహౌస్ కీపర్ అనుమానంగా కొడుకువంక చూశాడు. కొడుకు తలదించుకున్నాడు.

సారధి వాడిని బుజ్జగించి, "ఆవును నువ్వే విప్పుతావు కదూ!" అన్నాడు.

వాడు తలూపాడు.

"ఆవు నిన్న ఎప్పటినుండి కనిపించడం లేదు:"

"నిన్న మధ్యాహ్నం నుండి."

"ఏ ప్రాంతాల్లో ఆవును మేపావో చూపిస్తావా?"

వాడు తలూపాడు' జీపులో గెస్టుహౌస్ కీపర్‌తోబాటు అతడి కొడుకు కూడా కూర్చున్నాడు. కొడుకు చూపిస్తోంటే జీపు వూరికి దూరంగా సమతల ప్రాంతంలో ఆగింది. సారధీ అతడి స్నేహితులూ జీపుదిగి చుట్టూ చూశారు.

ఎక్కడి నుండో జలపాతం హోరు వినిపిస్తోంది.

"జలపాతం యిక్కడికి ఎంతదూరం వుంటుంది?" అడిగాడు సారధి.

"దూరమే సార్! అది ఎత్తుమీద వుంది. అందుకే విని పిస్తుంది హోరు."

సారధి అతడి కొడుకును భుజంమీద చెయ్యివేసి, "ఆవు యిక్కడ ఏ యే ప్రాంతాల మేత మేపిందో చెప్ప గలవా?" అన్నాడు.

కుర్రవాడు ఆ ప్రాంతం అంతా తిరిగి చూపించాడు. మైదాన ప్రాంతం. జలపాతం హోరు వినిపిస్తున్నవైపుగా అడ్డదిడ్డమైన కాలిబాటవుంది. సారధి కాలిబాటకు ప్రక్కగా నడిచాడు. కాలిబాటలో గిట్టల ఆనవాళ్ళున్నాయి. గిట్టల జాడలు జలపాతంవైపు దారితీశాయి.

స్నేహితులు సారధిని అనుసరించారు. ఆవుగిట్టలు పల్లంలోకి దిగాయి. తరువాత మెరక ఎక్కి మాయ మయాయి. మెరకకు అటుప్రక్క జలపాతం! విషవృక్షం వున్నాయి.

"మెరకమీద కూడా కాలిబాట వుంది. కాని ఆవు కాలి బాటలోంచి నడవలేదు" అన్నాడు కాంత్.

"కరెక్టు! నలుగురూ నాలుగుప్రక్కల వెతకండి. చాల జాగ్రత్త! పురుగూపుట్రతో బాటుగా లతలూ, చెట్లూ, ప్రమాదకారులు" సారధి ముందుకు కదిలాడు. చెట్లమధ్య నుండి పొదలకు దూరంగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు.

ఉన్నట్టుండి ప్రసాద్ అరిచాడు. "గిట్టలు ...అటూఇటూ నేలను తవ్వినట్టు పెద్దపెద్ద జాడలు!"

సారధి, కాంత్ అటు పరుగెత్తారు. ఆవు అక్కడ పరుగులు తీసింది. తరువాత ఒకచెట్టువైపు మళ్ళింది. కాంత్ చెట్టును పరిశీలగా చూపి ధైర్యంగా దానికిందకు వెళ్ళాడు.

మానుకు బాణం గుచ్చుకుని వుంది. కాంత్ దాన్ని పెరకబోయి. ఆగి, "సారధీ!" అన్నాడు.

సారధి అక్కడికి చేరుకుని బాణాన్ని పరిశీలగా చూశాడు. తల పంకించాడు. డ్రయివర్‌ని కేకపెట్టి జీపును రప్పించాడు. జీపులోంచి స్ప్రియర్, సెలోఫెన్ టేపు తీశాడు. బాణంమీది వేలిముద్రలు టేపులోకి రవాణా చేశాడు. తరువాత బాణాన్ని వూడబెరికాడు.

"ఇది మన్నడు వుపయోగించే బాణం!" అన్నాడు ప్రసాద్.

స్నేహితులు మరల ఆవుగిట్టల జాడ వెతికారు. ఆవు జలపాతం దాటి విష వృక్షంవైపు మళ్ళింది. మధ్య మధ్య అది దారితప్పినా చివరికి విషవృక్షం దాపులకు వెళ్ళింది.

వృక్షం కొమ్మలు కంగారుగా వూగుతున్నాయి. విపరీత మైన వేగంతో ముడుచుకుంటూ తెరచుకుంటున్నాయి. గాలికి వికృతంగా వూగుతోంది. జలపాతం హోరూ, కొమ్మలు వూగే గుసగుసల శబ్దం, చుట్టూ కారడవి నిశ్శబ్దంలో క్రూరత్వం నింపుతోంది.

"వృక్షానికి అయిదాడు అడుగుల ఇవతల గిట్టల జాడలు అంతమయాయి!" అన్నాడు మల్లేశ్వరం.

గెస్టుహవుస్ కీపర్ గుండెలు బాదుకున్నాడు. అదిగో! చెట్టు మొదట్లో ఎముకలగూడు" అన్నాడు.

సారధి అతడి భుజంతట్టి, "నీ పరిస్థితికి విచారంగా వుంది. గెస్టుహవుస్‌కి వెళ్దాం. తర్వాతి కార్యక్రమం గురించి మనం ఆలోచించుకోవాలి!" అన్నాడు.

కీపర్ ఏడుస్తూ, "ఏం ఆలోచిస్తాం సార్! దున్నడు బలవంతుడు. ఈ విషయం బయటపెడితే నన్నూ నా కుటుం

బాన్ని చంపుతాడు. ఇందాక చెట్టు మానుకు గుచ్చుకున్న బాణం నా గుండెల్లో గుచ్చుకుంటుంది" అన్నాడు.

4

కాంత్ చిటికె వేశాడు. "నాదో ఆలోచన...." అన్నాడు.

సారధి ఆలోచనలు ఆపి, "చెప్పు" అన్నాడు.

కొండపల్లి గెస్ట్‌హవుస్‌లో స్నేహితులు సమావేశమయారు. దున్నడి గురించి చర్చ మొదలయింది. దున్నడు ఆవును విషవృక్షంవైపు ఎందుకు తరిమాడు? అందువలన అతడికి ఒరిగేదేమిటి?

"దున్నడికీ, గెస్ట్‌హవుస్ కీపర్‌కీ పాత కక్ష లుండి వుంటాయి" అన్నాడు కాంత్.

"సారధి నిట్టూర్చి, అసలు దున్నడు ఎవరో తెలియదు మనవాడికి. మనం రాబట్టే అతడికి దున్నడితో ప్రత్యక్ష పరిచయమయింది" అన్నాడు.

"దున్నడు పగబట్టినట్టు కీపర్‌కి తెలిసివుండదు."

"పగా, ప్రతీకారం వదిలెయ్యి. చుట్టుప్రక్కల గ్రామాల్లో ఇటీవల చాల పశువులు కనిపించకుండా పోయాయట. పశువులే ఎందుకు మాయం కావాలి? అన్ని పశువులూ విషవృక్షానికే బలయాయా?"

"మనం దున్నడిని ఫాలో అయితే?"

"అదీ ఆలోచన."

"అతడిని వెంటాడటం చాలా ప్రమాదం. మన నలుగురినీ అంతం చేసినా ఆశ్చర్యంలేదు."

"ఆల్‌రైట్! అందరమూ వెంటాడవద్దు. నేను మొదట వెళ్తాను. ఉదయానికల్లా గెస్ట్‌హవుస్‌కి రాకపోతే నా

కోసం దున్నడి యింటికి వెళ్ళండి" సారధి స్థిరనిర్ణయంతో లేచి నిలబడ్డాడు.

గదిలో సూది పడితే వినిపించే నిశ్శబ్దం.

"జీపులో నన్ను అడ్డగర్ర గ్రామానికి యివతల విడిచి పెట్టండి. దున్నడిని మనం కొన్ని రాత్రులపాటు వెంటాడ వలసి వస్తుంది" సారధి తల త్రిప్పి డ్రయివర్ వైపు చూశాడు.

డ్రయివర్ బయటికి వెళ్ళి జీపు సిద్ధం చేశాడు.

చీకటి.... అడవి ప్రాంతం పట్టపగలే ఒంటరితనంతో అల్లల్లాడిపోతుంది. చీకట్లో యిక చెప్పనక్కరలేదు. కీచు రాళ్ళ మోతా, ఎక్కడో క్రూరజంతువుల అరుపులను మోసుకువస్తోన్న గాలీ, మధ్య మధ్య వెర్రిగా వీచే గాలి కెరటాలూ మనిషికి గుబులు పుట్టిస్తాయి.

సారధీ, అతడి స్నేహితులూ జీపులో అంత చీకటి లోనూ బయలుదేరారు. అడ్డగర్రకు ఇవతల సారధి జీపు దిగాడు. స్నేహితులకు జాగ్రత్త చెప్పి చిన్నసంచి భుజాన తగిలించుకుని బయలుదేరాడు సారధి.

జీపు వెనక్కి తిరిగింది.

సారధి చుక్కల వెలుగులో గ్రామంవైపు నడిచాడు. అతడిలో ఆలోచనలు చెలరేగుతున్నాయి. తాను వేస్తోన్న అడుగు ప్రమాదంవైపు! పరిశోధనవైపు! తాను దున్నడి కుట్రను బయటపెట్టగలడా? ఈ పరిస్థితిలో గురువుగారు శిరీష్ వుంటే ఏం చేసేవారు? ఏమీ తెలియని ఈ అడవి ప్రాంతాల వ్యవహారాల్లో తలదూర్చేవారా?

గంభీరలోయతట్టు ఆచారవ్యవహారాలకు భంగం కలి గించవద్దని డిటెక్టివ్ శిరీష్ హెచ్చరించారు. దున్నడి వ్యవ

హారం ఆచారవ్యవహారాలకు సంబంధించిన విషయం కాదు కదా!

లోయతట్టు ప్రాంతంవారి పశు సంపద అన్యాయంగా హరించుకుపోతోంది. ఇది ఆచారం యెలా అవుతుంది?

సారధికి కొండంత బలం వచ్చింది. అన్యాయానికి వ్యతిరేకంగా, అమానుషత్వానికి విరుద్ధంగా మానవత్వం వున్న మనిషికి వచ్చే బలం! సారధి చురుకుగా అడుగులు వేశాడు.

అతడిని నీడలా యెవరో వెంటాడుతున్నారన్న సంగతి తెలియదు. అతడిలాగానే వెంటాడే వ్యక్తి కూడా నడిచేటప్పుడు చప్పుడవకుండా మెత్తటి రబ్బరు బూట్లు వేసుకున్నాడు. నల్లటి మసిలాగా చీకటిలో కదులుతున్నాడు.

సారధి గ్రామంలో ప్రవేశించాడు చెట్ల చాటు నుండి మెల్లగా కదులుతున్నాడు. దున్నడి యిల్లు చెట్లమాటున కనిపిస్తోంది. గుడిసెకు తడికె దగ్గరగా చేరవేసి వుంది. గుడిసె ముందు దీపం వెలుగుతోంది. సారధి చెట్ల చాటున చీకట్లో ఆగి దున్నడి యింటిమీద దృష్టిని వుంచాడు.

దున్నడికీ, విషవృక్షానికీ, పశువుల అంతర్ధానానికీ అవినాభావ సంబంధం వుండివుండాలి. ఆ మాటే నిజమయితే దున్నడు రాత్రివేళలో గానీ, పగటివేళలో గానీ విషవృక్షం వద్దకు వెళ్ళివస్తాడు. ఈ పగలంతా అతడు యిల్లు కదల లేదు. అందువలన ఈ రాత్రి అయినా కదలవచ్చు.

గంట గడిచింది. రాత్రి పది దాటుతూంది. అడవి లోంచి చల్లటిగాలి వీస్తోంది. రాత్రివేళ కావడంవలన

దోమలు విపరీతంగా చుట్టుముడుతున్నాయి. అయినప్పటికీ సారధి సహనంతో కాచుక్కూర్చున్నాడు. చివరికి అతడి నిరీక్షణ ఫలించింది.

పదిన్నర అవుతూనే దున్నడి గుడిసె ముందున్న తడికె అడ్డం తప్పుకుంది. దున్నడు బయటికి వచ్చి అటూ ఇటూ చూశాడు. మెల్లగా తడికె దగ్గరగా జేరవేసి నడవడం మొదలుపెట్టాడు. సారధీ, అతడిని వెంటాడుతూన్న వ్యక్తీ దున్నడివెంట అనుసరిస్తున్నారు.

దున్నడికీ సారధికీ నలభై యాభై అడుగుల దూరం వుంటూ వెంటాడుతున్న వ్యక్తి యిద్దరినీ దృష్టిపథంలోంచి తప్పిపోకుండా జాగ్రత్త పడుతున్నాడు.

దున్నడు అలవాటుపడిన దారిలో పావుగంటలో విష వృక్షం వద్దకు చేరుకున్నాడు. నక్షత్రాల వెలుతురులో విషవృక్షం మత్తుగా నిలబడిన భారీమనిషిలాగా వుంది. కొమ్మలు నేలకువాలి నిశ్చింతగా విశ్రాంతి తీసుకుంటున్నాయి. దున్నడికి దగ్గరలో మామిడి చెట్టు మాను చాటున ఆగాడు సారధి. సారధికి పదడుగుల దూరంలో వెంటాడుతున్న వ్యక్తి పొదలమాటున ఆగాడు.

దున్నడు బొడ్లోంచి కత్తి తీశాడు. విషవృక్షం కొమ్మ లలో ఎంచుకుని ఒక కొమ్మ నరికాడు. సన్నపాటి కొమ్మను పిల్లలు బొప్పాయి కాడతో నీళ్ళు తాగి ఆడు కున్నట్టుగా నోట్లో వుంచి పీల్చసాగాడు. పీల్చేటప్పుడు అతడు గుటకవేసే శబ్దం నిశ్శబ్దంగావున్న అడవిలో భయం కరంగా వినిపిస్తోంది. దున్నడు చివరిబొట్టువరకూ పీల్చి మెల్లగా నేలమీదకు సోలిపోయాడు.

సారధి వూపిరి బిగబెట్టి చూస్తున్నాడు. వెంటాడు తూన్న వ్యక్తి అటు దున్నడినీ యిటు సారధినీ మార్చి

మార్చి చూస్తున్నాడు. పది నిమిషాల తర్వాత దున్నడు లేచాడు. చెట్టు మొదట్లోవున్న ఆవు ఆ స్థిపంజరాన్ని సమీపించాడు. దాన్ని చేతులమీదుగా లేపాడు. ఎముకలను కదపడంతో దుర్వాసన వ్యాపించింది. సారధికి ముక్కుపుటాలు పగిలిపోతున్నట్టు తోచింది. అతి కష్టంమీద నిగ్రహించుకున్నాడు.

కాని అతడిని వెంటాడుతున్న మనిషి నిగ్రహించుకోలేకపోయాడు. అడవి మారుమ్రోగేలాగా, కొన్నిక్షణాల పాటు జలపాతం హోరు వినిపించకుండా వుండేలాగా, బాగా గాస్‌పట్టిన సోడాబుడ్డిని ఓపెనర్‌తో తెరచినట్టు ఆఆ(... ఆఛ్‌మని తుమ్మాడు.

ఎముకలగూడు మోసుకురాబోతున్న దున్నడు వులిక్కిపడ్డాడు. అతడికంటె ఎక్కువగా కంగారుపడ్డాడు సారధి. పొదల మాటున వున్నది ఎవరు? అతడు కూడా తనలాగే దున్నడిని వెంటాడుతూ వచ్చాడా?

దున్నడు ఎముకల గూడును నేలమీదకు విసరికొట్టాడు. విల్లు విడిచిన బాణంలాగా తుమ్ము వినిపించిన వైపు దూసుకు వచ్చాడు. జరగబోయేదేమిటో సారధి వూహించగలిగాడు తుమ్ము తుమ్మిన వ్యక్తి ఎవరయితే యేంగాక! దున్నడు అతడిని కరచి చంపేస్తాడు.

దున్నడు పరుగెత్తే దారిలో చటుక్కున కాలు అడ్డం పెట్టాడు. దున్నడు మొగ్గవేశాడు. చీకట్లో దబ్బున పొదలకు యివతలపడ్డాడు. పడుతూనే ఘీంకరించాడు. చటుక్కున లేవబోయాడు. శరీరంలో ముళ్ళు దిగాయి. ప్రక్కకు దొర్లి చేతులమీద ఆనుకున్నాడు. బాధగా మూలుగుతున్నాడు.

సారధి చకచక పొదలను సమీపించాడు. వెంటాడు

తున్న మనిషి చేష్టలు దక్కి కూర్చుండిపోయాడు. సారధి అతడిని లేపదీపి దూరంగా నడిపించుకు వెళ్ళాడు

"ఎవరు నువ్వు?" అడిగాడు సారధి.

"గెస్టుహౌస్ కీపర్‌ను బాబూ!" అన్నాడు వెంటాడే మనిషి.

5

ప్రసాద్ తల అడ్డంత్రిప్పి, "మీరు ఆ సమయంలో దున్నడిని వదలి రావడం ఏమీ బాగుండలేదు" అన్నాడు.

సారధి మెల్లగా నవ్వి, "ఆ సమయంలో దున్నడిని ఎదుర్కోవడం ప్రమాదం. పిస్తోలు ఉపయోగించామా, ఈ ప్రాంతపు గిరిజనులు తమకు మనం అపకారం చేసినట్టు భావిస్తారు. దున్నడి నేరం రుజువు కావాలంటే అతడు బతికి వుండాలి. అందుకే గెస్టుహౌస్ కీపరూ నేనూ తప్పించుకు వచ్చేశాం" అన్నాడు.

"దున్నడి ప్రవర్తన విడ్డూరంగా వుంది అతడు విషవృక్షం తాలూకా కణరసం తాగి విషకాయుడయాడు. కాని పశువులను అటుతరిమి అతడు సాధించ దల్చుకున్న దేమిటి?"

"విషవృక్షం మాంసాహారంమీద మాత్రమే బతకగలుగుతుంది. తనలో సమృద్ధిగా విషస్రావాలు తయారుచేసుకోగలుగుతుంది. దున్నడు దానికి ఆహారసంపాదనలో సహకరిస్తున్నట్టు మనం అర్థం చేసుకోవాలి."

"దారుణంగా వుంది. కనీసం నమ్మసుకూడా నమ్మలేక పోతున్నాం. వృక్షాన్ని పోషించడం, దానిమీద ఆధారపడి బతకడం—మనిషికి తెలిపిన దారిని దున్నడు ఏ రకంగా వుపయోగించుకుంటున్నాడో!"

కొంత వ్యాఖ్యానం విన్నాక స్నేహితులు బలంగా నిట్టూర్చి, తర్వాత మౌనంగా ఆలోచనల్లోకి జారుకున్నారు.

"గెస్టుహౌస్ కీపర్ యింట్లో అతడిని ఒప్పగించి వచ్చానుకదా! ఆ యింట్లో అందరూ ఒకటే గోల! అతడు రాత్రి నన్నుకూడా ఆవు అదృశ్యంపట్ల అనుమానించాడనీ, నన్ను వెంబడించాడనీ నాకే తెలియదు. ఇంట్లో అందరూ అతడిని చీవాట్లు వేశారు" అన్నాడు సారధి.

"అతడి యిల్లు యిక్కడికి ఎంతదూరం?" అడిగాడు మల్లేశ్వరం.

"ఫర్లాంగు కూడా వుండదు. అన్నీ అడ్డదారులు. అడ్డ గర్ర యిక్కడికి అరమైలు. జలపాతం మైలు, విషవృక్షం మైలు....అదే జీపువెళ్లే దారిలో అయితే నాలుగయిదు రెట్లుగా యివే దూరాలు పెరిగిపోతాయి."

గాజు కిటికీమీద ఎవరో గెస్టుహౌస్‌ను సమీపించినట్టు నీడ కదిలింది. కాంత్ బయటకు పరుగెత్తాడు. వెనుకనే మిత్రబృందం వెళ్ళారు.

డ్రయివరూ, స్నేహితులూ గెస్టుహౌస్ నాలుగుమూలలూ, చుట్టుప్రక్కలా వెతికారు. ఎవరూ కనిపించలేదు. తిరిగి అందరూ గదిలోకి చేరుకున్నారు.

"కాంత్ ఎక్కడ?" అడిగాడు మల్లేశ్వరం.

సారధీ, మల్లేశ్వరం, ప్రసాద్ మొహాలు చూసుకున్నారు. గదిలో చూచుకుని మళ్ళీ బయటికి నడిచారు. వాకిట్లోనే కనిపించాడు కాంత్. నేలమీదపడి ఒక ప్రక్కకు తిరిగి వున్నాడు. సారధి అతడివద్దకు గెంతి, ముక్కువద్ద చెయ్యి పెట్టాడు. వూపిరి పల్చగా చేతికి తగులుతోంది.

"ఒరేయ్ కాంత్!" పిలిచాడు సారధి.

మల్లేశ్వరం, ప్రసాద్ అతడికి దగ్గరగా చేరి కాంత్

శరీరంమీద చెయ్యివేశారు. అప్పుడు చూశారు. కాంత్ ఎడమభుజంలో సన్నపాటి ముల్లు గుచ్చుకుని వుంది. షర్ట్ చేతిలోంచి చర్మంలోకి దిగిపోయింది. ముల్లు వెనుకభాగం పట్టుకోవడానికి వీలుగా చెక్కివుంది. డ్రయివర్ దాన్ని తాకబోయి ఆగాడు.

"ఒరేయ్ కాంత్! ఏమయిందిరా?" సారధి కుదిపాడు.

"న....న్ను....దున్నదు....ఈ ముల్లు గుచ్చాడు...." వణుకుతున్నాడు కాంత్.

"ఒంట్లో ఎలా వుందిరా?"

"వాళ్ళంతా....సూదులు...గుచ్చినట్టు...ఒకగంటలో... ప్రాణం....పోతుందట...."

"ఎవర్రా అన్నది?" స్నేహితులు అరిచారు.

"దున్నదే....మనందరినీ....వాడు...చంపు....తాడు... వాడే బెదిరించాడు...."

సారధి దిగ్గున లేచాడు. "డ్రయివర్! జీపు సిద్ధం చెయ్యి" అని స్నేహితులవైపు తిరిగి "బట్టలూ, వస్తువులూ సర్దండిరా. నలభై నిమిషాలలో వైజాగ్‌లో వుండాలి" అని కాంత్‌ను మెల్లగా భుజానికెత్తుకున్నాడు.

"జీపు రెడీసార్!" అన్నాడు డ్రయివర్.

స్నేహితులు జీపులో కూర్చున్నారు. కాంత్ తల సారధి ఒడిలో వుంది. శరీరం సీటుమీద చాపి వుంది. కాళ్ళవద్ద ప్రసాద్ కూర్చున్నాడు. మల్లేశ్వరం మధ్యమధ్య కాంత్ నుదురుమీద తడిగుడ్డ పట్టీలు మార్చసాగాడు.

జీపు శరవేగంతో పరుగెత్తింది. జలపాతం హోరు లోంచి జీపు దూసుకుపోతోంది. విషవృక్షం కొమ్మలను చాపుతోంది. నిరాశగా ముడుస్తోంది.

స్నేహితులుకానీ డ్రయివర్ కానీ దాన్ని పట్టించుకునే స్థితిలో లేరు.

6

"అయిదు నిమిషాలలో నర్సింగ్ హోంలో వుంటాను." డిటెక్టివ్ శిరీష్ రిసీవర్‌ను క్రెడిల్ చేసి బయటికి పరుగెత్తాడు.

డాట్సన్ కారు విశాఖనగర వీధులలో వురుకుతూ కరుణా నర్సింగ్ హోం ముందు ఆగింది. శిరీష్ హోంలోకి పరుగుతీశాడు. బెడ్ మీద కాంత్ పడుకుని వున్నాడు. డాక్టర్స్ అతడికి గ్లూకోజ్ ఎక్కిస్తున్నారు. కాంత్ చెమటలు కక్కుతున్నాడు. మొహంలో నీరసం, చావుకు దగ్గరవుతున్నానన్న భయం, ఆవేదనా స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్నేహితులు అతడిని చుట్టుముట్టారు.

సారథి భుజం తట్టి శిరీష్, "ముల్లు గుచ్చుకున్నాక యిప్పటివరకూ ఏం జరిగింది? వివరంగా చెప్పు!" అన్నాడు.

సారథి తనకు కాంత్ కనిపించిన విధానమూ, అతడికి ముల్లు గుచ్చిన వ్యక్తి చేసిన హెచ్చరికలూ చెప్పాడు.

శిరీష్ నిట్టూర్చి కాంత్ శరీరచ్ఛాయ గమనించాడు.

"డాక్టర్! శరీరం రంగుమారింది కదూ!" అన్నాడు శిరీష్.

డాక్టర్ తలూపాడు.

"ఏం విషమో డయాగ్నయిజ్ అయిందా డాక్టర్?"

"లేదు శిరీష్! ఈ విషయం యింతవరకూ వైద్య చరిత్రలో నమోదు కాలేదు. అందుకే యాంటీ పీనం పని చేయలేదు."

శిరీష్ అతడి మాటలు వినడంలేదు. కాంత్ పెదిమలు వొణుకుతున్నాయి.

"ప్ర....సా....ద్... మల్లేశ్వ....రం .... సారథీ ....

ముగ్గురూ వచ్చి....పోతా....రా....వాడు .... వదలడో రోయ్...." కాంత్ తల ఒకప్రక్కకు ఒరిగిపోయింది.

అంతసేపూ ఆ గదిలో అలుముకున్న వుద్విగ్న వాతావరణం ఒక్కసారిగా మరింత గాంభీర్యం పులుముకుంది.

"కాం....త్...." సారధి గొంతు వణికింది ప్రసాద్, మల్లేశ్వరం ఒకరిని పట్టుకుని ఒకరు ఏడుస్తున్నారు.

డిటెక్టివ్ శిరీష్ గుప్పెళ్ళు బిగుసుకున్నాయి. కాంతే పైకి రావలసిన యువకుడు. అతడిని దున్నడు పొట్టన పెట్టుకున్నాడు. అతడిని నమ్ముకుని ఆశలు పెంచుకున్న తలిదండ్రులకు ఏం చెప్పగలరు ఎవరయినా?

డిటెక్టివ్ శిరీష్ మెల్లగా బెడ్ వద్ద నుండి కదిలి, టెలిఫోన్ వున్న బల్లను సమీపించాడు. క్రయింబ్రాంచికి ఫోన్ చేశాడు. ఇన్స్పెక్టర్ కుమార్ పలికాడు.

"కరుణా నర్సింగ్ హోంకి ఒక్కసారి రా! అర్జెంట్!" అన్నాడు శిరీష్.

"వస్తున్నాను" అన్నాడు కుమార్.

7

జీపు నడుపుతున్నాడు డిటెక్టివ్ శిరీష్. సారధి దారి చూపుతున్నాడు. జీపు అటవీప్రాంతంలో పరుగెత్తి విష వృక్షానికి దగ్గరగా ఆగింది. ఎండవేడిమి తీవ్రంగా వుంది. వృక్షం కొమ్మలు కదిలిక వచ్చిన శవంలాగా కదులుతున్నాయి. వృక్షం మొదట్లో ఎముకలగూడు వుంది. అక్కడినుండి దుర్వాసన వెలువడుతోంది.

తరువాత జీపు అడ్డకర్ర గ్రామంలో ప్రవేశించింది. ఎక్కడ చూచినా గిరిజనులు గుంపులు గుంపులుగా చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. జీపును చూడగానే వాళ్ళు గుసగుసలు ఆపి జీపును సమీపించారు.

"ఏమైంది తాతా?" అడిగాడు శిరీష్, ఒక ముసలతడిని.

వృద్ధుడు గడ్డం నిమురుకుంటూ, "మా పశువులు నాశనమై పోయాయి బాబుగారూ! ఇంతకాలమూ కారణం తెలియలేదు. ఇప్పుడు తెలిసింది" అన్నాడు.

"ఏమిటా కారణం!"

"మా పశువులను విషం చెట్టుకు బలిపెడుతున్నాడు. చెట్టు మొదట్లో ఒక ఎముకలగూడు కనిపించింది. ఇదంతా దున్నడి పనే!"

"ఎలా బలిపెడతాడు. మీరంతా జాగ్రత్తగా చూసుకుంటారుగదా!"

"ఏం చూసుకుంటాం బాబుగారూ! వాడు ఏ పొదల చాటునో బాణాలు పట్టుకుకూర్చుంటాడు. పశువులను బాణాలతో తరుముతాడు. పశువుల కాపరికి తన పశువులు తప్పిపోయాయని తెలిసేలోపుగా విషంచెట్టు తిననే తినేస్తుంది.

"ఇప్పుడు అతడినేం చేస్తారు?"

ఏం చెయ్యడానికయినా అతడుంటే కదా బాబుగారూ! తన గుడిసెకు నిప్పుపెట్టుకుని మాయమయాడు."

శిరీష్ వులిక్కిపడి, "మాయమయాడా? ఎక్కడికి వెళ్ళివుంటాడు?" అన్నాడు.

"ఏమో బాబూ! నిన్న ఈ బాబు యిదే బండిలో వచ్చారు. దీని వెనకనే పరుగెత్తుకు వెళ్ళినట్టు దున్నడి గురించి కొంతమంది పిల్లలు చెప్పారు."

శిరీష్ సాభిప్రాయంగా సారధిని చూశాడు.

"నేను గమనించలేదు సార్!" అన్నాడు సారధి.

"అతడి యిల్లు చూపించు సారధీ."

"రండి సార్" సారధి ముందు దారితీశాడు. ముసలతడికి కృతజ్ఞలు చెప్పుకుని శిరీష్ తన అసిస్టెంటు నమస

రించాడు. చెట్లమధ్య మసికుప్ప వుంది.

"ఇదేసార్! దున్నడి యిల్లు!" అన్నాడు సారధి.

శిరీష్ నిట్టూర్చి, "దున్నడికి గిరిజనులకంటె ముందే తన విషయం వాళ్ళకి తెలిసిపోతుందని అర్థమైపోయింది. మరల ఈ గ్రామానికి రానని చెప్పడం కోసమే తన గుడిసె నిప్పంటించుకున్నాడు. అతడు జీపు వెంటపడి పరుగెత్తడం నిజమే అయివుంటే అతడు మీమీద పగబట్టి వున్నాడన్న మాటే!" అన్నాడు.

"పగా? ఎలా తీర్చుకుంటాడు సార్?"

"గిరిజనులకు మనకంటె కూడా పగ—ప్రతీకార విషయంలో పెరిగిన తెలివితేటలు యెక్కువ. తమకు జరిగిన అన్యాయానికి సహించి వూరుకోరు. అందులోనూ దున్నడు విషపూరితుడు. అతడిలో శాడిజం మరింత హెచ్చుగా వుంటుంది."

"విశాఖ మహానగరంలో నన్నూ, ప్రసాద్‌నూ, మల్లేశ్వరాన్ని పట్టుకోగలడా దున్నడు? అయినా అతడికి ప్రసాద్, మల్లేశ్వరం, కాంత్ ఎలాంటి అపచారం చేయలేదుకదా!"

"నువు దున్నడి శారీరక స్థితిని ప్రశ్నించావు. అతడి దారికి అడ్డం వెళ్ళావు. పొదలచాటున తుమ్మింది గెస్ట్ హవుస్‌కీపర్ అని అతడికి తెలియలేదు. అందుకే గెస్ట్ హవుస్ కీపర్‌ను క్షమించాడు దున్నడు. నీ వెంట వుండి నీ స్నేహితులు దున్నడి కోపానికి గురయారు."

"విచిత్రంగా వుంది సార్! అంతమాత్రానికే హత్యలు చేయాలా?"

"సారధీ! మనం నాగరిక సమాజంలో బతుకుతున్నాం. కోపతాపాలను తొక్కిపట్టుకొని నిత్యజీవితాన్ని ఒడిదుడుకు

లకు లోనవకుండా నడుపుకొంటాం. దున్నడు బతికే సమాజంవేరు స్వభావంవేరు. భావో ద్రేకులను మనకులాగా అదుపులో పెట్టుకోవడం తెలియని మనిషి దున్నడు."

"అర్థమైంది సార్! ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి?"

"ఏముంది? వెనక్కి తిరిగివెళ్ళడమే! గడ్డిమేటులో సూదిని వెదకాలి!"

క్రయిమ్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ జీపు ఆగి దిగాడు. పోలీసులు వలయంగా యేర్పడి జనాన్ని అదుపులో పెడుతున్నారు. వలయం మధ్యకు నడిచాడు కుమార్.

అతడికి పట్టుమని పాతికేళ్ళుండవు. తెల్లపాంటులో గడి షర్ట్ టక్ చేశారు. షర్ట్ జేబులోంచి ఏవో చిన్న కాగితాలు కనిపిస్తున్నాయి. చేతికి రిస్ట్‌వాచ్, కాళ్ళకు మెరూన్‌కలర్ షూస్ వున్నాయి. అతడు వెల్లకితలా పడివున్నాడు. కంఠం ముడివద్ద గాయం చూడకపోతే యెవరికయినా అతడు యింకా ప్రాణాలతోనే వున్నాడన్న భ్రమ కలుగుతుంది.

కుమార్ శవం గొంతుముడి పరిశీలించాడు. గాయం లోంచి రక్తం కారి కంఠం ఎర్రబడి వుంది. శవానికి కొద్ది దూరంలో రక్తం కారింది. రక్తంచార మీదనే అతడు వెల్లకిలా పడివున్నట్టు స్పష్టమవుతోంది.

పాథాలజీ సర్జన్‌వైపు సాభిప్రాయంగా చూశాడు.

సర్జన్ శవం చెయ్యి పట్టుకుని కొన్ని క్షణాలపాటు పరిశీలించాడు.

"ప్రాణం పోయి అరగంట కూడా అయివుండదు. శరీరం యింకా టెంపరేచర్ కోల్పోలేదు" అన్నాడు సర్జన్.

"హత్య జరిగింది. పట్టపగలు. జనసమ్మర్థ వుండే

జంక్షన్. చాలా విచిత్రంగా వుంది. హత్య ఎలా జరిగిందంటారు" అడిగాడు కుమార్.

"గాయం రక్తంతో కప్పబడిపోయింది. చిన్న గాయం అయినా కంఠం ముడి ఖచ్చితంగా తెగిపోయింది. శ్వాస నాళం తెగిపోతే నిమిషాలలో హృదయ చలనం ఆగిపోతుంది."

ఫోటోగ్రాఫర్ కెమెరా సర్దుకొని ముందుకు వచ్చాడు.

కుమార్ ప్రక్కకు తప్పుకున్నాడు. అప్పుడే గుంపు అవతల డాట్సన్ కారు ఆగింది. డిటెక్టివ్ శిరీష్, అసిస్టెంట్ సారధి ఆగారు. కుమార్ వాళ్ళకు యెదురు వెళ్ళాడు శవాన్ని చూశాక సారధి మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. ఎన్నో శవాలను చూశాడు. ఎంతో జుగుప్సాకరమైన హత్యా దృశ్యాలను చూశాడు. కాని స్నేహితుడు కిరాతకంగా కంఠం తెగి దిక్కుమాలిన చావు చచ్చిపోయాడు.

"...మల్లే....శ్వరం...." గొంతు వణికిపోయింది.

శిరీష్ అతడి భుజంతట్టి, నువ్వు వెళ్ళి అతడివాళ్ళకు విషయం చెప్పు" అని కారుతాళంచెవి ఇచ్చి పంపేశాడు. సారధి అక్కడవుండి తట్టుకోలేడు.

"ఇతడి గురించి ఆచూకీ ఇచ్చిందెవరు?" అడిగాడు శిరీష్.

"ఎవరో కంట్రోల్‌రూంకి ఫోన్ చేశారు. సిబ్బందిని ముందు పంపించి తర్వాత నేను వచ్చాను. ఇతడిని ఇప్పుడు మీ అసిస్టెంట్ గుర్తుపట్టాడు."

"అవును. ఇతడి పేరు మల్లేశ్వరం" అంటూ డిటెక్టివ్ శిరీష్ గంభీరలోయలో జరిగిన విషయం, దున్నడి ప్రవర్తన గురించీ క్లుప్తంగా చెప్పాడు.

"అంటే మల్లేశ్వరాన్ని చంపింది దున్నదేనంటారా?"

"నిస్సందేహంగా. ఒక గంట క్రితమే జీపులో తిరిగి వచ్చాం. దున్నడు గంభీరలోయలో లేడని ప్రసాద్‌నూ, మల్లేశ్వరాన్నీ హెచ్చరించాలనుకున్నాను.అప్పటికే దున్నడు యాక్షన్‌లోకి దిగాడు" శిరీష్ మెల్లగా కుమార్ భుజంతట్టి చుట్టూ వున్న షాపులవైపు నడిచాడు. దర్యాప్తు మొదలు పెట్టాడు.

"అక్కడ చచ్చిపోయిన యువకుడిని ఎవరయినా మొరటుమనిషి వెంటాడటంగానీ, ప్రక్కనే నడవటంకానీ ఎవరయినా చూశారా?" యిదే ప్రశ్న అడుగుతూ వచ్చాడు. కుమార్ శవ పంచాయితీలో లీనమయి పోయాడు.

ఆశ్చర్యం! ఎవరూ దున్నడిని చూడలేదు. తన వూహ తప్పేమో? దున్నడు ఈ హత్య చేయలేదేమో! ఇంత మహానగరంలో మల్లేశ్వరాన్ని యెలా పట్టుకొన్నాడు దున్నడు? రిక్షావాళ్ళను సమీపించాడు శిరీష్.

వాళ్ళలో ఒకడు దున్నడిని పరిశీలించాడు. అతడి ఒంటిన గోచీ తప్ప మరేమీ ఏమీలేదు. మొండిగా వున్నాడట. కర్కశంగా చూపులు. అతడు మల్లేశ్వరాన్ని క్రూర జంతువులాగా వెంటాడి, ఒక్కసారిగా మనిషిని కింద పడేసి గొంతు కొరికాడు.

"బాబుగారూ! పోలీసులతో బాధలుపడలేను. నేను చెప్పినట్టు చెప్పకండి బాబుగారూ! మీకు పుణ్యం వుంటుంది" బతిమాలాడు రిక్షావాలా.

శిరీష్ అతడికి ధైర్యంచెప్పి, "అతడు ఎటు మాయ మయ్యాడో చెప్పగలరా?" అన్నాడు.

"కన్ను మూసి తెరిచేలోగా ఆ సందులోకి పారి పోయాడు బాబుగారూ!"

శిరీష్ అతడిచేతిలో పదిరూపాయల నోటుపెట్టి అతడు చూపించిన సందులోకి పరుగెత్తాడు. సందు దాటితే సన్నటి రోడ్డు ఎదురయింది. దున్నడి గురించి వర్ణించి శిరీష్ ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తూ ముందుకు వెళ్ళాడు.

9

ప్రసాద్ సందులోకి నడిచాడు. అటూఇటూ చూశాడు. సందు నిర్జనంగా వుంది. సందు దాటి రోడ్డుమీద అడుగు పెట్టాడు. అతడి కళ్ళు తీక్షణంగా పని చేస్తున్నాయి చెవులు సునిశితంగా వెనక వినిపించే చప్పుళ్ళకోసం ఓరగా పెట్టి వుంచాడు.

పదినిమిషాలు అటూ యిటూ తిరిగి రోడ్డు దాట బోయాడు. అతడి మెడమీద నరాలు జలదరించాయి. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. గాలి సర్రున కోసింది. ప్రసాద్ చేతులమీదుగా ప్రక్కకు మొగ్గవేశాడు. వెనుక నుండి దూసుకువచ్చిన దున్నడు ముందుకు తుళ్ళిపడ్డాడు. పడినంత వేగంగానూ లేచి ప్రసాద్‌మీదకు తోడేలులాగా విరుచుకుపడ్డాడు.

ప్రసాద్ కాళ్ళలో శక్తిని కూడగట్టుకున్నాడు. దున్న డిని గుండెలమీద తన్నాడు. దున్నడు వెనక్కిపడ్డాడు. ప్రసాద్ ఒక్క ఉరుకుతో లేచినిలబడి దున్నడిని చెయ్యి పట్టి లేపి పొట్టలోతన్నాడు. దున్నడు దెబ్బ కాచుకున్నాడు. ప్రసాద్‌ను కాలుపట్టి క్రిందకు పడవేశాడు.

వెల్లకిలాపడ్డాడు ప్రసాద్. దెబ్బతిన్న బెబ్బులిలాగా

ప్రసాద్ మెడమీద చెయ్యివేశాడు దున్నడు. విసురుగా మొహాన్ని అతడి మెడదగ్గరకు తీసుకువచ్చాడు. ప్రసాద్ ప్రమాదం గుర్తించాడు. అరచేతిని బ్లేడులాగా పెట్టాడు. దున్నడు పళ్ళు బయటపెట్టి అతడిగొంతు కొరకడానికి సిద్ధపడ్డాడు. బ్లేడు ఫెటీల్మని దున్నడి పరువరసమీద తగిలింది. పళ్ళఎముకలు కదిలాయి. దున్నడికి మరింతకోపం వచ్చింది. పళ్ళు కదిలి రక్తం వుప్పగా తగిలింది.

ప్రసాద్ దెబ్బమీద దెబ్బ వేస్తున్నాడు. దున్నడి మొహంమీద పడే దెబ్బలు చప్పుడు చేస్తున్నాయి. దౌడ ఎముకలు పగిలి నెత్తురు కారుతోంది. ప్రసాద్ మోకాళ్ళెత్తి దున్నడిని బలంగా తన్నాడు. దున్నడు ఎగిరిపడ్డాడు. పడినవాడు తిరిగి లేవలేదు. నడుము సమాంతరంగా రోడ్డును తాకింది. దున్నడు మూలగడానికి కూడా శక్తిలేక నిస్త్రాణగాకళ్ళు మూసుకున్నాడు.

ప్రసాద్ వేషంలో వున్న శిరీష్ లేచినిలడ్డాడు. ఒళ్ళు విరుచుకున్నాడు.

* * *

"థాంక్యూ సోమచ్ శిరీష్! నీ ప్రాణాలను అడ్డం వేసి మరీ దున్నడిని చట్టానికి పట్టించావు...." అన్నాడు కుమార్.

శిరీష్ మందహాసం చేసి, "ఏంలాభం?" కాంత్‌నూ, మల్లేశ్వరాన్నీ కాచుకోలేకపోయాం. వాళ్ళమీద ఆధారపడిన కుటుంబాలకు మనం యేం చేయగలమో ఆలోచించుకోవాలి. అప్పుడే నువు చెప్పిన కృతజ్ఞతలకో అర్థం ఏర్పడుతుంది" అన్నాడు. □

సన్నని మీసాలు

ప్రతాప రవిశంకర్



స్కూటరు దిగాను. అప్పటికే హోటల్ మయూర ముందు పోలీసుజీపు ఆగివుంది.

లోపలకు నడిచాను. మెట్లదగ్గరే ఇద్దరు కానిస్టేబుళ్ళు నిలబడివున్నారు. గబగబా పైకి వెళ్ళాను.

ఓ గదిబయటే నిల్చుని నాకోసం ఎదురుచూస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కనిపించాడు.

"నీ కోసమే వెయిట్ చేస్తున్నాను. పద" అని నన్ను గదిలోకి తీసుకువెళ్ళాడు. అప్పటికే ఆ గదిలో ఫోటో గ్రాఫరు—వేలిముద్రల నిపుణుడు—పోలీసు డాక్టర్ కనిపించారు.

ఓ పక్కగా వున్న బెడ్‌మీద వెల్లకింతలా పడివుంది ఓ యువతి శవం. ఆమె గుండెల్లో పిడివరకూ దిగబడిన కత్తి బయటకు కనపడుతోంది. నెత్తురు కారిపోయి దుప్పటి సగం తడిపిపోయింది.

ఆమె వయసు ఇరవై వుండవచ్చు. అందంగా వుంది. పువ్వుల చీరకట్టుకుంది.

ఎవరి పనుల్లో వాళ్ళు వున్నారు.

"ఎవరీమె?" అడిగాను.

"ఈమె పేరు వసంత. నిన్న ఉదయమే ఈ హోటల్లో ఈమె భర్త రంగారావుతో దిగారు. వూరు చూడటానికి వచ్చారుట. కాని ఈ రోజు ఉదయానికే ఈమె హత్య చెయ్యబడినట్లు తెలిసింది."

"ఈమె భర్త రంగారావు ఎక్కడ?"

"లేదు సార్....అతను మాకు రాత్రినించీ కనపడలేదు. బహుశ అతనే ఈమెను హత్యచేసి పారిపోయి వుంటాడని అనుకుంటున్నాం" అన్నాడు ఆ హోటల్ మేనేజర్ ప్రభాకర్.

"ఈ శవాన్ని ముందుగా ఎవరు చూశారు?"

"ఇదుగో....వీడే. మా హోటల్ వర్కర్....ఎంత సేపటికీ తలుపులు తెరుచుకోకపోతే నెట్టుకుని లోపలకు వెళ్ళాడుట. శవం కనిపించి కేకలు పెట్టుకుంటూ వచ్చే

శాడు. అప్పుడే మాకూ తెలిసింది" అన్నాడు ప్రభాకర్.

"సరే....ఇక్కడి పని మీరు చేయించండి. నేను ఈ రూంబాయ్ నడిగి కొన్ని వివరాలు తీసుకుంటాను" అని వాడితో బయట వరండాలోకి వచ్చాను.

"నీ పేరు?"

"బాలయ్య సార్."

"నిన్న కూడా ఆ గదిలో దిగిన భార్యాభర్తలకు నువ్వే సర్వీస్ చేశావా?" సిగరెట్టు వెలిగిస్తూ అడిగాను.

"అవును సార్....నేనే చేశాను."

"ఆమె భర్త రంగారావు ఎలాంటిమనిషి? చూడటానికి నీకు ఎలా అనిపించాడు?"

"చూట్టానికి అమాయకుడిలా వున్నాడు సార్....సన్నని మీసం. పెద్ద పెద్ద కళ్ళు—అందంగానే వుంటాడు. అతను హత్య చెయ్యగలడని ఎవ్వరూ అనుకోరండీ.... కాని అతనే ఈ హత్య చెయ్యకపోతే ఈ గదిలోనించి యెందుకు పారిపోతాడని మా మానేజర్‌గారు అంటున్నారు సార్" అన్నాడు.

"మీ మేనేజర్ ఎక్కువగా డిటెక్టివ్ నవల్లు చదువుతాడా?" అడిగాను.

"నిజమే సార్! ఆయనకు డిటెక్టివ్ నవలలంటే ఇష్టం....ఎప్పుడూ చదువుతూ వుంటాడు."

"సరే....నువ్వు చూసినప్పుడు, ఆమె—ఆమె భర్త ఏదయినా విషయం గురించి గొడవపడినట్టుగా అనిపించారా?"

"లేదు సార్! బాగానే వున్నారు"

"రంగారావును నువ్వు చివరిసారిగా యెప్పుడు చూశావ్?"

"రాత్రి ఎనిమిదిన్నరకు గదిలోకి ఇద్దరికీ నేనే మీల్స్ తీసుకువెళ్ళాను. 'రేపు ఉదయం వచ్చి పళ్ళాలు తీసుకువెళ్ళ వచ్చులే. ఇంక నువ్వు రావద్దు' అన్నాడాయన. అందుకని నేను మళ్ళీ ఉదయమే వెళ్ళాను. ఆమె శవం కని పించింది."

"సరే....ఇక నువ్వు వెళ్ళు...."

లోపలికొచ్చాను.

"ఇలా రా!" అని ఇన్‌స్పెక్టర్ నన్ను గదిలో టేబిల్ మీద వున్న ఓ సూట్కేస్ దగ్గరకు తీసుకువెళ్ళాడు.

అందులో గుడ్డలపైన ఓ ఫోటో వున్నది. ఆ ఫోటోలో వసంత— ఆమె భర్త రంగారావు వున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే ఫోటోలో వసంతకు పెళ్ళయిన గుర్తులు ఏమీ లేవు. మెడ బోసిగా వుంది. బహుశ పెళ్ళి అవకముందు తీయించుకున్న ఫోటో ఐవుండాలి.

ఫోటోలో రంగారావు సన్నని మీసాలతో, పెద్ద కళ్ళతో అందంగా వున్నాడు. వసంత కూడా అందంగానే నవ్వుతూ వుంది.

"ఈ ఫోటో యెక్కడ వుంది?!" ఆశ్చర్యంగా అడి గాను.

"ఈ బట్టలమీద వుంది" చెప్పాడు ప్రదీప్.

"బట్టలపైన వున్నదా!"

"అవును."

ఆ సూట్కేసులో చీరలు—జాకెట్లు పావడాలు వున్నాయి. అంతకు మించి అందులో ఏమీ లేవు. రంగా రావు బట్టలకోసం వెతికాను.

ఎక్కడా కనిపించలేదు.

నిజంగా ఆశ్చర్యం! భార్యాభర్తలిద్దరూ కలిసి బయ

లేరితే భర్త బట్టలు ఏమవుతాయి? పారిపోయిన రంగారావు తన బట్టలు కూడా తీసుకెళ్ళిపోయాడా?

ఎందుకు?

అసలు ఈ హత్య వెనుకవున్న మోటివ్ ఏమిటి?

వీళ్ళిద్దరూ యెక్కడి నించి వచ్చారు? రిజిస్టర్‌లో విజయవాడనించి వచ్చినట్టుగా వుందిట. ప్రదీప్ చెప్పాడు.

రాత్రి పన్నెండుగంటల సమయంలో హత్య జరిగిందని చెప్పాడు డాక్టర్. కత్తిపిడిమీద వేలిముద్రలు లేవు. తుడిచేశారు.

ఆ గదిలో ఆ ఫోటోకి మించిన ఆధారం యేదీ దొరకలేదు. ఐతే శవం మెళ్లో నగలు ఏమీ లేవు. రెండు చేతులకూ ఎలాంటి గాజులూ లేవు. చెవులకు రింగులు వేళ్లాడుతున్నాయి.

వసంతకు నిజంగానే మెళ్ళో నగలు లేవా? లేక ఆమె భర్త రంగారావు తీసుకువెళ్ళాడా? భార్యను హత్యచేసి నగలు తీసుకుని పారిపోవలసిన అవసరం ఏమిటి?

ఇంతకీ వసంతను హత్యచేసిన మనిషి ఆమె భర్త రంగారావేనా? ఒకవేళ అతను కాదు అనుకుంటే అతనేమయ్యాడు?

అతను కూడా ఏదయినా ప్రమాదంలో వున్నాడా?

శవాన్ని మార్చ్యురీకి తరలించారు.

2

పోలీసు స్టేషన్లో—

"మనం ముందుగా ఆ రంగారావును ఎక్కడ వున్నా వెతికి పట్టుకోవాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్.

"అవును. అతడిని పట్టుకుంటే కేసు తేలిపోతుంది" అన్నాను.

"అతనే ఈ హత్య చేసివుండాలి. అతనికి భార్యమీద మనసులో ద్వేషం వుండివుంటుంది. అందుకే యిక్కడికి తీసుకొచ్చి హత్య చేసి పారిపోయాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నేను నవ్వి "రంగారావుకు భార్యమీద ద్వేషం ఎందుకు వుండాలి?" అన్నాను.

"మైడియర్ జగదీష్....ఎందుకైనా వుండొచ్చు. ఒక వేళ వసంత కారెక్టర్ మంచిది కాదనుకో....ఆమెకు మరో మగవాడితో అక్రమ సంబంధం వుందనుకో....అప్పుడు రంగారావుకు భార్యమీద ద్వేషం వుండొచ్చుకదా."

"నిజమే నేను ఒప్పుకుంటాను. కాని ఇదంతా మన వూహామాత్రమే. సరే....నువ్వు వూహించినట్టుగానే ఆలోచిద్దాం. రంగారావుకు వసంతమీద ద్వేషం వుంది. ఆమెను హత్యచేశాడు. పారిపోయాడు. అలా వెళ్ళేవాడు తను భార్య పెళ్ళికిముందు తీయించుకున్న ఫోటోను ఆ సూట్కేసులో వుంచి ఎందుకు వెళ్ళిపోయాడు? మన పరిశోధనకు ఉపయోగపడుతుందనా?" అన్నాను నవ్వి.

అలా అనగానే ఉలిక్కిపడ్డాడు ప్రదీప్.

"మైగాడ్ .... నేను ఈ ఫోటో గురించి మరచిపోయాను. కరెక్టే....రంగారావు హత్యచేస్తే ఫోటోను వదిలి ఎందుకు వెళతాడు?" అన్నాడు.

అంతేకాదు. ఫోటో తీయించుకునే నాటికి వసంత— రంగారావు పెళ్ళి చేసుకోలేదు. అంటే వాళ్ళిద్దరూ ప్రేమికులు ఐవుండాలి. ప్రేమించి తర్వాత పెళ్ళిచేసుకున్నారేమో" న్నాను.

అప్పుడు ఇన్‌స్పెక్టర్‌కు మరో ఆలోచన వచ్చింది.

"ఆగు....ఇప్పుడు నాకు సరయిన ఆలోచన వచ్చింది. రంగారావు....వసంత ప్రేమికులు. కాని ఏవో కారణాల వల్ల వసంత మరో మనిషిని పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. ఆ తర్వాత ఇప్పుడు ఎక్కడికో వెడుతున్నట్టు చెప్పి రంగారావుతో ఇక్కడికి వచ్చింది. ఈ విషయాన్ని వసంత భర్త తెలుసుకుని వచ్చి ఆమెను హత్యచేసి వుంటాడు. అతనితో తలపడలేక భయంతో రంగారావు పారిపోయి వుంటాడు. ఎలా వుంది నా ఆలోచన?" అన్నాడు ప్రదీప్ హుషారుగా.

"గుడ్. చాలా బావుంది. అలా ఐనా జరిగివుండొచ్చు. ఏమయినా మనం ముందు రంగారావుకోసం వెతకాలి. మన దగ్గర అతడి ఫోటో వుంది."

"అవును. మన దర్యాప్తు ముందుకు సాగటానికి ఫోటో ఒక్కటే సహకరించాలి" అన్నాడు ప్రదీప్.

"సరే. రంగారావు తన బట్టలతో రాత్రివేళ హోటల్ మయూర్‌లోనించి బయటికొచ్చాడు. ఆ సమయంలో అతను ఎక్కడికి వెళతాడు. ఏదయినా హోటలుకి వెళ్ళి వుండాలి. లేకపోతే రైలుస్టేషన్‌కో, బస్‌డిపోకో వెళ్ళి వుంటాడు. ఏ ఆటోరిక్షాలోనో, టాక్సీలోనో వెళతాడు. కాబట్టి మన దర్యాప్తు హోటల్ మయూరకు దగ్గర్లో వున్న ఆటోస్టాండు దగ్గర్నించి మొదలుపెట్టాలి" అన్నాను ప్రదీప్‌తో. తలవూపాడతను.

3

నలుగురు ఆటోరిక్షా డ్రయివర్లకు రంగారావు ఫోటో చూపించి అతడి గురించి అడిగాను. వాళ్ళు అతన్ని చూడలేదని అన్నారు.

ఐదవ ఆటోరిక్షా డ్రయివర్ ఆ ఫోటోను చూసి రెండు

నిముషాల తర్వాత "ఈయన్ని రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఇక్కడే ఆటో ఎక్కించుకున్నాను సార్" అన్నాడు.

"ఎక్కడ దించావు?" ఆత్రంగా అడిగాను.

"హోటల్ అజంతాకు తీసికెళ్ళాను."

"థాంక్యూ" అతనిదగ్గర ఏదయినా లగేజ్ వుందా?"

"ఉందిసార్. ఒక ఎయిర్‌బాగ్ వుంది."

"గుడ్. మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చావు" అంటూ అతడికో పదిరూపాయల నోటు ఇచ్చి స్కూటరుమీద రివ్వున హోటల్ అజంతాకు వచ్చాను పదినిముషాల్లో—

కవుంటర్‌లో కూర్చునివున్న క్లర్కు వెంటనే రంగారావును గుర్తుపట్టలేకపోయాడు. ఐదు నిముషాల తర్వాత "ఇలాంటి మనిషే రూంనెంబర్ నూటనలభై నాలుగులో వుంటున్నాడు" అన్నాడు.

అతనికి 'థాంక్స్' చెప్పి ఆ ఫోటోను ప్యాంటు జేబులో వుంచుకుని పైకివెళ్ళాను.

రూంనెంబర్ నూటనలభై నాలుగు ముందునిల్చుని తలుపు మీద చిన్నగా తట్టాను.

రెండు నిముషాల తర్వాత తలుపు తెరుచుకుంది.

ఎదురుగా—అతనే రంగారావు. అతడిని చూడడంతోనే నాకళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి.

అతనికి నేనెవరో తెలీదు.

"రంగారావు మీరేకదూ?" అడిగాను.

అతను వులిక్కిపడ్డాడు.

"నాతో వెంటనే పోలీసుస్టేషన్‌కు వస్తారా?"

"మీరెవరు?" అడిగాడు భయంగా.

"డిటెక్టివ్ జగదీష్."

"ప్లీజ్. నన్ను నమ్మండి. నాకేమీ తెలీదు. వసంతను నేను హత్య చెయ్యలేదు" అన్నాడు అతను.

"ఇవన్నీ పోలీస్ స్టేషన్లో మాట్లాడుకుందాం. ముందు బయల్దేరండి" అన్నాను.

ఐదునిముషాల్లో అతడిని తీసుకుని అక్కడినుంచి బయల్దేరాను. మరో పది నిముషాల్లో పోలీసు స్టేషన్‌లో వున్నాను.

రంగారావును చూడటంతోనే ఇన్‌స్పెక్టర్ గుర్తించి "మొత్తానికి హంతకుడిని పట్టుకున్నావు" అన్నాడు నవ్వుతూ—

"ఇతను హంతకుడుకాడు. అసలు హంతకుడు వేరే వున్నాడు." అన్నాను.

"ఎవరా హంతకుడు?" అడిగాడు ప్రదీప్.

"చెబుతాను. నువ్వు నీ బలగంతో ముందు బయల్దేరు. హోటల్ మయూర్‌కు వెళ్ళాలి" అన్నాను.

4

మమ్మల్ని చూడటంతోనే "ఏం సార్. హంతకుడు దొరికినట్టున్నాడే" అన్నాడు మేనేజర్ ప్రభాకర్ చిరునవ్వుతో.

"ఆ....అయితే ఇతను హంతకుడు కాదు. అసలు హంతకుడు వాడు. రూంబాయ్ బాలయ్యను ముందు అరెస్టు చెయ్యండి" అన్నాను.

మేనేజర్ ఆశ్చర్యపోయాడు.

"ఏమిటీ మీరనేది? రూంబాయ్ బాలయ్య హంతకుడా!" అన్నాడు.

"అవును. వాడే వసంతను హత్యచేశాడు."

"నాకేమీ తెలీదు" అన్నాడు వాడు.

ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ పిడికిలి బిగించి ఈడ్చి దవడమీద కొట్టాడు. వాడు పెద్ద కేకపెట్టి కింద పడిపోయాడు. వాడి పెట్టెను సోదాచెస్తే అందులో వసంత నగలు దొరికాయి. మరో నాలుగు దెబ్బలు పడేసరికి భయంతో వాడు నేరాన్ని ఒప్పుకున్నాడు.

"నిజానికి రంగారావూ—వసంత భార్య భర్తలుకాదు. వాళ్ళు ఇంకా పెళ్ళి చేసుకోలేదు. హోటల్లో రూముకోసం వసంత తాలిబొట్టు వేసుకుంది. ఆమె నగలతో, డబ్బుతో రంగారావుతో లేచివచ్చింది.

"వీళ్ళిద్దరూ భార్యాభర్తలు కాదనే విషయాన్ని ఈ బాలయ్య తెలుసుకున్నాడు. ఎలాగయినా వసంత దగ్గరవున్న నగలు, డబ్బు కాజెయ్యాలనుకున్నాడు. ఆ రాత్రి వాళ్ళకు భోజనం తీసుకువెళ్ళినప్పుడు రంగారావు తను ఒక స్నేహితుణ్ణి కలిసి వస్తానని వసంతతో చెప్పటం బాలయ్య విన్నాడు. రంగారావు వెళ్ళిన తర్వాత పన్నెండు గంటలు కావస్తుండగా వెళ్ళి రూంతలుపు తట్టాడు. రంగారావు వచ్చాడనుకుని వసంత తలుపు తెరిచింది. వెంటనే ఆమె నోరు నొక్కి కత్తితో పొడిచి చంపాడు ఆమెను బెడ్ దగ్గరకు నెట్టుకువెళ్ళి.

తర్వాత ఆమె వంటిమీది నగలు తీసుకున్నాడు. ఆమె చెవి రింగులు, పుస్తె అలాగే వుంచాడు. వాటినిబట్టి హత్య నగలకోసం జరగలేదని మనం అనుకోవాలని అలాచేశాడు. డబ్బుకోసం సూట్కేసును వెతికాడు. డబ్బుతోపాటు రంగారావు—వసంత కలిసి తీయించుకున్న ఫోటో కనపడింది. పోలీసుల అనుమానం రంగారావుమీదకు వెళ్ళ

టానికి ఓ క్లూగా దాన్ని అడుగునించి తీసి బట్టలమీద వుంచి నగలతో, డబ్బుతో వెళ్ళిపోయాడు.

తర్వాత సినిమానించి గదికివచ్చిన రంగారావుకు వసంత శవం కనపడింది. అతను భయపడి ఆ నేరం తనమీదకు వస్తుందని తన బట్టలు తీసుకుని పారిపోయాడు. నిజానికి వసంత సూట్కేసులో ఆ ఫోటో వున్న విషయం కూడా అతనికి తెలీదు."

"ఆశ్చర్యంగా వుంది. ఈ బాలయ్య ఓ హత్య చేశాడంటే నేను యింకా నమ్మలేకుండా వున్నాను. అసలు వీడే ఈ హత్య చేశాడని మీరెలా వూహించారు?" అడిగాడు మేనేజర్.

"చాలా సింపుల్. వసంత—రంగారావుల ఫోటో సూట్కేసులో బట్టలపైన కనిపించినప్పుడే రంగారావు ఈ హత్యచేసి వుండడని అనిపించింది. ఎందుకంటే హత్యచేసిన మనిషి కావాలని పోలీసులకు ఆధారాలు అందించి వెళ్ళడు. కాబట్టి ఎవరో అతడిని హంతకుడిగా ఇరికించటానికి ఆ ఫోటోను అక్కడ వుంచారని అర్థమయ్యింది.

ఇక రూంబాయ్ బాలయ్య హంతకుడని రంగారావును చూడటంతోనే తెలిసిపోయింది. అది బాలయ్యచేసిన అనుకోని పొరపాటు. రంగారావుకు సన్నని మీసాలు వుంటాయని అందంగా వుంటాడని చెప్పాడు.

నిజానికి రంగారావుకు ఆ ఫోటోలో మాత్రమే సన్నని మీసాలు వున్నాయి. ఇప్పుడు లావుపాటి మీసాలు వున్నాయి. ఇవి పెట్టుకున్న మీసాలు కాదు. ఒక్క రోజులో మీసాలు అంతగా పెరగవు. అందువల్లనే ఆటో రిక్షా డ్రైవరూ, హోటల్ అజంతా కవుంటర్ క్లర్కూ

రంగారావు ఫోటోను చూసి వెంటనే అతడిని గుర్తు పట్టలేక పోయారు. అందుకు అతని యిప్పటి లావుపాటి మీసాలే కారణం.

కాని బాలయ్య కళ్ళముందు రంగారావు గురించి నేను అడిగినప్పుడు అతనికి ఆ ఫోటోలు ఉన్న రూపం కళ్ళ ముందు కనపడింది. అందుకే రంగారావుకు సన్నని మీసాలు అని చెప్పాడు. తన పొరపాటువల్లనే అనుమానాన్ని తన మీదికి మళ్ళించుకున్నాడు. ఎంతో తెలివిగా కత్తిపిడిమీది వేలిముద్రలు తుడిచివేసినా నేరస్తుడిని ఎప్పుడూ దురదృష్టం వెంటాడుతూనే ఉంటుందనటానికి ఇదో ఇన్సిడెంట్" అన్నాను నవ్వుతూ—

రంగారావు నాకు థాంక్స్ చెప్పుకున్నాడు. □

పారిపోయిన కోళ్ళు?



సీటుక్రింద శవం

భమిడిపాటి భాస్కరరామారావు

"ఫార్టీఫోర్ అప్ కోస్ట్‌లైన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెండవ నంబరు ప్లాట్‌ఫాం నుంచి రెండు నిముషములలో బయలుదేరనున్నది." మైకులో త్రిభాషా సూత్రాన్ననుసరించి ముచ్చటగా మూడుభాషలలోనూ పలికింది కోకిల కంఠం, విజయవాడ స్టేషన్‌లో.

అప్పుడే ఓవర్ బ్రిడ్జిమీద అడుగుపెట్టిన రామానుజం ఆదరాబాదరాగా బ్రీఫ్‌కేసు చేతబట్టుకుని ఉరుకులు పరుగుల మీద రైలును సమీపించాడు. మరోక్షణం తరువాత తనకు సీటు రిజర్వు అయిన కంపార్టుమెంటులో అడుగుపెట్టాడు. అతడలా కంపార్ట్‌మెంట్‌లో అడుగుపెట్టడం ఆలస్యంగా 'బొంయ్' మని హారన్ మ్రోగించుకుంటూ బయలుదేరింది కోస్ట్‌లైన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్.

చేతిలో ఉన్న బ్రీఫ్‌కేసు ఎదుటి సీటుమీదపెట్టి తన సీటులో కూచున్నాడు రామానుజం. జేబురుమాలు తీసి ముఖానికి పట్టిన చమట సుతారంగా అద్దుకున్నాడు.

అవి రెండేరెండు సీట్లు ఉండే కుపే. అదే కంపార్టు మెంట్‌లో రవివర్మ అనే వ్యక్తి ప్రయాణం చేస్తున్నట్టు కంపార్ట్‌మెంట్ ముందు అంటించివున్న ఛార్టులో చూచి వున్నాడు రామానుజం. కాని కంపార్టుమెంట్‌లో ఎవరూ లేరు. కొంచెం ఆశ్చర్యపడ్డాడు. బాత్‌రూమ్‌కు వెళ్ళి ఉండ వచ్చుననుకున్నాడు.

రైలు వేగం పుంజుకుని ప్రయాణం సాగిస్తూనే ఉంది. కొద్ది క్షణాలలో స్థిమితపడ్డ రామానుజానికి ఆ కుపేలో అతి స్వల్పంగా ఏదో వాసన వస్తున్నట్టు అనిపించింది. ఆ వాసన అతడికి విచిత్రంగా తోచింది మొదట ఆ వాసన ఏమిటో అతడికి అంతుబట్టలేదు. కాని కొంతసేపట్లో స్ఫుర ణకు వచ్చింది. తాను ఒకమారు హాస్పిటల్ మార్చ్యురీ ప్రక్కనుండి వెళ్ళినప్పుడు అలాటి వాసనకు గురయినట్టు గ్రహించాడు.

తను కూర్చున్నవైపు కిటికీ అద్దం పైకెత్తాడు జుంయ్ మంటూ పరిశుభ్రమైన గాలి లోపలకు చొచ్చుకుని వచ్చింది.

అంతవరకూ వున్న వాసన అణగారింది. ఎదుటి సీటులోని వ్యక్తి బాత్‌రూమ్‌నుండి యింకా తిరిగిరాలేదు ఏ క్షణాన అయినా అతడు తిరిగి రావచ్చునని భావించిన రామానుజం వచ్చే వ్యక్తికి తన బ్రీఫ్‌కేసు అడ్డం కారాదన్న ఊహతో దానిని యెదుటి సీటుక్రింద పెట్టాడు.

బ్రీఫ్‌కేసు అడుగుకంటా పోకుండా ఏదో అడ్డుకున్నట్టు మధ్యలోనే ఆగిపోయింది. కాలితో గట్టిగా నెట్టాడు. అయినా ఆవంతయినా ముందుకు జరగలేదు బ్రీఫ్‌కేసు. సీటుక్రింద ఏమయినా సామానుందేమోననే ఊహతో క్రిందకు వంగి చూశాడు.

సీటు అడుగున కనుపించిన దృశ్యంతో ఒక్క క్షణం స్తంభించిపోయాడు రామానుజం. కంపార్ట్‌మెంట్ అంతా రంయ్‌మని వీస్తున్న గాలితో చల్లగానే వున్నా రామానుజం ఒళ్ళంతా చెమటలు పట్టాయి. దుస్తులన్నీ చెమటలో తడిసి పోయాయి.

ఉంగలా చుట్టి క్రుక్కినట్లున్న మానవ కళేబరం ఒకటి కళ్ళబడింది రామానుజానికి ఆ సీటు క్రింద.

మరుక్షణంలో షాక్‌నుండి తేరుకుని, చటుక్కున లేచి అలారమ్ గొలుసు లాగాడు. రైలాగింది. అప్పటికి కృష్ణా కెనాల్ దాటింది రైలు.

గార్డు, అతడివెనుక ముగ్గురో నలుగురో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ జవాన్‌లూ వచ్చారు. రామానుజం చెప్పినది విన్నారు. కంపార్ట్‌మెంట్‌నుండి శవాన్ని బయటకు తీశారు పచ్చని శరీరచ్ఛాయతో, అయిదున్నర అడుగుల ఎత్తుతో బూడిదరంగు సూటులో వుంది ఆ శవం. వయస్సు పాతికకు మించదు.

2

"నిశ్చయ తాంబూలం పుచ్చుకున్నాక వివాహానికి ముందుగానే మా యింటికి రాబోయే కోడలికి వంశపారం పర్యంగా వస్తున్న వజ్రాల ఆభరణాలను అందజేయడం మా వంశాచారం" చెప్పాడు రాజా ఆనందవర్మ.

"వరుడే స్వయంగా అందచేయాలా?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"పూర్వం అయితే పెద్దలెవరో ఒకరు ఆ పనిమీద వెళ్ళేవారు. అయితే యిప్పుడు కాలం మారింది. పైగా ఆ అమ్మాయీ మా అబ్బాయీ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నారు. తనే వెడతానన్నాడు. నేను సరేనన్నాను."

"రవివర్మ కూడా తీసుకువెళ్ళిన జవహాయిరీ విలువ ఏ మాత్రం వుంటుంది?"

"సుమారు మూడు లక్షలుంటుంది."

"నేటి రోజులెలా వున్నాయో మీకు తెలియంది కాదు. అంత విలువచేసే ఆభరణాలతో ఒంటరిగా వెళ్ళడం ప్రమాదహేతువవుతుందేమో ఆలోచించలేదా?"

"తెల్లవారిన తరువాతనే వాల్తేరు విడిచిపెడుతుంది కోస్టులైన్ సూపర్‌ఫాస్ట్. మధ్యలో రాజమండ్రి ఒక్క నిముషం మాత్రమే హాల్టు. బెజవాడవరకూ ప్రయాణం మొత్తం ఆరే గంటలు కదా! ప్రయాణం అంతా పగటి పూటనే కదా! ప్రమాదం వుంటుందనుకోలేదు."

"మీకెవరిమీదనైనా ప్రత్యేకించి అనుమానం వుందా?"

"లేదు."

"మరోలా భావించకండి. డబ్బున్నవాడు—అందగాడు—ఏవైనా దుర్వ్యసనాలు....అంటే మగువ, మదిర వగైరా" డిటెక్టివ్ మాట యింకా పూర్తికాకుండానే

"నోనో! మావాడికలాంటి దుర్గుణాలేమీలేవు."

"ఇలా విలువైన ఆభరణాలతో రవివర్మ వెళ్ళబోతున్నాడని ఎవరెవరికి తెలుసు?" మాట మారుస్తూ అడిగాడు ప్రభాకర్.

"ఒకరిద్దరు ముఖ్యస్నేహితులు, బంధువులకు మాత్రమే తెలుసు" అని స్నేహితులూ, బంధువుల పేర్లు చెప్పి, "వారందరూ గౌరవనీయులు. ఇలాటి నీచాలకు పాల్పడరు" అనికూడా చెప్పాడు ఆనందవర్మ.

"రవివర్మ ఒక్కడే వెళ్ళాడా?"

"లేదు. అతడి వెంట మా నౌకరు సూర్యంకూడా ఉన్నాడు."

"రవివర్మ దగ్గర ఆభరణాలున్నట్టు అతడికి తెలుసునా?

"ఆ విషయం నేను చెప్పలేను."

"సూర్యం చిరకాలంగా మీ దగ్గర పనిచేస్తున్నవాడేనా?"

"కాదు. ఒక ఏడాదినుండే మా దగ్గర వుంటున్నాడు."

"అంతకు ముందు ఎక్కడ పనిచేసేవాడట?"

"ఏదో చెప్పాడు గాని నాకంతగా జ్ఞాపకంలేదు. చూడగానే బుద్ధిమంతుడిలా తోచాడు. పనిలో పెట్టుకున్నాను."

"అతడుండే దెక్కడ?"

"సర్వెంట్ క్వార్టర్స్‌లో వుంటాడు ఈ ఆవరణలోనే. పిలిపిస్తానుండండి" అన్నాడు ఆనందవర్మ.

"క్వార్టర్స్ నంబర్ చెప్పండి చాలు—నేనే వెళ్ళి కలుసుకుంటాను."

ఆనందవర్మ సూర్యం వుండే క్వార్టర్స్ నంబరు చెప్పాడు.

ప్రభాకర్ ఆవైపుగా బయలుదేరాడు. తిన్నగా వెళ్ళి సూర్యం క్వార్టర్స్ ముందాగాడు. తలుపులు దగ్గరగా చేర

వేపి ఉన్నట్టు గమనించాడు. నెట్టగానే తెరుచుకున్నాయి తలుపులు. సూర్యం భోంచేస్తున్నాడు.

ప్రభాకర్‌ను చూచి సూర్యం లేచి నిలబడ్డాడు.

"సూర్యం అంటే నువ్వేనా!" అడిగాడు ప్రభాకర్. ఒక్క నిముషం వ్యవధిలోనే గదంతా పరికించాడు డిటెక్టివ్ ప్రభాకర్.

కిటికీలో ఒక కూజా దానిమీద బోర్లించిన ఒక గ్లాసు వున్నాయి. ఒకవారగా పరచిన చాప దానిమీద పక్క దుప్పటి, దిండు. వాని ప్రక్కనే ఒక ట్రంకుపెట్టె. మరో వార నైలాన్ తాడుతో దండెం. దానిమీద ఒక జత బట్టలు, లుంగీ, ఒక తుండు తప్ప మరేమీ లేవు.

"ఔనండి" చెప్పాడు సూర్యం.

"మొన్న రవివర్మతో కలిసి వెళ్ళావు కదూ?"

"చిత్తం."

"రవివర్మ ప్రయాణం బెజవాడవరకే. కాని అత డక్కడ దిగలేదు. నువ్వుమాత్రం అక్కడ దిగావు. అలా ఎందుకు జరిగింది?" అడిగాడు ప్రభాకర్.

"నేను అటెండెంట్స్ పెట్టెనుండి దిగి చిన్నబాబు కంపార్ట్‌మెంట్ దగ్గరకు వచ్చానండి. చినబాబు అప్పుడే కంపార్ట్‌మెంట్ తలుపు దేరవాకిలిగా తెరిచి బయటకు చూస్తున్నారండి. లోపలనుండి సెంటు వాసన కొట్టింది. అది మా చినబాబు వాడే సెంటుకాదు. కొద్దిగా ఒంగి చూచాను. నీలిరంగు చీర చెంగు కనిపించినట్టు కనిపించింది. నన్ను చూచిన చిన్నబాబు గుమ్మానికి మరింత అడ్డుగా నించుంటూ 'నేను నెల్లూరుదాకా వెళ్ళి రాత్రికో రేపటికో వస్తాను. నువ్వు మన హోటల్‌కు వెళ్ళి వుండు' అన్నారండి. నేను చినబాబుతో కలిసి ప్రయాణంచేసిన

రెండు మూడు సందర్భాలలోనూ నాకిలాటి అనుభవం ఎదురయిందండి. నేనింకేమీ మాట్లాడకుండా చినబాబు చెప్పినట్టే చేశానండి" చెప్పాడు సూర్యం.

"మీ చినబాబు షోకిల్లా పురుషుడా?"

"డబ్బున్న మహారాజులు కదండీ!"

"అన్నప్రకారం చినబాబు రాలేదు. ఈలోగా హత్యకు గురయాడు. ఆ సంగతి నీకెలా తెలిసింది?" అడిగాడు ప్రభాకర్.

"హోటల్లో అనుకుంటుండగా విన్నానండి. విన్న మాటలనుబట్టి అనుమానం వచ్చి నేనూ అక్కడకు వెళ్ళానండి. మా చినబాబే హత్యకు గురయినట్టు తెలుసుకున్నాను. పోలీసులు నా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. వారి అనుమతితో యిక్కడకు వచ్చేశానండి" ముగించాడు సూర్యం.

ఇతర నౌకర్లను గూడా చినబాబు గుణగణాలు, నడవడికి సంబంధించి కొన్ని ప్రశ్నలడిగి తిరిగి వచ్చాడు డిటెక్టివ్ ప్రభాకర్. విషయం అంతా విపులంగా హరికి చెప్పి, అతడికి కొన్ని సూచన లిచ్చాడు.

3

విజయవాడ సిటీ పోలీస్ కమీషనర్ ఆఫీసులో అడుగుపెట్టాడు డిటెక్టివ్ ప్రభాకర్. తన గుర్తింపు కార్డు చూపించి కుమారరాజా రవివర్మ కేసు దరియాప్తు చేస్తున్న దెవరో తెలుసుకున్నాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ కాంతారావు దగ్గరకు బయలుదేరాడు ప్రభాకర్.

"బహుకాల దర్శనం. ఏమిటిలా దయచేశావు? రవివర్మ హత్య సందర్భంగా గాని రాలేదు కదా?" లోపల కడుగుపెట్టిన ప్రభాకర్‌ను చూడగానే అడిగాడు క్రయిం

క్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కాంతారావు.

"అవును" అని, "ఇంతకూ ఎంతవరకూ సాగింది పరిశోధన?" అని అడిగాడు ప్రభాకర్ కూర్చుంటూ.

"అంతా గజిబిజిగా వుంది. వాళ్ళ నౌకరు చెప్పినదాన్ని బట్టి రవివర్మ యిక్కడకు చేరేవరకూ సజీవుడే అనుకో వలసి వస్తోంది. కాని శవపరీక్ష జరిపిన డాక్టరు రిపోర్టును బట్టి మరోలా అనుకోవాల్సి వస్తోంది. అని చెప్పాడు ఇన్‌స్పెక్టర్ కాంతారావు.

"అంటే...." అంటూ ఏదో అడగబోయాడు ప్రభాకర్.

"శవం కళ్ళబడ్డ సమయానికి కనీసం మూడుగంటల ముందుగానే మరణం సంభవించి వుండాలని చెప్పాడు డాక్టరు."

"అంటే హత్య రాజమండ్రి ప్రాంతాలలోనే జరిగి వుండాలన్న మాట."

"అంతేకదా మరి."

"అలాంటప్పుడు నౌకరు సూర్యం వెళ్ళడానికెలా అనుమతిచ్చావు?"

"ప్లాట్‌ఫాంమీద మేగజయిన్‌లమ్మే మనిషి, కాఫీల కుర్రవాడూ గూడా తాము రవివర్మను చూచినట్లు చెప్పారు."

"ఖచ్చితంగా రవివర్మ అని చెప్పగలిగారా?"

తనముందున్న ఫయిల్లోంచి కొన్ని కాగితాలు తిరగేసి చూచాడు కాంతారావు. అప్పుడు ప్రభాకర్‌వైపు చూచి, "రవివర్మ ధరించిన దుస్తులను వర్ణించి అదే ఎత్తు, లావు కలిగిన వ్యక్తిని తాము చూచినట్టు, అతడు తమవద్ద బేరం చేసినట్టుకూడా చెప్పారిద్దరూ. నేను మరణించిన రవివర్మను వాళ్ళకు చూపించి మీరు ప్లాట్‌ఫాంమీద చూచిన వ్యక్తి

యితడేనా అని ప్రశ్నించాను. తాము సరిగా చూడలేక పోయామనీ, ఇలాగే కనిపించాడనీ చెప్పారు."

"బాగుంది" అని. "రవివర్మ ఒక బ్రీఫ్‌కేసుతో బయలు దేరాడు. అది దొరికిందా?" అడిగాడు ప్రభాకర్.

"లేదు. అసలు ఆ బ్రీఫ్‌కేసు కోసమే హత్య జరిగి ఉండాలి."

"ఔను. ఇంతకూ ఆ బ్రీఫ్‌కేసులో ఏమున్నాయో తెలుసునా?" అడిగాడు ప్రభాకర్.

"నువ్వు రావడానికి ముందే విశాఖనుండి ఇన్ఫర్మేషన్ వచ్చింది. సుమారు మూడులక్షలు విలువచేసే ఆభరణా లున్నాయట."

"నువ్వు చెప్పిన సమాచారాన్ని బట్టి రవివర్మ బెజవాడ ప్లాట్‌ఫాంమీద కనిపించాడు. అప్పటికి మూడు గంటల ముందే అతడు మరణించాడని నిర్ధారణ అయింది కనుక ఆ కనుపించిన వ్యక్తి రవివర్మకాదు. అతడిలాగే వేషంవేసు కున్న వాడయి వుండాలి. కాబట్టి అతడే హంతకుడయి వుండాలి. ప్లాట్‌ఫాంమీద వ్యక్తులకు రవివర్మ తెలియని వాడు. కాని అతడి నౌకరు సూర్యంకూడా తానాతడిని చూచి నట్టు చెబుతున్నాడని తేలింది. కాబట్టి అతడు అబద్ధం ఆడు తున్నాడన్నమాట. ఎందుకు? అతడే హత్యచేసి నగల పెట్టెను అపహరించి వుండాలి. అతడికి మరెవరో సహ కారంకూడా అందించి వుండాలి. కాబట్టి మనం మరోసారి రైల్వేస్టేషన్‌కు వెళ్ళి దర్యాప్తు చెయ్యడం మంచిదనుకుం కుంటాను" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"అవశ్యం! అలాగే చేద్దాం! నడు!" అని ఇన్‌స్పెక్టర్ కాంతారావు లేచాడు ఇరువురూ కలిసి రైల్వేస్టేషన్‌కు

చేరుకున్నారు.

ముందుగా మేగజయిన్‌లమ్మే షాపుకు వెళ్ళారు. కాంతారావు ప్రక్కనే వున్న ప్రభాకర్ గంభీర విగ్రహాన్ని చూచి ఇన్‌స్పెక్టర్ కంటె పెద్ద అధికారి ఎవరో దర్యాప్తుకు వచ్చారనుకున్నాడు షాపువాలా. మామూలు ప్రశ్నలయ్యాయి. కాంతారావుకు లభించిన సమాచారం కంటె ఎక్కువ ఏమీ లభించలేదు. డిటెక్టివ్ ప్రభాకర్ ఒక్క క్షణం ఆలోచించి, "అతడి చేతిలో బ్రీఫ్‌కేసులాటిదేమైనా వుందా?" అని అడిగాడు.

"లేదు" చెప్పాడు షాపువాలా.

"అతడితోబాటు మరెవరయినా వున్నారా?" అడిగాడు ప్రభాకర్.

ఎవరూ లేరని చెప్పాడు షాపువాలా.

ప్లాట్‌ఫాంమీద వెతికి కాఫీ అమ్మిన కుర్రవాణ్ణి కలుసుకున్నారు. తాము మరలా ఎందుకు వచ్చినదీ చెప్పి, "అతడితోబాటు మరెవరయినా వున్నారా?" అని అడిగాడు ప్రభాకర్.

"లేరండి."

"బాగా జ్ఞాపకం చేసుకుని చెప్పు. అతడి చేతిలో ఒక బ్రీఫ్‌కేసుకూడా వుండాలి" అడిగాడు ప్రభాకర్.

కాఫీల కుర్రాడు కొద్దిసేపు ఏదో ఆలోచిస్తున్న వాడిలా నిలబడిపోయాడు. "ఆ! మీరు అలా అడిగితే గుర్తుకు వచ్చిందండి. నా దగ్గర కాఫీ తీసుకున్నప్పుడు ఆయన చేతిలో ఏమీ లేదండి. తరువాత నేను ప్లాట్‌ఫాంకు ఆ చివరగా వెళ్ళాను. అక్కడ పండ్ల దుకాణానికి కాస్త ఆవలగా ఆయన నిలబడి వున్నారు అప్పుడాయన చేతిలో ఒక బ్రీఫ్‌కేసు చూచాను. అంతే కాదండి, అప్పుడాయన ప్రక్కన

ఎవరో ఆడమనిషిగూడా వున్నారండి" అని చెప్పాడు కుర్రాడు.

"ఆడమనిషా? ఆవిడ ఎలా వున్నారో చెప్పగలవా?"

కుర్రవాడు స్త్రీని వర్ణించాడు. చివరగా, "ఆవిడ ఆకాశ నీలం చీర కట్టుకుని వున్నారండి" అన్నాడు.

కుర్రవాడు చేసిన ఆ స్త్రీ వర్ణన ప్రభాకర్ మస్తిష్కంలో హత్తుకుపోయింది.

కుర్రవాడు చెప్పిన పండ్ల దుకాణం ఓవర్ బ్రిడ్జికి దగ్గర లోనే వుంది. ఆ స్త్రీ, ఆ పురుషుడూ ఓవర్ బ్రిడ్జి మీదుగానే వెళ్ళాలి. ఏవైపు వెళ్ళినట్టు? దారిలో సమాచారం యివ్వ గలరని భావించిన ప్రతివారిని ప్రశ్నించుకుంటూ వచ్చాడు ప్రభాకర్. చివరకు ఎక్జిట్ గేట్ దగ్గర వుండే టి.టి.ఇ., ఆ జంట గురించి, అతడి చేతిలోని బ్రీఫ్‌కేస్ గురించి చెప్పాడు.

నేరుగా రిక్షాస్టాండుకు వచ్చారు. ఆ స్త్రీ పురుషులిరువురూ తన రిక్షా యెక్కి హోటల్ ప్లాటినమ్‌కు చేరుకున్నట్లు రిక్షా రాజన్న చెప్పాడు.

హోటల్‌లో ఆ స్త్రీ ఒక రూమ్ బుక్ చేసుకున్నట్టు తేలింది. అతడు రవివర్మ ముందుగా బుక్ చేసుకున్న రూమ్ తాళాలు తీసుకున్నట్టు తేలింది. కొద్దిగంటలలో క్రీమ్‌కలర్ చీరలో ఆ స్త్రీ చేతిలో బ్రీఫ్‌కేసుతోను, ఆమె వెంట అతడు బయటకు వెళ్ళినట్లు హోటల్ వర్కర్స్‌ద్వారా తెలుసు కున్నారు.

అక్కడినుండి ఆమె ఒక్కతే ఒక రిక్షాలో బస్‌స్టేషన్‌కు వెళ్ళినట్లు తెలుసుకున్నాడు ప్రభాకర్. బస్సుస్టేషన్‌లో క్రీమ్ కలర్ చీరతో చేతిలో బ్రీఫ్‌కేసుతో వున్న ఆమెను చూచి నట్టు చాలామంది చెప్పారు. కానీ ఆమె ఏ బస్సు ఎక్కినది

మాత్రం ఎవరూ చెప్పలేకపోయారు. ఆమె ప్రయాణం చేసిన వేళలో డీలక్సు, లక్జరీకోచ్. సెమీ లక్జరీ కోచ్ బస్సులు పలుప్రాంతాలకు బయలుదేరాయని తెలుసుకున్నాడు ప్రభాకర్.

ప్రయోజనకరమైన ఆధారం ఏమీ లభించకపోయినా ఒక పురుషుడు, ఒక స్త్రీ కలసి కుమారరాజా రవివర్మను హత్య చేసి నగలపెట్టెను అపహరించారన్న నిర్ధారణకు వచ్చాడు ప్రభాకర్. ఆ పురుషుడు నౌకరు సూర్యమే ఎందుకు కాకూడదు అన్న అనుమానం పొడసూపిందతని మనసులో.

విజయవాడలో తను చేసిన పరిశోధనా వివరాలన్నీ హరితో చెప్పాడు ప్రభాకర్ మెయిల్‌లో దిగి యింటికి చేరీ చేరగానే. హరి అవన్నీ శ్రద్ధగా విని, "బాస్! మీరు చెప్పినట్టు సూర్యంమీద నిఘావేశాను. మొదటి రెండు రోజులూ అతడు ఆనందవర్మగారి ఆవరణదాటి ఎక్కడికి వెళ్ళలేదు. నిన్నమాత్రం సాయంత్రం యిల్లువిడిచి బయటకు వెళ్ళాడు" అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళాడు?"

"పిఠాపురం కాలనీ స్టాప్‌లో బస్సెక్కాడు. నేనూ అతడి వెనుకనే యెక్కాను. అతడు జగదాంబ సెంటర్‌లో దిగాడు. బస్సు ఆగడం తరవుగా తోసుకొని బస్సెక్కడానికి ఎగబడే జనం కారణంగా నేను దిగడంతో కొద్ది క్షణాలు వెనుకపడ్డాను. అతడు ఎటువెళ్ళాడో తెలుసుకోలేకపోయాను" చెప్పాడు హరి.

"సాధారణంగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ లన్నిటా ఈ చివరినుండి ఆ చివరికంటా వెళ్ళేటట్టు పెట్టెకూ పెట్టెకూ మధ్య మార్గం వుంటుందికదా. దాని ఆధారంగా తనున్న

అటెండెంట్స్ కంపార్ట్‌మెంట్ నుండి రవివర్మ వున్న కంపార్ట్‌మెంటుకు సూర్యం చేరుకుని వుంటాడు. తన నౌకరే కనుక సూర్యం తలుపు తెరిచి వుంటాడు. రవివర్మ దగ్గర విలువైన ఆభరణాలు వున్నాయనే విషయం బహుశః సూర్యానికి తెలిసే వుంటుంది. ఎందుకలా అంటున్నానంటే నేను ఆనందవర్మ యింటిలో పనిచేసే యితర నౌకర్లను గూడా దర్యాప్తు చేశాను. రవివర్మ సూర్యాన్ని కేవలం నౌకరులా కాక స్నేహితుని మాదిరిగానే ఆదరించేవాడని తెలిసింది. సూర్యం ఏ ఉద్దేశ్యంతో వారి యింట పనికి చేరాడో ప్రస్తుతం నేను చెప్పలేను. కాని అవకాశం దొరకడంతో అతడిని చంపి, ఆ నగలు తనవశం చేసుకుని ఉంటాడు. విజయవాడలో దర్జాగా దిగిపోయి ఆ బ్రీఫ్ కేసును తన సహచరికి అప్పగించి వుంటాడు."

"మరి రవివర్మలాగే అతడూ దుస్తులు ధరించి కనిపించాడు కదా?"

"తనూ ముందు ప్లాను వేసుకొని అలాటి సూటు కుట్టించుకుని వుంచుకొని, రవివర్మ ఆరోజు ధరించిన సూటు తొడుక్కుంటే హుందాగా కనిపిస్తాడనో మరేవో చెప్పి అతడిచేత ఆ సూటు తొడిగించి వుంటాడు. సూర్యంపట్ల స్నేహభావాన్ని కనపరచే వర్మ అతడు చెప్పినట్లే దుస్తులు ధరించి వుండొచ్చు."

"అయితే కంపార్టుమెంటులోని నీలి చీర రెపరెపలు?" అడిగాడు హరి.

"అది సూర్యం కట్టుకథ. అదికాక సూర్యం చెప్పినట్లు రవివర్మకు ఏమీ దుర్గుణాలు లేవని తేలింది. నేను సూర్యమే ఈ కథకు సూత్రధారుడని ఈ కారణంగానే అనుమానిస్తున్నాను" చెప్పాడు ప్రభాకర్.

"అయితే మనం యిప్పుడేం చెయ్యాలంటారు?" అడిగాడు హరి.

"సూర్యం సహచరిగూడా ఈ ఊళ్ళోనే వుండి వుంటుంది. నిన్న బహుశః అతడు ఆమె దగ్గరకే వెళ్ళి వుంటాడు. ఆ బ్రీఫ్ కేసుగూడా ఆమెదగ్గరే వుండివుంటుంది. కేసు సంగతి కాస్త చప్పబడ్డాక అతడు ఆనందవర్మదగ్గర సెలవు తీసుకోవచ్చు.

అందుచేత ఈరోజు సాయంత్రం ఆనందవర్మ యింటి పరిసరాల్లో బీటువేద్దాం. అతడు తరువాత వేసుకోవలసిన పథకం ఆలోచించడానికి ప్రియురాలి దగ్గరకు వెళ్ళడానికి ప్రయత్నించవచ్చు. అతడు బయలుదేరితే అతడిని వెన్నాడి ఏమి చేసినది ఎక్కడికి వెళ్ళినదీ తేల్చేబాధ్యత నీది. అతడి గది వెతికితే అతడి రహస్యాలు ఏమైనా బయటపడవచ్చు. నేను ఆ పని చూస్తాను" చెప్పాడు ప్రభాకర్.

5

సూర్యం మెల్లిగా గేటుదాటి రోడ్డెక్కాడు.

దగ్గరలోనే వున్న కాఫీ హోటల్‌లో రోడ్డువైపు కిటికీ వారనే కూచున్న డిటెక్టివ్ లిద్దరూ అది చూచారు.

సూర్యం హోటల్ దాటాడు. హరి హోటల్ విడిచి అతడిని వెన్నాడాడు.

యథాప్రకారం జగదాంబా సెంటర్‌లో దిగాడు సూర్యం. అన్నభట్లవారి వీధిలోకి తిరిగాడు. హరి ఈసారి ఏమాత్రం ఏమరుపాటు చూపక అతడిని వెన్నాడసాగాడు.

సూర్యం తిన్నగా వెళ్ళి ఒక యింటిముందు ఆగి తలుపు మీద మూడుమార్లు టకటకమని కొట్టాడు. అతడు తలుపు తట్టిన విధానం మనసులో ముద్రించుకున్నాడు హరి.

అప్పటికి సంజచీకట్లు ముసిరాయి. ఒక యువతి వచ్చి

తలుపు తెరిచింది. సూర్యం లోపల ప్రవేశించాడు. తలుపులు మూసుకున్నాయి.

హరి మెల్లగా ఆ యింటిని సమీపించాడు. వీధి దీపాలు వెలగని ఆ వీధి హరి పాలిట వరమయింది. తలుపుకు చెవి ఆనించి వారి మాటల నాలకించసాగాడు. సూర్యం ఆమెను సంబోధించిన తీరునుబట్టి ఆమె పేరు సరోజ అని తెలుసుకున్నాడు హరి.

అయిదు నిముషాలు గడిచాయి.

సరోజతో మంతనాలు ముగించి సూర్యం బయటకు రాబోతున్నాడు. అది పసిగట్టిన హరి ప్రక్కనే వున్న చెత్త కుండీ చాటున నక్కాడు.

సూర్యం రోడ్డెక్కి చకచకా నడవసాగాడు సెంటర్ వైపు. సూర్యం సెంటర్ వరకూ వెళ్ళాక, హరి గుమ్మం ముందుకు వచ్చి అంతకు ముందు సూర్యం తట్టిన మాదిరిగా మూడుమార్లు తలుపుమీద తట్టాడు.

"ఇప్పుడే కదా బయటకు వెళ్ళావు? ఇంతట్లో ఏం మునిగింది?" అంటూ తలుపు తెరిచింది సరోజ.

గుమ్మం ముందు అపరిచితుడైన హరి. చటుక్కున తలుపు మూయబోయింది. హరి ఆమెను బలవంతంగా తోసుకుని లోపల అడుగుపెట్టాడు. ఆమె అరవబోయింది. హరి అందుకు అవకాశం ఇవ్వలేదు. ఆమె నోట గుడ్డలు కుక్కాడు. కాళ్ళూ చేతులూ బంధించి మూల కుదేశాడు. గదంతా క్షుణ్ణంగా పరిశీలించాడు. కుమారరాజా రవివర్మ బ్రీఫ్‌కేసు ఆ గదిలో దొరికింది హరికి.

వెంటనే ఆ గదికి బయట తాళంపెట్టి, ముందుగా బాస్‌కు ఫోన్ చేశాడు. అతడు లైన్‌లో దొరకలేదు. ఇంకా ఇంటికి రాలేదని చెప్పింది సుజాత. ఇన్‌స్పెక్టర్

కాంతారావుకు ఫోన్ చేశాడు. అతడు క్షణాలలో తన బృందాన్ని వెంటపెట్టుకుని వచ్చాడు.

తన బాస్ సూర్యం గదికి వెడతానన్న విషయం చటుక్కున జ్ఞాపకం వచ్చింది హారికి. అందరూ రవివర్మ యింటికి బయలుదేరారు.

6

అరగంట తర్వాత డిటెక్టివ్ ప్రభాకర్ చకచకా నడిచి' ఆ చీకట్లో ఆనందవర్మ యింటి ఆవరణలోని సూర్యంక్వార్టరు తాళం మారుతాళం చెవితో తెరిచి, లోపల ప్రవేశించాడు. సూర్యం క్వార్టరు చుట్టుప్రక్కల జనం వుండటంతో ప్రభాకర్‌కు వెంటనే రావటానికి వీలుపడలేదు.

చీకటిలో గోడలు తడిమి స్విచ్ నొక్కాడు. చక్‌మని గది ప్రకాశవంతమయింది. ఎదురుగా ట్రంకుపెట్టె, దాని మీద మడచిపెట్టిన జంబుఖానా దిండు కనిపించాయి.

పెట్టెముందు కూచుని వాటిని తీసి క్రిందపెట్టాడు. పెట్టెకు వేసివున్న తాళాన్ని పరిశీలించాడు. జేబులోని మారుతాళం చెవుల గుత్తితీసి. పెట్టె తాళానికి అనుగుణమైన చెవి ఒకటి యెంచిపెట్టాడు. కొంత ప్రయాసపడి తెరిచాడు.

పెట్టెలో పై భాగాన కొన్ని దుస్తులున్నాయి. వాటిని తీసి క్రింద పెట్టాడు. అడుగుభాగాన వున్నవి చూడగానే ప్రభాకర్ కనులు మెరిశాయి. అక్కడ అతనికి కనిపించినది ఒక బూడిదరంగు సూటు. దానిని ఈవలకు తీశాడు.

పెట్టెకు అట్టడుగున పాతకాలంనాటి న్యూస్‌పేపరు ఒకటి మడతపెట్టి కనిపించింది. దానిమీద బాక్సుకట్టి, హిప్పీ క్రాపు గుబురుగా పెరిగిన గడ్డం మీసాలతో వున్న

ఒక వ్యక్తి ఫోటో దానిక్రింద కొన్ని వివరాలు కనిపిం పించాయి. ఉత్సాహంగా ఈలవేసి సూటు న్యూస్ పేపర్ పట్టుకుని పైకి లేవబోతున్నాడు ప్రభాకర్.

వెనుక ఏదో నీడ కదలాడినట్టయింది. చటుక్కున వెనక్కి తిరుగుతూ అదే ఊపున ప్రక్కకు వాలిపోయాడు. వెనుక నుండి సూర్యం ఇనుపకడ్డీ ఒకటి ప్రభాకర్ వైపు విసిరాడు. ప్రభాకర్ ప్రక్కకు వాలివుండకపోతే కపాల మోక్షం అయివుండేది. అయినా ప్రక్కటెముకల మీద బలమైన దెబ్బ తగిలింది ప్రభాకర్‌కు.

సూర్యం తిరిగి కడ్డీతో కొట్టబోయాడు. ప్రభాకర్ పల్టీ కొట్టి బంతిలా పైకిలేచి సూర్యం చేతిని వెనుక నుండి ఒడిసిపట్టి ఒక్క గుంజు గుంజాడు. కడ్డీజారి నేలమీద పడింది. వెంటనే ప్రభాకర్ వెనుక నుండే సూర్యాన్ని సందిట గట్టిగా పట్టుకున్నాడు.

సూర్యం రెండు చేతులూ వెనక్కి చాపి ప్రభాకర్ తల ఒడిసిపట్టి ఎత్తి ముందుకు పడేటట్టు విసిరికొట్టాడు. ఆ విసురుకు ప్రభాకర్ సూర్యం యెదురుగా వెల్లకిలా పడ్డాడు.

సూర్యం పులిలా ప్రభాకర్ మీదకు లంఘించబోయాడు. ప్రభాకర్ రెండు కాళ్లూ మీదకు ఎత్తి సూర్యం నడుమును ఇండియన్ డెడ్‌లాక్ పద్ధతిలో బిగించి ఒక్క ఊపు ఊపాడు. సూర్యం ఎముక కలుక్కుమంది. చాపచుట్టగా నేలమీద కూలబడ్డాడు.

సరిగ్గా అదే సమయంలో హరి, ఇన్‌స్పెక్టర్ కాంతా రావు లోపల కడుగుపెట్టారు.

7

"మొత్తానికి చాలా కాలం నుండి పోలీసుశాఖ ఎంత ప్రయత్నించి పట్టుకోలేకపోయిన తోడుదొంగలు పోలారావు ఉరఫ్ సూర్యాన్ని అతడి ప్రియురాలైన రజియాను పట్టుకుని దేశానికి మహోపకారం చేశావు. రవివర్మ హంతకుడు సూర్యమేననీ అతడే పోలారావనీ ఎలా నిర్ధారణకు వచ్చావు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ కాంతారావు.

"ఇటీస్ వెరీ సింపుల్! విజయవాడ ప్లాట్‌ఫాంమీద కుమారరాజారవివర్మను వర్ణించిన ప్రతీవారి వర్ణనా సూర్యంతో సరిపోయింది. దానికి తోడు అతనితోబాటు ఒక స్త్రీ కూడా వున్నట్టు అక్కడే తేలింది. సూర్యం పెట్టెలో దొరికిన పేపరు కటింగ్‌లో గత కొద్ది సంవత్సరాలుగా దేశంలోని సంపన్నుల యిళ్ళలో జరిగిన దొంగతనాలు. వాటలో కొన్నిటికి కారకులు పోలారావూ అతడి ప్రియురాలు రజియా అని వ్రాసివుంది. కాని వారు ఎవరికీ దొరకలేదు.

అప్పుడే నేను చూచిన సూర్యం రూపానికి ఫోటోలోని హిప్పీ క్రాపు గుబురు మీసం గెడ్డాలు పెట్టి ఊహించాను. అంతే! పోలారావు రూపం ప్రత్యక్షమయింది. అతడి ప్రియురాలు రజియా కూడా పట్టుబడిపోయింది" అని ఆనందవర్మ వైపు తిరిగి, "ఆనందవర్మాజీ! అయామ్ వెరీ సారీ!" అన్నాడు ప్రభాకర్ సానుభూతిగా.

"మీరు సారీ ఎందుకు చెప్పాలి? ఇది నా ఖర్మ. అంతటి విలువైన నగలతో నా కొడుకును పంపడం నా మొదటి తప్పు. ఆనుపానులు తెలియని వ్యక్తులను నౌకరీలో చేర్చుకోవడం రెండవ తప్పు" అన్నాడు ఆనందవర్మ దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో. □

క్రొత్త సీరియల్ ప్రారంభం

సాహస శిఖరం

వసుంధర

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహాసాగర్ డామ్ దగ్గర ఆ రోజు ఎంతో కోలాహలంగా వుంది.

సిమ్మెంట్‌తో మైలు పొడవు, ఆరువందల అడుగుల ఎత్తుగా నిర్మించిన డామ్ మేరుపర్వతంలా గంభీరంగా గర్వంగా నిలబడి వుంది. డామ్ పైన జనం సముద్రతరం

గాల్లా కదుల్తున్నారు. ఆరుమైళ్ళ మట్టిడామ్ మీద జనం చీమల బారుల్లా పోతున్నారు. జీపులు, కార్లు హడావుడిగా పోతున్నాయి. అందరూ ఒకే లక్ష్యం దగ్గరకు చేరుకుంటున్నారు.

మహాసాగర్ డామ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. ప్రధాన మంత్రి కుడి, ఎడమ కాలువలకు ప్రారంభోత్సవం చేసే రోజు. ఆంధ్రప్రదేశ్ రైతులకలలు పండే సుదినం. ప్రధాని ప్రారంభోత్సవం జరుపగానే కృష్ణా నదీ జలాలు కాలువలలోకి దూకి ఎడతెరిపి లేకుండా ప్రయాణించి లక్షలాది ఎకరాలకు నీరు అందిస్తాయి. రైతుల హృదయాలను ఆనందంతో తడుపుతాయి. ఆ క్షణాలు రానే వచ్చాయి.

డామ్ నిర్మాణంలో గత పదిహేనేళ్ళుగా పనిచేసిన ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు, వర్కర్లు, కూలీలు మాత్రమేకాక ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచీ రైతులు గూడా వుత్సాహంతో పాల్గొన్నారు.

సాయంకాలం నాలుగు గంటలకు ఆకాశంలో విమానం కన్పించింది. వేదిక చుట్టూ చేరిన వేలాది ప్రజలు తలలు ఎత్తి తధేకంగా చూస్తున్నారు. కొందరు సంతోషంతో చప్పట్లు కొట్టారు.

అక్కడికి నాలుగుమైళ్ళ దూరంలో వున్న విమానాశ్రయంలో విమానం దిగింది. అరగంట తర్వాత విమానాశ్రం నుంచి ప్రధానమంత్రి కూర్చున్న కారు, వెనుకా ముందూ లెక్కలేనన్ని కార్లు, జీపులు, అంబులెన్సు వగైరా బయల్దేరాయి. రోడ్డుకి రెండు ప్రక్కలా ప్రజలు చేతులు వూపుతూ ప్రధానికి స్వాగతం చెప్తున్నారు.

ప్రధాని వేదికపైకి ఎక్కుతూ వుండగా ప్రజలు హర్ష

నాదాలు చేశారు. వేదికపైకి చేరుకుని రెండు చేతులూ జోడించి సభికులకు అభివందనం చేశారు ప్రధాని.

వందేమాతరం గీతాలాపనతో సభ ప్రారంభమైంది.

మాహాసాగర్ డామ్ ప్రాంతంలోని కాలనీలలోని అధిక భాగం వుద్యోగులు ప్రధానమంత్రి కాలువలకు ప్రారంభోత్సవం చేసే ఉత్సవంలో పాల్గొనగా వర్కర్ల కాలనీలో వాళ్ళు మాత్రం క్వార్టర్స్‌లో వుండిపోయారు.

పదిహేనేళ్ళుగా నిర్విరామంగా పనిచేసిన వర్కర్లుగా ఇక పనిలేదు. రేపో మాపో మూటాముల్లె సర్దుకుని ఇళ్ళకి పోవాల్సిన వాళ్ళే. పొలాలకు నీళ్ళు వచ్చి బంగారం పండుతుందని రైతులు సంతోషిస్తున్న సమయంలో, ఆ నీళ్ళు రావడానికి ఏళ్ళతరబడి చెమటోడ్చి పనిచేసిన వర్కర్లు ఏడవాల్సి వచ్చింది.

ఫోర్‌మన్ జ్వాలాప్రతాప్ క్వార్టర్లో పేకాట జోరుగా సాగుతోంది

జ్వాలాప్రతాప్‌కి ఏభై ఏళ్ళు దాటాయి. అతని పేరు చాలా మందికి తెలియదు. 'బ్రహ్మచారి' అంటేనే తెలుస్తుంది. పెళ్ళెందుకు చేసుకోలేదో ఎవరికీ తెలీదు. ఎక్కడో ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చాడు. ఎత్తుగా, గంభీరంగా వుంటాడు. గుబురు మీసాలు తిప్పుకుంటూ, స్నేహితులతో ఛలోక్తులు ఆడుతూ చీకూ, చింతా లేకుండా కాలం గడిపేస్తుంటాడు. కుర్రాళ్ళు అతన్ని 'దాదా' అని ఆప్యాయంగా పిలుస్తుంటారు.

ఫోర్‌మన్ కాబట్టి వర్కర్ల కాలనీలో 'ఏ' టైపు క్వార్టర్ యిచ్చింది గవర్నమెంట్. అందులో రెండు కుటుంబాలు హాయిగా వుండొచ్చు బ్రహ్మచారి ఏం చేసుకుంటాడు? క్వార్టర్స్ లేని కుర్రాళ్ళు ఎవరొచ్చి అడిగినా

కాదనడు.

డామ్ వర్కు ముమ్మరంగా సాగే రోజుల్లో బ్రహ్మాచారి క్వార్టర్ ఒక సత్రమే. అందులో ఎందరుంటున్నారో అతనికే తెలిసేది కాదు. చాలా మందికి క్వార్టర్స్ వచ్చి వెళ్ళిపోయారు. చివరికి అతనితోపాటు నలుగురు మిగిలారు. అంతా పాతికేళ్ళకి అటూ, ఇటూ వున్న కుర్రాళ్ళే.

"కిశోర్ భాయ్ లైటు వెయ్యరా. చీకటి పడింది. ముక్కలు కనిపించటం లేదు" అన్నాడు జ్వాలా.

కిశోర్ లైటువేసి వచ్చి కూర్చున్నాడు.

"ఈ పాటికి కాలువలకు నీళ్ళు వదిలివుంటారా?" అన్నాడు మేఘనాథ్ రెడ్డి.

"ఆఁ....వదిలేవుంటార్లే. పైన విమానం మోత వినలా?" అన్నాడు కృష్ణమూర్తి.

"మనం కూడా వెళ్తే బాగుండేది" అన్నాడు రెడ్డి. ఆ దృశ్యం చూడాలని అతనికి ఎంతగానో వుంది.

"ఎట్లా వెళ్తాం సిగ్గులేకుండా? ఎవరు పిలిచారని మనల్ని?" రోషంగా అన్నాడు ఫణీంద్ర.

"పబ్లిక్ మీటింగ్‌కి పిల్చేదేమిట్లేరా! వెళ్ళాలనుకుంటే వెళ్ళడమే" అన్నాడు రెడ్డి.

"నోర్మూయ్యరా చెత్తవాగుడు కట్టిపెట్టి. మనం పబ్లిక్కా! ఎవడ్రా ఆ మాటనేది? ఇన్నాళ్ళూ మనం గూడా కష్టపడితేనే డామ్ తయారైంది. మనకు అందులో భాగం లేదూ! మనకి ఇన్విటేషన్ ఇవ్వాలని ఆ మాత్రం బుద్ధి లేదూ వాళ్ళకి" ఫణీంద్ర ఇంతెత్తున ఎగిరాడు రెడ్డిమీద.

"సర్లేరా నీ వాదన. ఎందరికని ఇన్విటేషన్లు ఇస్తారు?"

"అటువంటప్పుడు కొందరికి మాత్రం ఎందుకివ్వాలి? అంతా సమానమే. పెద్ద పెద్ద అధికారులకి, ఆఫీసర్లకి

ఫ్యామిలీలతో సహా వెళ్ళేందుకు ప్యాసులు ఇచ్చుకున్నారు. మనకి కనీసం రమ్మని ఇన్విటేషన్ గూడా లేదు సిగ్గు.... సిగ్గు...."

"అరె భాయ్! అయిపోయిన పెళ్ళికి బాజాల్లాగా ఎందుకురా ఇప్పుడు ఆ గొడవ? జరగబోయేది ఆలోచించు కోండి" అన్నాడు జ్వాలా నవ్వుతూ.

"ఆలోచన ఏవుంటుంది? ఇళ్ళకి పొమ్మని శుభలేఖలు ఇచ్చారుగా. రేపు ఆ డబ్బు ఇవ్వగానే పోవడమే" అన్నాడు మేఘనాథ్ రెడ్డి.

"ఇంటికి పోయి ఏం చేయాలి?" దిగులుగా అన్నాడు ఫణీంద్ర.

ఎవరూ మాట్లాడలేదు. ఏమీ తోచడంలేదు వాళ్ళకి.

"మాకు సర్వీస్ తక్కువ అనుకో దాదా! నువ్వెప్పుడు చేరావు? డామ్‌కి శంకుస్థాపన చేసినప్పుడు గదా! నిన్ను గూడా టెర్మినేట్ చేసి యింటికి పొమ్మనడం యెంత అన్యాయం?"

"నువ్వు బ్రహ్మచారివి కాబట్టి సరిపోయింది. అదే నీకు భార్యా, బిడ్డలున్నారనుకో అప్పుడు నీ గతేంకాను?"

"అప్పుడు దాదా పెళ్ళాం పిల్లల్ని వదిలి సన్యాసుల్లో కలిసివుండేవాడు."

వాళ్ళ మాటలకు దాదా గట్టిగా నవ్వాడు. నల్లగా, తెల్లగా మెరుస్తున్న గడ్డం సవరించుకుని, మీసాలు తిప్పుతూ అన్నాడు. "జ్వాలా సంగతి మీకు తెలీదురా. పిడుగులు పడినా లెక్కలేదు నాకు. వుద్యోగం పోతే చలిస్తానా! ఐ డోంట్ కేర్. మీ వయసప్పుడు జీవితం అంటే భయం వుందన్న మాట నిజమే. కాని ఇప్పుడు ఉక్కులా గట్టిపడిపోయాను. ఇక నాకు ఏ దిగులూలేదు."

"దాదా నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు?" ప్రశ్నించాడు కిశోర్.

జ్వాలాప్రతాప్ ముఖంలో నీలిమేఘాలు కదిలాయి కొన్ని క్షణాలు. "అదంతా ఇప్పుడెందుకులేరా భాయ్! తర్వాత ఎప్పుడైనా చెప్తాలే" అన్నాడు.

"ఎవరూ బలవంత పెట్టలేదు.

పేకాట సాగుతూనే వుంది.

రాత్రి ఎనిమిది కొట్టింది.

కుర్రాడు రెండు క్యారియర్లు తెచ్చి గదిః పెట్టి వెళ్ళిపోయాడు. అంతా పేకాటలో నుంచి లేచి భోజనాలు చేశారు. ఎవరూ సరిగా భోజనం చెయ్యలేను. మనసుల్లో దిగులు. గుండెల్లో బరువు. భవిష్యత్తు గురించి భయం. ఎలా బ్రతకాలి? మళ్ళీ ఎక్కడైనా వుద్యోగం దొరుకుతుందా?

జ్వాలా ఒక్కడే ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. మిగిలిన వాళ్ళు చాపలమీద పడి దొర్లుతున్నారు, నిద్రరాక. ఎప్పటికో కలత నిద్రపోయారు వాళ్ళు.

2

రాత్రి పన్నెండు దాటింది.

సన్నగా వాన పడుతోంది.

వరండాలో నుంచి కుక్క అరుపు వినిపించి అంతా నిద్రలేచారు.

జ్వాలా ముందుగా లేచి లైట్లు వేశాడు. తలుపు తీసుకుని వరండాలోకి వెళ్ళాడు. ఆ దృశ్యం చూపి విభ్రాంతితో నిలబడిపోయాడు.

కుక్క భౌ....భౌ....అని అరుస్తూ చిందులు తొక్కుతోంది. దానిముందు నల్లత్రాచు పాము పడగ విప్పి బుస

కొడుతూ ఆగ్రహంతో తల తిప్పుతోంది.

లైటు వెలగడం, మనుష్యులు రావడం చూపి కుక్కకి మహోత్సాహంగా వుంది. కయ్యానికి కాలు దువ్వుతూ త్రాచుని కాచుకుంది. త్రాచుపాము రెచ్చిపోయింది. కుక్క దాని చుట్టూ తిరుగుతూ మెడమీద కరవాలని ప్రయత్నిస్తోంది. పాము బుస్సు.... బుస్సు మని బుసకొడుతూ పడగతో కాటువెయ్యాలని చూస్తోంది.

"దాదా తుపాకి తీసి పాము పని పట్టరాదా!" అన్నాడు మేఘనాథ్ రెడ్డి.

జ్వాలా తలూపి "నాకా ఆలోచన రాలేదు భాయ్!" అంటూ విసురుగా లోపలకు వెళ్ళాడు. తుపాకీ తీసి లోడ్ చేసుకుని వచ్చేసరికి ఘోరం జరగనే జరిగిపోయింది.

కుక్కకీ, పాముకీ హోరాహోరీగా పోరాటం జరిగింది. అందులో పాము కుక్కని కాటువేసింది. కుక్క పాము మెడ కొరికి చంపింది. కాసేపటికి నురుగులు కక్కుకుని కుక్క చచ్చిపోయింది.

అదంతా కలా? నిజమా? అన్నట్లు విభ్రాంతితో చూస్తున్న వాళ్ళంతా తేరుకున్నారు.

"ఇంగ్లీషు సినిమా చూస్తున్నంత థ్రిల్లింగ్‌గా వుంది నాకైతే" అన్నాడు కృష్ణమూర్తి.

"పాపం కుక్క అన్యాయంగా చచ్చిపోయింది. దాదా తుపాకీ తెచ్చేలోపే పాము కాటువేసింది. బ్యాడ్‌లక్" అన్నాడు రెడ్డి.

"ముంగిస పాము పోట్లాడుకోవడం నేను సినిమాల్లో చూశాను గాని, కుక్క పాముతో పోట్లాడ్డం ఇదే చూడ్డం" అన్నాడు ఫణీంద్ర.

చాలాసేపు వరకూ అంతా అదే విషయం గురించి మాట్లాడుకుంటూ వుండిపోయారు.

"కిశోర్ ఎక్కడ? నిద్ర లేవలేదా?" ప్రశ్నించాడు కృష్ణమూర్తి అందరివంకా చూస్తూ.

అంతా ముఖాలు చూసుకున్నారు.

"ఇంత గందరగోళం జరుగుతుంటే మెలకువ రాకుండా వుంటుందా?"

"మరీ అంత మొద్దునిద్ర పోడే!"

మేఘనాథ్ రెడ్డి వెళ్ళి తలుపు తట్టాడు. లోపల్నుంచి రెస్పాన్స్ రాలేదు.

"కిశోర్....కిశోర్."

తలుపులు కొట్టారు.

లాభం లేకపోయింది.

జ్వాలా బ్యాట్రీలైట్ వేసి కిటికీలో నుంచి చూశాడు.

కిశోర్ చాపమీద వెల్లకిలా పడుకుని వున్నాడు. కొంచెం దూరంలో ఖాళీ గాజుగ్లాసు వుంది. గ్లాసు క్రింద మడత పెట్టిన కాగితం కనిపిస్తోంది.

"వీడు సూసైడ్ చేసుకున్నట్లుగా కనిపిస్తోంది" జ్వాలా కంపిస్తున్న స్వరంతో అన్నాడు.

అందరి గుండెలు గుభేలుమన్నాయి.

"దాదా ఇప్పుడెట్లా? వూపిరి ఆడుతున్నట్లే వుంది. వాడేమో లోపల గడి పెట్టుకున్నాడు. మనం వాడిని సేవ్ చెయ్యలేమేమో?"

"భయపడకండి" అన్నాడు దాదా.

జ్వాలాముఖం గంభీరంగా ఎర్రగా మారిపోయింది. పరుగున వెళ్ళి గునపం తెచ్చాడు. కొంచెం సేపటికి తలు

పులు విరిగిపడ్డాయి.

ఫణీంద్ర పరుగున వెళ్ళి కిశోర్ పల్సు చూశాడు.

"ఫరవాలేదు. వెంటనే హాస్పటల్‌కి తీసికెళ్తే సేవ్ అవుతాడు" అన్నాడు.

కృష్ణమూర్తి గ్లాసు క్రింద కాగితం తీసి మడత విప్పాడు.

'నాకు జీవితంమీద విరక్తి పుట్టింది. నా చావుకి ఎవరూ కారణం కాదు.'

కిశోర్ సంతకం వుంది.

"నేను అంబులెన్స్ తీసుకొస్తాను" అంటూ మేఘనాథ్ రెడ్డి వెళ్ళబోయాడు.

"నువ్వెళ్ళి అంబులెన్స్ తెచ్చేటప్పటికి పరిస్థితి క్షీణించవచ్చు. మనమే మోసుకెళ్దాం" అన్నాడు జ్వాలా.

అంతా 'సరే' అన్నారు.

కిశోర్‌ని మోసుకుని రోడ్డుమీదకు తీసికెళ్ళేసరికి పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ వ్యాన్ వచ్చింది. అందులో వేసుకుని హాస్పటల్‌కి తీసికెళ్ళారు.

కిశోర్ మృత్యుముఖం నుంచి బైటపడ్డాడు.

కిశోర్‌కి నెలక్రితమే వుద్యోగం పోయింది. అతను ఎల్.డి.సి. గా పనిచేసేవాడు. మిత్రుల బలవంతాన అక్కడే వుండిపోయాడు. రోజూ బాగానే వుండేవాడు. ఇప్పుడు వున్నట్లుండి ఆత్మహత్య చేసుకోవాలనుకోవడానికి కారణం ఏమిటి? అది ఎవరికీ అంతుపట్టడం లేదు. ఎక్కడ సంపాదించాడో నిద్రమాత్రలు సంపాదించి వేసుకున్నాడు.

నిరుద్యోగిలే అని పోలీసులుగూడా కేసుపెట్టకుండా వదిలేశారు.

3

రాత్రంతా ఎవరికీ నిద్రలేదు.

ప్రాణభయం లేదని డాక్టర్ చెప్తున్నా ఆందోళన తగ్గ లేదు. టెన్షన్‌తో అంతా హాస్పటల్ వరండాలోనే కూర్చుండిపోయారు.

తెల్లవారిన తర్వాత కిశోర్‌కి తెలివి వచ్చింది. సిగ్గుతో తలెత్తి ఎవరి వంకా చూడలేకపోయాడు.

"నన్నెందుకు బ్రతికించారు?" హీనస్వరంతో అన్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏడుస్తున్నావా భాయ్! ఛా...." అంటూ జ్వాలా అతని కన్నీళ్ళు తుడిచాడు.

"మళ్ళీ మిమ్మల్ని చూస్తాననుకోలేదు" అన్నాడు కిశోర్.

"అనుకున్నవన్నీ జరగవు భాయ్! మనిషి లైఫ్ అంతే. ఉద్యోగం పోయిందని ఎవరైనా చచ్చిపోతారా? ఎంత పిరికి సన్నాసివోయ్ నువ్వు" నవ్వుతూ అన్నాడు జ్వాలా.

"ఉద్యోగం గురించి కాదు."

"మరి?" ఆశ్చర్యంగా చూశాడు జ్వాలా.

కిశోర్, కృష్ణమూర్తి వంక చూశాడు.

"ఆ కథ నాకు తెలుసు దాదా!" అన్నాడు కృష్ణమూర్తి.

"కథా?"

"అవును దాదా! ప్రేమకథ" నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

దాదా ఆశ్చర్యంనుంచి తేరుకోక ముందే నర్సు వచ్చి అందర్నీ వెళ్ళిపొమ్మని కేకలు పెట్టింది.

"ఇంటికి పద దాదా! ఆ కథంతా చెప్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

"వీడికొక ప్రేమకథగూడా వుందా?" అంటూ ఎంతో ఆశ్చర్యపోయాడు ఫణీంద్ర.

"ఆశ్చర్యం ఏముంది? వయసులో వున్నవాళ్ళకి అది సహజమే" అన్నాడు జ్వాలా.

కృష్ణమూర్తి, కిశోర్ ప్రేమకథ చెప్పాడు.

మోడరన్ హోటల్ ప్రొప్రయిటర్ కూతురు అపర్ణ, కిశోర్ ప్రేమించుకున్నారు. కిశోర్‌కి వుద్యోగం వుందిగదా అని పెళ్ళికి ఒప్పుకున్నాడు. కట్నం పదివేలు ఇవ్వడానికి గూడా అంగీకరించాడు.

ఇప్పుడు కిశోర్‌కి వుద్యోగం వూడింది. అందుకని కథ అడ్డం తిరిగింది. అపర్ణ తండ్రి ఆమెకు వేరే సంబంధం చూస్తున్నాడు. తనకు వుద్యోగం దొరికేవరకూ ఆగమని కిశోర్ ఎంత ప్రతిమాలినా ఆయనగారు వినడంలేదు. అపర్ణను, కిశోర్ కలుసుకోకుండా కట్టుదిట్టాలు చేశాడు.

అదంతా విని జ్వాలా ప్రతాప్ పెద్దగా నిట్టూర్చాడు.

"ప్రేమకు పెద్దవాళ్ళకూ ఎప్పుడూ విరోధమే. అదేమి గమ్మత్తోగాని పురాణకాలం నుంచి ఎన్నో ప్రేమకథలు వింటున్నాను, అన్నింటిలోనూ పెద్దవాళ్ళే విలన్లుగా వ్యవహరిస్తుంటారు. ప్రేమికులకు అదేమి శాపమో" అన్నాడు.

"కరెక్టుగా చెప్పావు దాదా!" అన్నాడు మేఘనాథ్.

"అయినా కిశోర్ ఆత్మహత్య చేసుకోబోవడం ఏం బాగా లేదు. అందువల్ల సాధించేది ఏముంది? రేపు ఆ పిల్ల వీడు పోయాడని, వీడిలాగా ఆత్మహత్య చేసుకుంటుందా? కొన్నాళ్ళు బాధపడినా ఆ తర్వాత హాయిగా పెళ్ళి చేసుకొంటుంది. పిచ్చివాడు మనవాడు" అన్నాడు ఫణీంద్ర.

"అయినా ఒక ఆడపిల్ల దక్కలేదని ఆత్మహత్య చేసుకోవాలా? లోకంలో ఇక ఆడపిల్లలే లేరా? వీడికి పెళ్ళి

కాదని భయమా?" అన్నాడు మేఘనాధ్.

"రెడ్డీ! అనుభవంలోకి రాని విషయాల గురించి మాట్లాడ్డం తేలికే. ప్రేమించుకున్న వాళ్ళకి తెలుస్తుంది ఆ బాధ. నువ్వూ ఎవర్నయినా ప్రేమిస్తే అప్పుడు తెలుస్తుంది. ప్రేమలో ఆ మహత్యం వుందిలే" అన్నాడు జ్వాలా.

"చూడబోతే దాదాకి ప్రేమలో చాలా అనుభవం వున్నట్లుందే" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

"పిచ్చివాడా! ప్రేమ అందరికీ అనుభవంలోకి రాదురా! అదృష్టవంతులు కొందరే ప్రేమించుకోగలుగుతారు."

"ప్రేమించుకున్న వాళ్ళు అదృష్టవంతులా దాదా?" ప్రశ్నించాడు మేఘనాధ్.

"సందేహం ఎందుకురా భాయ్! ప్రేమ ఫలం కానీ, విఫలంకానీ అది వేరేసంగతి. ప్రేమలోని మాధుర్యం వాళ్ళు అనుభవించగలుగుతారు. మహాకవి గాలిబ్ ఏమన్నాదో తెలుసా? ప్రేమించకుండా వుండడంకన్నా, ప్రేమించి విఫలం అవడం మేలు అన్నాడు."

"శభాష్ దాదా! భలే కొటేషన్ చెప్పావు" అని చప్పట్లు కొట్టాడు కృష్ణమూర్తి.

"కాబట్టి మనం కిశోర్ ప్రాణం కాపాడినట్లే, వాడి ప్రేమనుగూడా కాపాడాలి" అన్నాడు జ్వాలా.

"ఎలా సాధ్యం?"

"నేనున్నాను గదా!" అని నవ్వాడు జ్వాలా.

4

జ్వాలా ప్రతాప్ కొండలా అండగా నిలబడి కిశోర్‌కి ధైర్యం కలిగించాడు. పెద్దవాడు అనుభవజ్ఞుడు అయిన దాదా తన పక్షాన వుండడంతో కిశోర్‌కి జీవితం మీద ఆశ చిగురించింది. నెమ్మదిగా కోలుకున్నాడు.

దాదా సలహాతో అపర్ణను అతికష్టం మీద కలుసుకో గలిగాడు. కిశోర్ వెంట రావడానికి అపర్ణ అంగీకరించింది. ఇక అతని ఆనందానికి అవధుల్లేవు. పరుగున వచ్చి ఆ విషయం అందరికీ చెప్పాడు.

జ్వాలా నవ్వాడు.

"ప్రేమ ప్రభావం అటువంటిది కిశోర్. పుట్టిన దాదిగా పెంచి పెద్దజేసి, చదువు చెప్పించి, ఇంతదాన్ని చేసిన తల్లి దండ్రుల్ని కాదని కొద్ది పరిచయం గల నీతో రావడానికి ఎందుకు ఒప్పుకుందంటావ్? అది వయసు మహత్యం. ఆమె మనసిప్పుడు నీతో నిండిపోయి వుంది. ఆమె హృదయంలో నువ్వు తిష్టవేసుకుని కూర్చున్నావ్. ఇప్పుడామె సర్వస్వం నువ్వే. తల్లిదండ్రులు, బంధుమిత్రులు వగైరా అంతా మాయగా కనిపిస్తారు. నీ వెంట నరకానికైనా రావడానికి రెడీగా వుంటుంది."

దాదా మాటలు అంతా మంత్రముగ్ధుల్లా విన్నారు.

"థాంక్స్ దాదా! నువ్వు లేకపోతే నే నీ పాటికి పై లోకంలో వుండే వాడిని. నే నిప్పుడు మీ అందరి మధ్యా వున్నానంటే దానికి కారణం నువ్వే" కృతజ్ఞతా పూర్వకంగా అన్నాడు కిశోర్.

"థాంక్స్ నాకు కాదు చెప్పాల్సింది. నువ్వు ఆత్మహత్య చేసుకోవాలనుకున్న రోజున వచ్చిన త్రాచుపాముకి, దాని జాడ కనిపెట్టి మొరిగిన కుక్కకీ ఋణపడివున్నావు. అప్పుడా సంఘటన జరగకపోతే మేము నిద్ర లేచేవాళ్ళం కాదు. నీ గురించి ఆలోచించే వాళ్ళం కాదు. తెల్లవారే టప్పటికి నువ్వు యముడి దగ్గరికి జేరుకుని వుండేవాడివి" అన్నాడు జ్వాలా.

"అవున్నా కిశోర్! నీ ప్రాణాలు కాపాడటానికే వచ్చిందా

పాము. కుక్క, పాముల ఆయుషు నువ్వు పోసుకుని వాటిని చంపావు" అన్నాడు కృష్ణమూర్తి

అందరూ కృష్ణమూర్తి మాటలతో ఏకీభవించారు.

"దాదా! మన వుద్యోగాలు వూడిపోయాయి. మనకి రావాల్సిన డబ్బు కూడా రేపో మాపో వచ్చేస్తాయట. బిల్స్ ట్రెజరీకి వెళ్ళాయని తెల్సింది. ఆ తర్వాత మనం ఎటు వాళ్ళం అటు విడిపోతాం. మళ్ళీ యీ జన్మలో కలుసుకోలేం గదా!" గాద్గదికమైన కంఠంతో అన్నాడు మేఘనాధ్ రెడ్డి.

"రెడ్డి చెప్పింది నిజమే దాదా! కొన్నేళ్ళుగా కల్సిమెల్సి అన్నదమ్ముల్లా వున్నాం. నువ్వు మాకు పెద్దన్నలా కనిపిస్తావు. నువ్వు దూరమైపోతున్నావంటే ఎంతో బాధగా వుంది" అన్నాడు ఫణీంద్ర.

"తప్పదు భాయ్! మనిషి లైఫ్ అంతే. ఎంతో విచిత్రంగా వుంటుంది. ఎక్కడో పుడతాడు. ఎక్కడో పెరుగుతాడు. మరెక్కడో చనిపోతాడు. అతనితో అనుబంధం పెంచుకున్న వాళ్ళు వెంట వుంటారా? పిచ్చిగాని...." నవ్వాడు దాదా.

"దాదా! నీ గురించి ఎవరికీ ఏమీ చెప్పవు. అడిగినా ఆ విషయం దాటేస్తావు. ఇప్పుడు మనం విడిపోయే సమయం వచ్చింది. నీ జీవితం బహుంలోతైనదని నిన్ను చూస్తుంటేనే తెలిసిపోతుంది. ఇప్పుడైనా చెప్పవా? తెలుసుకోవాలని మాకు యెంతో కుతూహలంగా వుంది" అన్నాడు కృష్ణమూర్తి.

దాదా అందరి వంకా ఒకసారి చూశాడు. అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, 1 నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

"అలాగే బాయ్! తప్పకుండా చెప్తాను" అన్నాడు.

జ్వాలాప్రతాప్ తన కథ చెప్పసాగాడు.

5

నలభై సంవత్సరాల క్రితం సంగతి.

రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యంలో భారతదేశం వారికి బంగారు గనిగా వున్న రోజులు.

వందల కొద్దీ చిన్న, పెద్ద సంస్థానాలను తమ గుప్పిట్లో పెట్టుకుని కప్పం కట్టించుకుంటూ వెలలేని వజ్రవైఢూర్యాలు, రత్నాలరాసులు, వెండి బంగాలు బ్రిటన్‌కు తరలించుకు పోతున్న తరుణం. భారత సంస్థానాధీశులు దేశాన్ని బ్రిటీష్ వారికి తాకట్టు పెట్టి తమ విలాసాల్లో మునిగి తేలుతున్న దౌర్భాగ్య స్థితి అది.

జ్వాలాప్రతాప్ ఉత్తరప్రదేశ్‌లోని హరిపూర్ సంస్థానంలో పుట్టాడు. రాజుగారు దుర్గాప్రతాప్ సింహ మూడో భార్య బిందుమాధవికి ఏకైక సంతానం. అంతఃపురంలో అల్లారుముద్దుగా పెరిగాడు.

రాజుగారికి ఏడుగురు భార్యలు కాక లెక్కలేనంత మంది వుంపుడుకత్తెలుగా అంతఃపురంలో వుండేవారు. వారసులు, బేవారసులతో కోలాహలంగా వుండేది. సకల సౌకర్యాలు, విందులు విలాసాలు, ఎంతో వైభవంగా జరిగిపోతూవుంది కాలం. జ్వాలాప్రతాప్ చదువుతోపాటు యుద్ధవిద్యలు గూడా నేర్చుకుంటున్నాడు.

అప్పుడు అనుకోకుండా ఒక సంఘటన జరిగింది.

హరిపూర్ సంస్థానానికి ఆనుకుని వున్న మరో సంస్థానం దుర్గాపూర్. ఆ సంస్థానం రాజు మదనసింహ. పేరుకు తగినట్లే జీవితం అనుభవించడానికేనని ఆయన వుద్దేశ్యం. వేట, తాగుడు, స్త్రీ సుఖం ఇవి తప్ప మరొక

అపరాధ పరిశోధనపోటీ-191

ఈ క్రిందకొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-6-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '84 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామి—? (మల్హోత్రా, రాకేష్)
2. ఈ దేశంలోని అల్లర్ల అగ్నిజ్వాలలు ఇంకా సమసిపోలేదు—? (శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్)
3. సామాన్య మానవుడికి ఇవి అందుబాటులో లేకుండా పోతున్నాయి—? (మోటారు కారు, టెలిఫోన్)
4. ఈ పరిశ్రమ రాబోయే కొద్ది కాలంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చును—? (చలనచిత్ర పరిశ్రమ, పత్రికా పరిశ్రమ)
5. అవినీతి బురదలో మునిగిన మరో అమాత్య శేఖరుడు—? (రామారావు ఆదిక్, వసంతరావు పాటిల్)

ఆలోచన వుండేది కాదు.

రాజ్యాధార మంతా మంత్రులే చూసుకునే వారు. మంత్రులు, సైనికాధికారుల వంటి కీలక పదవుల్లో బంధువుల్నే నియమించాడు కాబట్టి వారు స్వామిద్రోహం చెయ్యడానికి వెరచి జాగ్రత్తగానే వుంటున్నారు. రాజుగారి విలాసాలకు కావలసిన డబ్బుకి కొదవలేకుండా జరిగిపోతూనే వుంది.

హరిపూర్‌లో దుర్గ ఆలయం పురాణ ప్రసిద్ధి చెందింది. పాండవ వంశ చక్రవర్తి ధర్మరాజు ఆ ఆలయం కట్టించాడని చెప్పుకుంటారు. అంతపెద్ద ఆలయం ఉత్తర భారతంలో ఎక్కడా కనిపించదు.

దసరా పండుగ పదిరోజులా ఆలయంలో వైభవంగా వుత్సవాలు జరుగుతాయి. హరిపూర్ సంస్థానంలోని ఊళ్ళ నుంచి జనం తండోపతండలుగా వచ్చి చేరుకుంటారు. అంతేకాక చుట్టుప్రక్కల సంస్థానాల రాజుల్ని ప్రత్యేకంగా హరిపూర్ ఆహ్వానిస్తారు. వారికి ప్రత్యేకంగా విందులు ఏర్పాటు చేస్తారు ఘనంగా సత్కారాలుచేసి ఏ లోటూ రాకుండా చూడడానికి రాజ పరివారం ఎంతో శ్రమపడుతుంది.

ఆ పది రోజులూ విందులు జరుగుతాయి. లక్షలు మంచినీళ్ళలా ఖర్చయిపోతాయి. అర్ధరాత్రి వరకూ ఆలయం ఆవరణ చుట్టుప్రక్కల వేసిన పందిళ్ళలో లెక్కలేనన్ని సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. హరికథలు, బుర్రకథలు, యక్షగానాలు, పురాణ శ్రవణాలు మాత్రమేగాక నర్తకీమణుల నృత్యగానాదులు గూడా జోరుగా సాగుతాయి.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 6-6-'84 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '84 నెల సంచికలో ప్రకటిస్తాము. ✱

ఏప్రెల్ '84 పోటీ ఫలితాలు

(1) ఏప్రెల్' 84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఆకారాన్ని చూసి అరవకు!
బొమ్మను చూసి బెదరకు!!

పంపినవారు: శ్రీ షేక్ బాజ్జి, c/o డాన్ భాష, 'ఈనాడు' ఏజెంట్, మార్టేరు - 534 122, ప.గో. జిల్లా.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పెదవి దాటని అరుపు!
ఎవరిది మీలో గెలుపు!!

పంపినవారు: శ్రీమతి ఎస్. లక్ష్మి, w/o ఎస్.వి. కృష్ణారావు, ఎస్.వి.ఎ. నిలయం, ఆర్.ఎస్. పేట, తుని-533 401.

ఒకరోజు దుర్గాపూర్ సంస్థానాధీశులు ఒక పందిట్లో జరుగుతున్న నృత్య ప్రదర్శన దగ్గర హఠాత్తుగా ఆగి పోయారు. నాట్యం వారిని ఆకర్షించిందని తెలుసుకుని పరివారం వారికి వేదిక దగ్గరగా ఉచితాసనం ఏర్పాటు చేశారు.

అక్కడ నాట్యం చేస్తున్న యువతి రూపరాణి. మన్మథ సింహ రాజావారు ఆమె నృత్యం చూసి మతి పోగొట్టు కున్నారు. అంత చలాకీగా నాట్యం చేసిన భామను అంతకు ముందెన్నడూ వారు చూడలేదు. దేవేంద్ర సభ నుంచి దిగి వచ్చిన రంభ కంటే గూడా అందగత్తె అనుకున్నారు. కళ్ళు ఆర్పకుండా ఆమెనే చూస్తూ హృదయాన్ని ఆమెకు అర్పించివేశారు.

రూపరాణి వయసు పట్టుమని పదహారేళ్ళు లేవు. రాజ నర్తకి మేనక ముద్దుల కూతురు. తొలిసారిగా దేవాల యంలో గజ్జె కట్టి ఆడుతోంది.

ఆమె యీడేరి సంవత్సరం కావస్తోంది. హరిపూర్ రాజావారే కన్నెరికం పెట్టాలని నిశ్చయమైంది. కాని రాజావారికి తీరికలేక, మంచి సుముహూర్తం దొరకక కాలం దొర్లిపోతోంది.

రూపరాణి సౌందర్యం వేదికమీద చిందులువేస్తుంటే దుర్గాపూర్ రాజావారు ఆమెపై కోరికతో కాగిపోతున్నారు. ఆమె అందాన్ని కళ్ళతోనే గ్రోలుతూ మత్తులో పడి పోయారు.

రూపరాణి పొడగరి. కోలముఖం. విశాలమైన నేత్రాలు బంగారు శరీర ఛ్ఛాయ పాలు, పెరుగు, వెన్నతో సుకు మారంగా పెరిగిన శరీర లావణ్యం. నాట్యం చేస్తుంటే కదుల్తూ చూపరుల గుండెల్ని అదరగొట్టే ఎత్తు గుండెలు.

శ్రీ మహాలక్ష్మివారి వెరైటీ నవలలు

విడుదలైనవి!

1. కొత్త శత్రువు — మల్లాది వెంకటకృష్ణమూర్తి
2. మేఘమాల — ,,
3. సిగ్గు - సిగ్గు — N. R. నంది
   (ఆంధ్రభూమి సీరియల్)
4. మిస్టర్ సంపత్ M.A. — మాదిరెడ్డి సులోచన
5. కల్లోల గౌతమి — అల్లాదేవి
   (జ్యోతి మంత్లీ సీరియల్)
6. మేలుకొలుపు — చివుకుల పురుషోత్తం
7. ఖైదీ — A.V. మోహన్రావ్
   (అపన సీరియల్)

పూర్తి కేటలాగునకై నేడే రాయండి

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ-2

భూలోక రంభలాంటి ఆ అందాలరాశిని పొందని జన్మ వృధా అని తలపోశారు మన్మథసింహావారు. నాట్యం ముగిసినా వారు అచేతనంగా ఆసనంలో ఉండిపోయారు. విడిదికి వెళ్ళి విచారాగ్రస్తులై నిద్రలేమితో బాధపడ్డారు.

ఆ రాత్రి వారికి నిద్రలేదు. పీక్కుపోయిన ముఖంతో, ఎర్రబడిన కళ్ళతో, ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగావున్న రాజావారిని చూసి పరివారమంతా కలవరపడ్డారు. రాజావారికి ఏదైనా అవమానం, అమర్యాద జరుగలేదు గదా అని హరిపూర్ రాజసేవకులు కంగారుపడ్డారు.

ఉదయం స్నాన, పానాదులు పూర్తయ్యాక తను అంతరంగిక సైనికాధికారి చెవిలో అసలు రహస్యం వూదారు. రూపరాణిని ఎలాగైనా చేపట్టాలన్నారు.

"ఓస్! ఇదెంత పని ప్రభూ! ఓ గండాసి గురించి దిగులు ఏల? డబ్బు ఆశ చూపిస్తే దాని అమ్మ, అమ్మమ్మ గూడా బయల్దేరి వస్తారు. ఆ వ్యవహారమంతా నేను చూసుకుంటాను. తమరు నిశ్చింతగా వుండండి" అన్నాడు సైనికాధికారి.

అయితే అది అతను అనుకున్నంత సులువు కాదని తర్వాత తెలిసింది.

దుర్గాపూర్ సైనికాధికారి అంతులేని కానుకలను పేటికలతో పట్టించుకుని రాజనర్తకి మేనక ఇంటికి వెళ్ళాడు.

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd. no: H/HD-48
'PRABHAKAR'